గురువారం
21-8-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 331
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

అఫ్ఘాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం: 79 మంది దుర్మరణం

కాబూల్: అఫ్ఘానిస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఇరాన్ వలసదారుల బస్సు పశ్చిమ అఫ్ఘాన్‌లో ప్రమాదానికి గురైంది. 17 మంది పిల్లలు సహా 79 మంది ప్రాణాలు కోల్పోయారని అధికారులు బుధవారం వెల్లడించారు. హెరాత్ - కాబూల్ హైవేపై ఈ ప్రమాదం జరిగిందన్నారు. ఒక బైకు, ట్రక్కు, బస్సు వరుసగా ఢీకొన్నాయని హెరాత్ ప్రావిన్స్ సమాచార శాఖ అధికారి అహ్మదుల్లా ముత్తకీ తెలిపారు. ఈ ప్రమాదం సమయంలో బస్సులో మంటలు చెలరేగినట్లు అంతర్గత వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి అబ్దుల్ మతీన్ వెల్లడించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందితో సహా స్థానికులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారన్నారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించినట్లు అధికారి చెప్పారు.

'అగ్ని-5' పరీక్ష విజయవంతం

భువనేశ్వర్: మధ్యంతర శ్రేణి బాలిస్టిక్ క్షిపణి 'అగ్ని-5' పరీక్ష విజయవంతమైంది. ఒడిశాలోని చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుంచి 'స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్' ఆధ్వర్యంలో ఈ పరీక్ష జరిగింది. అన్ని సాంకేతిక, కార్యాచరణ ప్రమాణాలను అందుకున్నట్లు రక్షణ వర్గాలు వెల్లడించాయి. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఈ అధునాతన క్షిపణిని 'మల్టీపుల్ ఇండిపెండెంట్ టార్గెటబుల్ రీ-ఎంట్రీ వెహికల్ సాంకేతికతతో అభివృద్ధి చేశారు. ఒకే క్షిపణితో అనేక వార్‌హెడ్లను వేర్వేరు లక్ష్యాలపై ప్రయోగించవచ్చు.

గాజా స్వాధీనానికి ఇజ్రాయిల్ సిద్ధం

జెరూసలెం: గాజా నగరాన్ని స్వాధీనం చేసుకునే ప్రణాళికను ఇజ్రాయిల్ రక్షణ మంత్రి కట్జ్ ఆమోదించారు. సెప్టెంబర్‌లో ప్రారంభమయ్యే చర్యల్లో భాగంగా సుమారు 50,000 మంది సైనికులను పిలిపిస్తామని ఒక సైనిక అధికారి బుధవారం వెల్లడించారు. దాడి తదుపరి దశలో గాజా నగరంపై దృష్టి సారించే విధుల్లో దళాలు ఉంటాయన్నారు. ప్రణాళిక ప్రారంభ దశలో గాజా నగరంలోని జైటౌన్, జబాలియా పరిసరాల్లో సైన్యం ఇప్పటికే విస్తరించిందని అన్నారు. కాగా, బందీలందరినీ ఒకేసారి విడుదల చేసే ఒప్పందాన్ని, తమ షరతుల ప్రకారం యుద్ధాన్ని ముగించడానికి ఇజ్రాయిల్ అంగీకరిస్తుందని వెల్లడించారు.

పాక్‌కు సిగ్గు చేటు: భారత్

న్యూఢిల్లీ: మహిళలపై దారుణలకు పాల్పడిన చరిత్ర పాకిస్థాన్ సైన్యానిదని, అయినా చర్యలు శూన్యమని భారత్ దుయ్యబట్టింది. ఆ దురాగతాలు ఆగడంలేదని ఐరాస వేదికగా ఆగ్రహం వ్యక్తం చేసింది. 1971 నాటి పరిస్థితులను గుర్తుచేసింది. ఐరాస మానవ హక్కుల కమిషన్‌తోపాటు ఎన్నో అంతర్జాతీయ సంస్థలు తమ నివేదికల్లో పాకిస్థాన్ దురాగతాలను పేర్కొన్నట్లు ఐరాసలో భారత రాయబారి ఎల్డోస్ మాథ్యూ పున్నూస్ వెల్లడించారు. ఐరాస భద్రతా మండలిలో 'సంఘర్షణ-సంబంధిత లైంగిక హింస' అనే అంశంపై ప్రసంగిస్తూ పాక్‌ను ఎండగట్టారు. క్రూరమైన చర్యలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇదీ లోకం!

నీకు నిరుద్యోగ భృతి ఇంకా అందలేదా? ఇంక కష్టమేమో!

ఓటు హక్కు ప్రశ్నార్థకం

- ఈసీ రాజ్యాంగ సంస్థగా పనిచేయడం లేదు
- బీజేపీ, మోదీని గద్దె దించేందుకు ప్రజాతంత్ర లౌకిక శక్తులు ఏకం కావాలి
- ఇండియాలో పరస్పర సహకారం, సర్దుబాటు అవసరం
- జస్టిస్ సుదర్శన్ రెడ్డి గెలుపు భవిష్యత్ రాజకీయాలకు మలుపు
- సీపీఐ తెలంగాణ రాష్ట్ర మహాసభను ప్రారంభిస్తూ డి.రాజా

హైదరాబాద్ (పొట్లూరి నాగేశ్వరరావు నగర్): రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ప్రశ్నార్థకంగా మారిందని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఆందోళన వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండేలా చూడటంలో భారత ఎన్నికల సంఘం రాజ్యాంగ సంస్థగా లేదా తటస్థ సంస్థగా పనిచేయడం లేదని విమర్శించారు. అందుకే బీహార్‌లో ఓటర్ల హక్కు కోసం పెద్దఎత్తున ఉద్యమం ప్రారంభమైందన్నారు. రాజ్యాంగం, ప్రతి ఒక్కరి ఓటు హక్కు పరిరక్షించబడాలంటే బీజేపీని, ప్రధాని మోదీని గద్దె దించాల్సిన అవసరం ఉందని రాజా స్పష్టంచేశారు. అందుకు లౌకిక, ప్రజాతంత్ర పార్టీలన్నీ ఒకే వేదికపైకి రావాలని పిలుపునిచ్చారు. మేడ్చల్ మల్కాజ్ జిల్లాలోని 'కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వరరావు

నగర్' (గాజుల రామారం)లోని 'కామ్రేడ్ ఎన్.బాలమల్లేశ్ హాల్' (మహారాజా గార్డెన్స్)లో మూడు రోజుల పాటు జరిగే సీపీఐ రాష్ట్ర 4వ మహాసభ బుధవారం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమైంది. ప్రారంభ సభకు సీపీఐ శ్రేణులు ఎర్రచొక్కాలు, ఎర్రచీరలు ధరించి పెద్దఎత్తున హాజరయ్యారు. ప్రాంగణమంతా అరుణవర్ణం సంతరించుకుంది. మహాసభ ప్రారంభోత్సవ సభలో ముఖ్యఅతిథిగా రాజా, అతిథులుగా సీపీఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్ పాషా పాల్గొన్నారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సౌహార్ద సందేశాలిచ్చారు. మహాసభ ఆహ్వాన సంఘం అధ్యక్షుడు ఎండీ యూసుఫ్ అధ్యక్షతన జరిగిన సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, పశ్య పద్మ, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి, కె.శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, ఎంఎల్‌సీ నెల్లికంటి సత్యం, మాజీ ఎంఎల్‌సీ పీజే చంద్రశేఖరరావు, సీనియర్ నాయకులు కందిమళ్ల ప్రతాపరెడ్డి, కవి, రచయిత ఏటుకూరి ప్రసాద్, సీపీఐ రాష్ట్ర

- మిగతా 2 లో

ప్రతిపక్షాలే లక్ష్యం

లోక్‌సభలో రాక్షస బిల్లులు ప్రవేశపెట్టిన అమిత్‌షా

- జేపీసీకి పంపే తీర్మానానికి ఆమోదం
- తీవ్రంగా వ్యతిరేకించిన 'ఇండియా' ఎంపీలు
- బిల్లు ప్రతులు చించి... నిరసన
- రాజ్యాంగం, సమాఖ్య వాదానికి వ్యతిరేకమని మండిపాటు
- అధికార-ప్రతిపక్ష సభ్యుల మధ్య తోపులాట

న్యూఢిల్లీ: తీవ్రమైన నేరారోపణలతో అరెస్టయి వరుసగా 30 రోజుల పాటు నిర్బంధంలో ఉన్న ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి లేదా మంత్రులు తమ పదవిని కోల్పోయేలా కేంద్రంలోని మోదీ సర్కారు తీసుకొచ్చిన బిల్లులు లోక్‌సభలో తీవ్ర దుమారాన్ని రేపాయి. సంచలన నిబంధనలతో కూడిన ఈ బిల్లులను కేంద్ర హోంమంత్రి అమిత్ షా బుధవారం సభలో ప్రవేశపెట్టగా, ఇండియా ఐక్య సంఘటన తీవ్రంగా వ్యతిరేకించింది. కనీసం ఐదేళ్ల శిక్ష పడే నేరానికి పాల్పడి, అరెస్టయి, నెల రోజులు కస్టడీలో ఉంటే 31వ రోజున వారి పదవి పోయేలా నిబంధనను చేర్చారు. వారు రాజీనామా చేయకపోయినా కొత్త నిబంధన ప్రకారం పదవిని కోల్పోతారు. దీనిని ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి. రాజ్యాంగ (130వ సవరణ) బిల్లు, జమ్ము కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వ (సవరణ) బిల్లులను అమిత్ షా సభ ముందుంచారు. ఈ బిల్లులు కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లోని ప్రజా ప్రతినిధులకు వర్తించేలా కొత్త చట్టపరమైన నిబంధనలను ప్రతిపాదిస్తున్నాయి. అమిత్ షా లోక్‌సభలో బిల్లులు ప్రవేశపెట్టిన సందర్భంగా ఇండియా ఐక్యసంఘటన ఎంపీల నుంచి నుంచి పెద్దఎత్తున నిరసన వ్యక్తమైంది. కేంద్రం హడావిడిగా లోక్‌సభలో ప్రవేశపెట్టిన ప్రతిపాదిత బిల్లులు రాజ్యాంగం, సమాఖ్య వాదానికి వ్యతిరేకంగా ఉన్నాయని ముక్తకంఠంతో నిరసించారు. ఒక దశలో

- మిగతా 2 లో

ప్రజలతోనే మా పొత్తు

కూనంనేని సాంబశివరావు

విశాలాంధ్ర-హైదరాబాద్ (కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వరరావు నగర్): కమ్యూనిస్టు పార్టీ స్థాయికి తగిన ఉద్యమాలను కొంతకాలంగా నిర్మించలేదని, ఇందుకు అధికార కాంగ్రెస్‌తో ఎన్నికల్లో ఉన్న అవగాహన ఒక కారణమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. ప్రభుత్వం స్థిమితపడేందుకు కొంత సమయం ఇవ్వాలని ఎదురు చూశామని తెలిపారు. తమకు పొత్తు ఉన్న మాట వాస్తవమేనని, అసలు పొత్తు ప్రజలతోనేనని చెప్పారు. మున్ముందు ప్రజా సమస్యలపై పెద్దఎత్తున ఉద్యమాలకు కార్యాచరణను మహాసభలో రూపొందిస్తామన్నారు. మేడ్చల్ మల్కాజ్ జిల్లా కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వరరావు నగర్ కామ్రేడ్ బాలమల్లేశ్ హాలులో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర నాలుగవ మహాసభలో బుధవారం కూనంనేని సాంబశివరావు ప్రతినిధుల సభలో ముసాయిదా రాజకీయ, నిర్మాణ నివేదికను ప్రవేశపెట్టారు. ఎన్నికల హామీల విషయంలో కాంగ్రెస్ కొంత మంచిగానే చేస్తున్నప్పటికీ... ప్రజల్లో మిగతా హామీల విషయంలో కొంత అసంతృప్తి ఉన్నదన్నారు. కాంగ్రెస్ ఎన్నికలలో కలిసి పోటీ

చేసినంత మాత్రాన కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభించే ప్రజా వ్యతిరేక విధానాలు, ఎన్నికల హామీల అమలు కమ్యూనిస్టు పార్టీ విమర్శ, పోరాటం విషయంలో రాజీపడబోమని స్పష్టం చేశారు. పార్టీకి బలమైన అవకాశాలు ఉన్న నియోజకవర్గాలపై దృష్టి సారించి ప్రాధాన్యతాక్రమంలో కేంద్రీకరించి పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజావ్యతిరేక విధానాలు అవలంబించిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపడంలో సీపీఐ కీలక పాత్ర పోషించిందని వివరించారు. బీజేపీపై బీఆర్ఎస్ విమర్శిస్తున్నప్పటికీ పరోక్ష సహకారం అందిస్తోందని విమర్శించారు. కాళేశ్వరం విచారణ, ఇతర కేసులతో ఆ పార్టీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నదని, బీజేపీలో సైతం

- మిగతా 2 లో

హైదరాబాద్ చారిత్రక నగరం

మూసీ ప్రక్షాళన, భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం కొంతమందికి ఇష్టం లేదు

- తెలంగాణ సమగ్రాభివృద్ధికి 2047 ప్రణాళిక
- ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ శంకుస్థాపనలో సీఎం రేవంత్

విశాలాంధ్ర-హైదరాబాద్: హైదరాబాద్ ఒక చారిత్రక నగరమని, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడానికి ఆనాటి కులీ కుతుబ్ షాహీ నుంచి ఈనాటి వరకు ఎంతోమంది కృషి చేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. వారి కృషి వల్లే ప్రపంచ చిత్రపటంలో ఒక గొప్ప నగరంగా హైదరాబాద్‌కు కీర్తి ప్రతిష్ఠలు దక్కాయన్నారు. బుధవారం గచ్చిబౌలిలో డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ కార్యాలయం, ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సీఎం రేవంత్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఆనాడు రాజీవ్ గాంధీ చేసిన కృషి వల్లే దేశంలో ఐటీ రంగం అభివృద్ధి చెందిందని గుర్తు చేశారు. తెలంగాణలోనూ హైటెక్ సిటీ అభివృద్ధికి ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం పునాది వేసిందని, ప్రపంచంలో ప్రసిద్ధిగాంచిన కంపెనీలు ఇక్కడికి వచ్చాయంటే ఆనాటి ముఖ్యమంత్రుల దూరదృష్టినే కారణమన్నారు. మూసీ ప్రక్షాళన, భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం కొంతమందికి ఇష్టం లేదని విమర్శించారు. ఆనాడు హైటెక్ సిటీ నిర్మాణాన్ని కూడా కొంతమంది అవహేళన చేశారని, హైదరాబాద్ నగరానికి బెంగుళూరు, చెన్నై లాంటి నగరాలతో పోటీ కాదని, టోక్యో, న్యూయార్క్ లాంటి నగరాలతో హైదరాబాద్ పోటీపడుతుందని తెలిపారు. తెలంగాణ సమగ్ర అభివృద్ధికి 2047 ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని, హైదరాబాద్ పాతబస్తీ... అది ఓల్డ్ సిటీ కాదు... ఒరిజినల్ సిటీ అని చెప్పుకొచ్చారు. మూసీ ప్రక్షాళనతో ఓల్డ్ సిటీకి పూర్వ వైభవాన్ని తీసుకొస్తామని స్పష్టం చేశారు. గోదావరి జలాలను తీసుకొచ్చి 365 రోజులూ మూసీలో నీరుండేలా రివర్ ఫ్రంట్ అభివృద్ధి చేస్తామని వివరించారు. మధ్యతరగతి ప్రజల కోసం నగరంలో రాజీవ్ స్వగృహ భవనాలను నిర్మించాలని నిర్ణయించామని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగాలంటే నగర

- మిగతా 2 లో

మద్యం దుకాణాల టెండర్లకు నోటిఫికేషన్

రూ.3 లక్షలకు పెరిగిన దరఖాస్తు ఫీజు

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో మద్యం దుకాణాల టెండర్లకు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్రంలోని మొత్తం 2,620 మద్యం దుకాణాలకుగాను లైసెన్సుదారుల ఎంపిక ప్రక్రియకు సంబంధించి ఆబ్కారీ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రస్తుతం ఉన్న మద్యం దుకాణాల లైసెన్సుల గడువు నవంబరు 30తో ముగియనుంది. డిసెంబరు 1 నుంచి మద్యం దుకాణాలు ఏర్పాటు కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే కొత్త లైసెన్సులను లాటరీ ద్వారా ఎంపిక చేసేందుకు ఎక్సైజ్ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. అప్లికేషన్ రుసుము రూ.3 లక్షలు నాన్ రిఫండబుల్‌గా ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాల వారీగా నోటిఫికేషన్ ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. 2025-2027 సంవత్సరానికి మద్యం దుకాణాల టెండర్లకు నోటిఫికేషన్ విడుదల చేసిన తెలంగాణ ప్రభుత్వం ఈసారి లైసెన్స్ దరఖాస్తు ఫీజును అమాంతం పెంచేసింది. గతంలో రూ.2 లక్షలు ఉన్న దరఖాస్తు రుసుమును ఏకంగా లక్ష రూపాయలు పెంచి రూ.3 లక్షలు చేసింది. ఫిక్స్‌డ్ షాప్ టాక్స్ ఆధారంగా లాటరీ పద్ధతిలో మద్యం దుకాణాల కేటాయించనున్నారు. దరఖాస్తు దాఖలులో ఎలాంటి పరిమితులు లేవు. ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులయినా సమర్పించుకోవచ్చు. లైసెన్స్ కాల పరిమితిలో ఎలాంటి మార్పు లేదు. డిసెంబరు 1, 2025 నుంచి నవంబరు 30, 2027 వరకు మాత్రమే నిర్ణయించారు. ఈ సారి మద్యం షాపు

- మిగతా 2 లో

ఉపరాష్ట్రపతి ఎన్నిక

సైద్ధాంతిక పోరు

- రాజ్యసభ నిష్పాక్షిక పనితీరుకు జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఎన్నిక అవశ్యం
- ఆయన నామినేషన్ ప్రతిపక్షాల ఐక్య సంకల్పానికి రూపం
- 'ఇండియా' భేటీలో మల్లికార్జున ఖడ్గే



న్యూఢిల్లీ: ఉపరాష్ట్రపతి పదవి కోసం ఇండియా ఐక్య సంఘటన అభ్యర్థిగా జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి నామినేషన్ వేస్తుండటం ప్రతిపక్ష పార్టీల గౌరవం, నమ్మకానికి నిదర్శనమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే అన్నారు. రాజ్యసభలో ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు అవకాశం ఇవ్వడం లేదని, ఈ పరిస్థితుల్లో జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఎన్నిక కీలకమన్నారు. 'ప్రతిపక్షాల గొంతు నొక్కే ధోరణి పార్లమెంటులో చూస్తున్నాం. కీలక అంశాలపై మమ్మల్ని మాట్లాడనివ్వడం లేదు. ఇలా తరుచూ జరుగుతోంది. పార్లమెంటులో అణచివేతను ప్రతిఘటించడం కోసం దేశానికి ఉత్తమమైన, నిష్పాక్షిక ఉపరాష్ట్రపతి అవసరం. ఈ పదవికి జస్టిస్ సుదర్శన్ రెడ్డి అన్ని విధాలా అర్హులు. భారతదేశాన్ని నిర్వచించే ప్రజాస్వామిక సిద్ధాంతాల పరిరక్షణకు ప్రతిపక్షాల ఐక్య సంకల్పాన్ని ప్రతిబింబింపజేసేదే సుదర్శన్ రెడ్డి నామినేషన్' అని ఖడ్గే వక్కాణించారు. ప్రతి పౌరుడి ఔన్నత్యానికి, న్యాయానికి, రాజ్యాంగానికి కట్టుబడిన జీవితాన్ని జస్టిస్ సుదర్శన్ రెడ్డి గడుపుతున్నారని అన్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ

- మిగతా 2 లో

ఢిల్లీ సీఎంపై దాడి

చెంపదెబ్బ కొట్టిన అర్జీదారు

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాపై దాడి జరిగింది. బుధవారం ఉదయం సివిల్ లైన్స్‌లోని సీఎం నివాసంలో 'జన్‌సున్‌వాయ్' కార్యక్రమం నిర్వహిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి అకస్మాత్తుగా వచ్చి సీఎంను చెంపదెబ్బ కొట్టాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు దాడికి పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు చెంపదెబ్బ కొట్టినట్లు ప్రత్యక్షసాక్షులు వెల్లడించారు. మరోవైపు ఈ ఘటనను అధికార, ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాయి. 35 ఏళ్ల వయసున్న ఓ వ్యక్తి ఈ దాడికి పాల్పడినట్లు బీజేపీ వెల్లడించింది. తొలుత అతడు కొన్ని పేపర్లను సీఎంకు అందించిన తర్వాత ఈ దాడికి పాల్పడినట్లు తెలిపింది. ఫిర్యాదుదారుడు దాడికి పాల్పడిన వెంటనే, సీఎం రేఖా గుప్తాను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. సీఎం నివాసం వద్ద భద్రతా వైఫల్యంపై సైతం విచారణ జరుగుతోందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఈ ఘటనతో సీఎం రేఖా గుప్తా

- మిగతా 2 లో

రష్యాపై ఒత్తిడి కోసమే...

భారత్‌కు సుంకాల భారంపై అమెరికా

వాషింగ్టన్: రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నామనే కారణంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై సుంకాల భారాన్ని మోపారు. శ్వేతసౌధం ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ మాట్లాడుతూ ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని ముగించేందుకు రష్యాపై ఒత్తిడి తెచ్చేందుకు న్యూఢిల్లీపై ట్రంప్ సుంకాలు విధించారన్నారు. ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని వీలైనంత త్వరగా ముగించాలని అధ్యక్షుడు నిశ్చయించుకున్నారన్నారు. రష్యాతో వాణిజ్యం కొనసాగించే దేశాలను లక్ష్యంగా చేసుకొని దానిపై ఒత్తిడి తీసుకురావాలనుకున్నారని, అది ట్రంప్ పరిపాలన వ్యూహమని వ్యాఖ్యానించారు. ఇందులో భాగంగా భారత్‌పై 50 శాతం సుంకాలను విధించిన విషయాన్ని గుర్తుచేశారు. నాటో సెక్రటరీ జనరల్‌తో సహా యూరోపియన్ నాయకులతో చర్చలే యుద్ధం ముగింపునకు తొలి అడుగుగా అభివర్ణించారు. ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మధ్య సానుకూలంగా చర్చలు జరిగాయన్నారు. ట్రంప్ అధికారంలో ఉంటే అసలు యుద్ధం వచ్చేదే కాదన్నారు. పుతిన్ కూడా ఇదే చెప్పారని ఆమె తెలిపారు. భారత్-పాక్ యుద్ధాన్ని ట్రంప్ ముగించారని మళ్లీ చెప్పారు.

'శాంతి'తోనే స్వర్గానికి: ట్రంప్

వాషింగ్టన్: ఉక్రెయిన్-రష్యా మధ్య యుద్ధం ముగిసి, శాంతి ఒప్పందం జరిగితే తనను స్వర్గానికి వెళ్లే మార్గం సుగమమవుతుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఓ ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. నోబెల్ శాంతి బహుమతి గెలుచుకునే యత్నంలో భాగంగానే మాస్కో-కీవ్ మధ్య శాంతి కోసం ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఆ రెండు దేశాధ్యక్షులతోపాటు యూరోపియన్ నేతలతోనూ ఇటీవల చర్చలు జరిపారు. తన ప్రయత్నాలు జీవితానికి సంబంధించినవి కావని, అవి తన మోక్షమార్గానికి జరిగే ప్రయత్నాలంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'నేను బాగా పనిచేయడం లేదట. ఒకవేళ నేను స్వర్గానికి వెళ్తే అందుకు దోహదం చేసే అంశాల్లో ఇది (శాంతి ఒప్పందం) ఉంటుంది' అని ట్రంప్ వెల్లడించారు. కొన్నేళ్లుగా అనేక విమర్శలు, అభియోగాలు, కోర్టు కేసులను ఎదుర్కొంటున్న ట్రంప్ గతేడాది హత్యాయత్నం నుంచి బయటపడిన తర్వాత అనేక సందర్భాల్లో భక్తిభావాన్ని ప్రదర్శిస్తున్నారు. అధ్యక్ష బాధ్యతలు చేపట్టినప్పుడు అమెరికాను మళ్లీ గొప్పగా నిలబెట్టేందుకు 'ఆ దేవుడే నన్ను కాపాడాడు' అని ఆయనన్నారు. శ్వేతసౌధంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలనూ నిర్వహిస్తున్నారు. ఓ ఆధ్యాత్మిక గురువును సలహాదారుగా పెట్టుకున్నారు. ట్రంప్ తాజా వ్యాఖ్యలపై శ్వేతసౌధం ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ స్పందిస్తూ స్వర్గానికి వెళ్లాలని అధ్యక్షుడు కోరుకుంటున్నారని, ఇక్కడ ఉన్నవారంతా అదే కోరుకుంటారని ఆశిస్తున్నానని చెప్పారు.

అమెరికాకు వాణిజ్యం ఓ అస్త్రం

భారత్‌తో ఇంధన సహకారానికి ఢోకాలేదు: రష్యా

మాస్కో: భారత్ విషయంలో అమెరికా చాలా అన్యాయంగా వ్యవహరిస్తోందని రష్యా వ్యాఖ్యానించింది. భారత్-రష్యా మధ్య ఇంధన సహకారం భవిష్యత్తులోను కొనసాగుతుందని ఆ దేశ దౌత్యవేత్త రోమన్ బబుష్కిన్ వెల్లడించారు. భారత్‌తో సంబంధాలపై పూర్తి విశ్వాసముందని చెప్పారు. అమెరికా ఆర్థిక వ్యవస్థలను ఆయుధంలా వాడుతోందని విమర్శించారు. భారత్‌కు ఎటువంటి ఇబ్బంది రాకుండా చమురు సరఫరా చేసేందుకు మాస్కో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసిందన్నారు. సగటున ఐదు శాతం రాయితీతో భారత్ అవసరాల్లో 40 శాతం మేర సరఫరా చేస్తున్నామని చెప్పారు. అమెరికా మార్కెట్లకు ఎగుమతి చేసేందుకు భారత్ ఇబ్బంది పడుతుంటే, రష్యా మార్కెట్లు స్వాగతం పలుకుతాయని బబుష్కిన్ వెల్లడించారు. భారత్‌కు అండగా నిలుస్తామని, చిన్న, మాడ్యులర్ అణు రియాక్టర్లపై చర్చలు పురోగతి సాధించినట్లు చెప్పారు. గతంలో బ్రహ్మోస్ క్షిపణుల తయారు చేశాం. ఇప్పుడు శక్తిమంతమైన జెట్ ఇంజిన్లపై పని చేస్తున్నామన్నారు. అధ్యక్షుడు పుతిన్ స్వల్ప వ్యవధిలోనే రెండుసార్లు ప్రధాని మోదీతో మాట్లాడారని, సమస్యల పరిష్కారానికి భారత్, రష్యా కలిసి పని చేస్తున్నాయన్నారు. రష్యాను శిక్షించేందుకు ఆంక్షలు విధించినవారే అందుకు ప్రతిఫలాన్ని అనుభవిస్తున్నారని రోమన్ బబుష్కిన్ చెప్పారు. కాగా, రష్యా ఉత్పత్తి చేసే ఉరల్స్ చమురు కొనుగోళ్లను భారత్ రిఫైనరీలు పునరుద్ధరించాయి. ఐవోసీ, బీపీసీఎల్ తాజాగా సెప్టెంబర్, అక్టోబర్ నెలలో సరఫరాకు ఆర్డర్లు పెట్టాయి. భారత్ నుంచి కొనుగోళ్లు పెరగడంతో చైనాకు సరఫరాలు తగ్గనున్నాయి. జులైలో రాయితీలు తగ్గడంతో భారత సంస్థలు కొనుగోళ్లు నిలిపివేశాయి. అనంతరం రాయితీ 3 డాలర్లకు పెరిగింది.

ఢిల్లీ సీఎంపై దాడి

(మొదటిపేజీ తరువాయి)

పూర్తిగా దిగ్భ్రాంతికి గురైనట్లు ప్రత్యక్ష సాక్షి ఒకరు తెలిపారు. 'ఈ కార్యక్రమం జరుగుతున్నప్పుడు రేఖ గుప్తా ప్రజల మాటలను వింటున్నారు. వెనక నుంచి శబ్దం వచ్చినట్లు వినిపించింది. మేం తిరిగి చూసే సరికి పోలీసులు దాడి చేసిన వ్యక్తి తీసుకెళ్లారు' అని ప్రత్యక్ష సాక్షి పేర్కొన్నారు. మరోసాక్షి శైలేంద్ర కుమార్ మాట్లాడుతూ... తమ ప్రాంతంలోని మురుగునీటి కాలువపై ఫిర్యాదు చేయడానికి గేటు వద్దకు వచ్చే సరికి గందరగోళం నెలకొందని అన్నారు. సీఎంను ఎవరో చెంపదెబ్బ కొట్టారని తర్వాత తెలిసిందని తెలిపాడు.

'చెంపదెబ్బ కొట్టలేదు'

సీఎం రేఖాగుప్తాపై జరిగిన దాడిని ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా ఖండించారు. దీని వెనక రాజకీయ కుట్ర ఉందని ఆరోపించారు. 'జన్ సున్‌వాయ్ కార్యక్రమంలో సీఎం ఎప్పటిలాగే ప్రజలతో మాట్లాడుతుండగా... ఒక వ్యక్తి ఆమె వద్దకు వచ్చి, కొన్ని పేపర్లు అందించాడు. వాటిని తీసుకుంటున్న సీఎంను చేయి పట్టుకున్నాడు. దీంతో కొంచెం తోపులాట జరిగింది. ప్రజలు అతడిని పట్టుకున్నారు. అయితే ఆ వ్యక్తి పోలీసులు విచారిస్తున్నారు. సీఎంను వైద్యులు పరీక్షించారు. ప్రస్తుతం బాగానే ఉన్నారు. కానీ, ఆమె తలపై స్వల్పంగా దెబ్బ తగిలినట్లు అనిపించింది. చెంపదెబ్బ కొట్టారనే కథనాలు వాస్తవం కాదు. సీఎం ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారు. కానీ ఆమె తన కార్యక్రమాలను రద్దు చేసుకోనని చెప్పారు' అని వీరేంద్ర సచ్‌దేవా తెలిపారు.

కాంగ్రెస్, ఆప్ ఖండన

ఢిల్లీ సీఎంపై దాడిని కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలు ఖండించాయి. ప్రజాస్వామ్యంలో నిరసన వ్యక్తం చేయవచ్చని, కానీ హింసకు చోటు లేదని పేర్కొన్నాయి. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇది చాలా దురదృష్టకరమని కాంగ్రెస్ అధ్యక్షుడు దేవేంద్ర యాదవ్ అన్నారు. 'ముఖ్యమంత్రి మొత్తం ఢిల్లీకి నాయకత్వం వహిస్తారు. ఇలాంటి ఘటనలను ఎంత ఖండించినా సరిపోదని నేను భావిస్తున్నా. కానీ మహిళల భద్రత వాస్తవికతను కూడా ఈ ఘటన బయటపెడుతుంది. ఢిల్లీ ముఖ్యమంత్రి సురక్షితంగా లేకుంటే, సామాన్యులు ఎలా సురక్షితంగా ఉంటారు?' అని అన్నారు.

హైదరాబాద్ చారిత్రక నగరం

(మొదటిపేజీ తరువాయి)

అభివృద్ధితో పాటు నగర విస్తరణ జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నిర్మాణంతో రిజిస్ట్రేషన్ కార్యాలయాలలో ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చేయబోతున్నామని తెలిపారు. ఆదాయాన్ని ఇచ్చే రిజిస్ట్రేషన్ కార్యాలయాల రూపురేఖలు మార్చే ప్రయత్నం చేస్తున్నామని, అన్ని సౌకర్యాలతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు నిర్మించబోతున్నామని అన్నారు. ఫైవ్ స్టార్ హోటల్, అంతర్జాతీయ విమానాశ్రయం స్థాయిలో సౌకర్యాలతో సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలు నిర్మిస్తామని చెప్పారు. ప్రభుత్వానికి రూపాయి ఖర్చు లేకుండా కార్యాలయాలు నిర్మిస్తున్నామని, రాష్ట్ర అవతరణ దినోత్సవ నాటికి 11 ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నిర్మాణం పూర్తి చేయాలని మంత్రికి సూచించారు. 2034 ప్రపంచమంతా హైదరాబాద్ నగరం వైపు చూసే స్థాయిలో నగరాన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు. నగర అభివృద్ధిని అడ్డుకునే వారు మనకు శత్రువే అని, అలాంటి దొంగల పని పట్టాల్సింది మీరే అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

యువతకు రాజీవ్ గాంధీ స్ఫూర్తి

యువతకు స్ఫూర్తి రాజీవ్ గాంధీ అని, దేశ సమగ్రతను కాపాడేందుకు ఆయన ప్రాణాలర్పించారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. పారదర్శక పరిపాలన అందించడానికి సాంకేతికతను జోడించాలని ఆనాడు రాజీవ్ గాంధీ ఆలోచన చేశారని అన్నారు. 18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కును కల్పించి దేశ భవిష్యత్‌ను నిర్ణయించే అవకాశం కల్పించారన్నారు. బుధవారం మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా సెక్రటేరియట్ వద్ద రాజీవ్ గాంధీ విగ్రహానికి సీఎం రేవంత్... సహచర మంత్రులతో కలిసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్లు కల్పించిన దార్శనికుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. రాజీవ్ స్ఫూర్తితో తెలంగాణను ఆర్థికంగా, సామాజికంగా ముందుకు తీసుకెళతామని అన్నారు. సంక్షేమం, అభివృద్ధితో పాటు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ లాంటి సామాజిక సమస్యలకు పరిష్కారం చూపామన్నారు. రాహుల్ గాంధీని ప్రధానిగా చేసుకుని 21 ఏళ్లు నిండిన వారు శాసన సభకు పోటీ చేసేలా చట్టాన్ని సవరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎంపీలు వీహెచ్, అంజన్ కుమార్ యాదవ్, మండలి చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

ప్రతిపక్ష, అధికార పార్టీ ఎంపీల మధ్య కొద్దిసేపు తోపులాట జరిగింది. అమిత్ షాను కాపాడటానికి కేంద్ర మంత్రులు రవ్నీత్ సింగ్ బిట్టు, కిరణ్ రిజిజు సహా బీజేపీ సభ్యులు రంగంలోకి దిగారు. షా చుట్టూ ముగ్గురు హౌస్ మార్షల్స్ రక్షణ వలయాన్ని ఏర్పాటు చేయాల్సి వచ్చింది. సభ వాయిదా పడిన తర్వాత కూడా, ప్రతిపక్ష సభ్యులు బిగ్గరగా నినాదాలు చేస్తూనే ఉన్నారు. అయితే ఈ బిల్లులను హడావిడిగా తీసుకొచ్చారనే విమర్శలను అమిత్ షా తోసిపుచ్చారు. వాటిని సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) పరిశీలనకు పంపనున్నట్లు ప్రకటించారు. బిల్లులను పార్లమెంటు ఉమ్మడి కమిటీకి పంపుతామని, అక్కడ ప్రతిపక్ష సభ్యులు సహా ఉభయ సభల సభ్యులు తమ సూచనలు ఇవ్వడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ మేరకు లోక్‌సభ నుండి 21 మంది, రాజ్యసభ నుండి 10 మంది సభ్యులతో కూడిన పార్లమెంటు ఉమ్మడి కమిటీకి చర్యలను సూచించాలని తీర్మానం ప్రవేశపెట్టగా ఆ తీర్మానానికి వాయిస్ ఓటు ద్వారా సభ ఆమోదం తెలిపింది. తదుపరి సమావేశాల మొదటి వారం చివరి రోజు నాటికి కమిటీ తన నివేదికను సభకు సమర్పించాల్సి ఉంటుంది. పార్లమెంటు తదుపరి సమావేశాలు నవంబర్ మూడో వారంలో జరిగే అవకాశం ఉంది. అంతకుముందు మధ్యాహ్నం 2 గంటలకు లోక్‌సభలో హోంమంత్రి అమిత్‌షా మూడు బిల్లులను ప్రవేశపెట్టిన సందర్భంలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. కొంతమంది ప్రతిపక్ష ఎంపీలు బిల్లుల ప్రతులను చించిపారేశారు. స్పీకర్ వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. గుజరాత్ హోంమంత్రిగా ఉన్న సమయంలో అమిత్ షా అరెస్టయిన అంశాన్ని కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ లేవనెత్తారు. దీన్ని అమిత్ షా ఖండించారు. అరెస్టుకు ముందే నైతిక కారణాలతో తాను రాజీనామా చేశానని, కోర్టు నిర్దోషిగా ప్రకటించాకే ప్రభుత్వంలో చేరానని చెప్పారు.

తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటున్నప్పటికీ నాయకులు రాజ్యాంగ బద్ధమైన పదవుల్లో కొనసాగడం తగదని అమిత్ షా అన్నారు. అయినా ఆ మూడు బిల్లులకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. ఈ బిల్లులను ప్రవేశపెట్టడాన్ని ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ తీవ్రంగా వ్యతిరేకించారు. ఇది అధికారాల విభజన సూత్రానికి విరుద్ధమని ఆయన అన్నారు. "ఈ బిల్లుతో కార్యనిర్వాహక సంస్థలే న్యాయమూర్తిగా, జ్యూరీగా, శిక్ష అమలు చేసే వారిగా తయారవుతాయి... వాటికి అపరిమిత అధికారాలు లభిస్తాయి. ప్రభుత్వాలను అస్థిరపరిచేందుకు ఈ నిబంధనలను దుర్వినియోగం చేయవచ్చు" అని ఒవైసీ తీవ్రంగా ఆరోపించారు. కాంగ్రెస్ ఎంపీ మనీష్ తివారీ కూడా ఈ బిల్లులు రాజ్యాంగ మౌలిక స్వరూపాన్నే దెబ్బతీసేలా ఉన్నాయని విమర్శించారు. "నిరపరాధి అని నిరూపించుకునే వరకు ఎవరైనా నిర్దోషే అనేది మన చట్టబద్ధమైన పాలనలోని ప్రాథమిక సూత్రం. కానీ ఈ బిల్లు ఆ సూత్రాన్నే మార్చేలా ఉంది. ఇది ఒక కార్యనిర్వాహక అధికారిని ప్రధానమంత్రి కంటే ఉన్నత స్థానంలో నిలబెడుతుంది" అని ఆయన లోక్‌సభలో అన్నారు. స్పీకర్ నచ్చజెప్పే ప్రయత్నం చేసినా సభ్యులు పట్టించుకోలేదు. దాంతో సభను ముందుగా మధ్యాహ్నం 3 గంటలకు వాయిదా వేశారు. ఆ తర్వాత కూడా పరిస్థితిలో ఎలాంటి మార్పు కనిపించకపోవడంతో సాయంత్రం 5 గంటల వరకు వాయిదా వేశారు.

సైద్ధాంతిక పోరు

(మొదటిపేజీ తరువాయి)

సమానత్వం కోసం నిర్భయంగా గళం వినిపించిన చాంపియన్ అంటూ అభివర్ణించారు. ప్రజాస్వామ్యానికి బలం చేకూర్చే అనేక చారిత్రక తీర్పులను ఆయన వెలువరించారని ప్రశంసించారు. ఉపరాష్ట్రపతి ఎన్నిక దేశం కోసం సైద్ధాంతిక పోరాటమని ఖర్గే ఉద్ఘాటించారు. అధికార పార్టీ ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం, సిద్ధాంతాలతో ముందుకెళుతుంటే ప్రతిపక్ష ఇండియాకు రాజ్యాంగం, దాని విలువులే మార్గదర్శకమన్నారు. రాజ్యసభ పనితీరు నిష్పాక్షింగా, హుందాగా, న్యాయంగా జరిపేందుకు కట్టుబడి జస్టిస్ సుదర్శన్ రెడ్డి నామినేషన్ వేస్తున్నారని తెలిపారు. న్యూఢిల్లీ, సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్‌లో బుధవారం ఇండియా సభ్యులు సమావేశమయ్యారు. సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి సుదర్శన్‌రెడ్డి హాజరయ్యారు. ఆయనకు ఖర్గే సహా ఇండియా ప్రముఖ నాయకులు సన్మానించారు. ఖర్గే ప్రసంగిస్తూ 130వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టే ప్రయత్నాల్లో కేంద్రం ఉందన్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, సమాఖ్యవాదం విలువలను నీరుగార్చే ఈ బిల్లును చివర్లో సభ ముందర ఉంచబోతోందని అన్నారు. ప్రజాస్వామిక వ్యవస్థల సమగ్రత సవాళ్లను ఎదుర్కొంటున్న తరుణంలో న్యాయానికి, నిష్పాక్షికతకు, రాజ్యసభ ఔన్నత్యానికి కట్టుబడాలనే సంకల్పమే సుదర్శన్ రెడ్డి నామినేషన్ అని ఖర్గే తేల్చిచెప్పారు. ఆయనకు మద్దతు ఇవ్వడం ద్వారా ప్రజాస్వామ్య పరిరక్షణకు హామీ ఇవ్వాలని ప్రతి పార్లమెంటు సభ్యునికి కాంగ్రెస్ అధ్యక్షుడు పిలుపునిచ్చారు.

యూరియా ఇచ్చిన పార్టీకే

ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతు

ఎరువుల కొరతపై శ్వేతపత్రం విడుదల చేయాలి: కేటీఆర్

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ రైతులకు కావాల్సిన రెండు లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను సెప్టెంబరు 9 లోపు ఇచ్చిన పార్టీ అభ్యర్థికే ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతు ఇస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు వెల్లడించారు. ఇంతవరకు తమను ఏ కూటమీ సంప్రదించలేదని, అయితే తెలంగాణ ప్రయోజనాలకు అనుగుణంగానే తాము నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో తీవ్రంగా ఉన్న ఎరువుల కొరతపై హైదరాబాద్ నందీనగర్ నివాసంలో బుధవారం మీడియాతో మాట్లాడిన కేటీఆర్, రేవంత్ అసమర్థత, అనుభవ లేమి, ప్రణాళిక రాహిత్యంతోనే రాష్ట్రంలో యూరియా కొరత తీవ్రమైందని విమర్శించారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న పదేళ్ల కాలంలో ఏ ఒక్క రోజూ ఎరువుల కొరత రాలేదన్న కేటీఆర్... సీజన్‌కు ఆరు నెలల ముందే 24 గంటల పాటు పర్యవేక్షణ చేసి కేసీఆర్ ఎరువులను తీసుకొచ్చేవారని చెప్పారు. కొందరు కాంగ్రెస్ నాయకులు ఎరువులను బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకుంటున్నారన్న ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోవాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. 70 లక్షల మంది తెలంగాణ రైతులు యూరియా కోసం అల్లాడుతుంటే కాంగ్రెస్, బీజేపీ ఎలక్షన్లు, కలెక్షన్లు అని నాటకాలు ఆడుతున్నాయని విమర్శించారు. ఎరువుల కొరతపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్వేతపత్రం విడుదల చేయాలని, లేకుంటే క్షేత్ర స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి దాకా పోరాట కార్యాచరణను ప్రకటిస్తామని హెచ్చరించారు. తమకు ఢిల్లీలో బాస్‌లు ఎవరూ లేరని, తెలంగాణ ప్రజలే తమకు బాస్‌లని తెలిపారు. ఎనిమిది మంది కాంగ్రెస్, ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు ఉండి కూడా తెలంగాణకు పైసా ప్రయోజనం కలగడం లేదని మండిపడ్డారు.

రైతు డిక్లరేషన్ పేరుతో నానా హంగామా చేసిన రాహుల్ గాంధీ తెలంగాణ రైతుల యూరియా సమస్యపై పార్లమెంటులో ఎందుకు మాట్లాడం లేదని ప్రశ్నించారు. బీసీల మీద ప్రేమ నటించే కాంగ్రెస్ పార్టీ, ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా బీసీ నేతను ఎందుకు ప్రకటించలేదో చెప్పాలని అన్నారు.

మద్యం దుకాణాల టెండర్లకు నోటిఫికేషన్

(మొదటిపేజీ తరువాయి)

కేటాయింపుల్లో 30 రిజర్వేషన్లు అమలు చేశారు. గౌడ సామాజిక వర్గానికి 15 శాతం, షెడ్యూల్ కులాలకు 10 శాతం, షెడ్యూల్ తెగలకు 5 శాతం కేటాయించనున్నారు. టెండర్ల ప్రక్రియల్లో పాల్గొనేందుకు భాగస్వామ్య సంస్థలకు, కంపెనీలకు సైతం అవకాశం కల్పించారు. ఈసారి లైసెన్స్ ఫీజులో ఎలాంటి మార్పులు చేయలేదు. ఎంపికయిన లైసెన్స్‌దారులు 6 స్లాబుల ద్వారా లైసెన్స్ ఫీజు చెల్లించుకునేందుకు వీలు కల్పించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఈసారి కూడా మద్యం దుకాణాల లైసెన్స్‌ల జారీకి సిద్ధమవుతోంది రాష్ట్ర ప్రభుత్వం. తెలంగాణలో మద్యం వ్యాపారం లాభాల పంటగా భావిస్తుంటారు. అందుకే ఏటికేడు ఈ వ్యాపారం వైపు చొరవ చూపేవారి సంఖ్య పెరుగుతోంది. కాగా మద్యం దుకాణాల దరఖాస్తు ప్రక్రియకు సంబంధించిన తుది తేదీలను ప్రకటించాల్సి ఉంది.

ప్రజలతోనే మా పొత్తు

(మొదటిపేజీ తరువాయి)

అంతర్గత ఇబ్బందులు ఉన్నట్లు పేర్కొన్నారు. మతోన్మాద బీజేపీని తెలంగాణలో అధికారంలోకి రానీయకుండా ఉండేందుకు వామపక్షాలు మరింత ఐక్యతతో ముందుకు సాగాల్సి ఉందని కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. పార్టీ అధ్వర్యంలో వివిధ జిల్లాలలో గుడిసెలు నిర్మించుకున్న పేదలకు పట్టాలు సాధించేందుకు పోరాటాలు కొనసాగించాలని, ఆర్‌టీసీ, సింగరేణి వంటి ప్రభుత్వ సంస్థలను పరిరక్షించుకొనేందుకు ఉద్యమించాల్సి ఉందని చెప్పారు. రానున్న స్థానికసంస్థల ఎన్నికలలో పార్టీ పునాది కలిగిన స్థానాలలో, అవకాశమున్న చోట పోటీ చేసి విజయం సాధించేందుకు కృషి చేయాలని, ఇందుకు పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని తెలిపారు. పార్టీ శత జయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేసేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టంతో పాటు వివిధ రంగాల ప్రజల సమస్యలపై ప్రజాసంఘాల అధ్వర్యంలో నిరంతర అవిశ్రాంత పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

ఓటు హక్కు ప్రశ్నార్థకం

(మొదటిపేజీ తరువాయి)

కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు, కళవేన శంకర్, ఎం.బాలనరసింహా, వీఎస్ బోస్, ఈటీ నరసింహా, సినీ నటుడు డాక్టర్ మాదాల రవి, ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షుడు డీజీ సాయిల్, ప్రధాన కార్యదర్శి ఇ.ఉమామహేశ్ తదితరులు వేదికపై ఆశీనులయ్యారు.

డి.రాజా ప్రసంగిస్తూ దేశం అత్యంత సంక్లిష్టమైన సవాళ్లు ఎదుర్కొంటోందని, ప్రాథమిక హక్కు, పౌరహక్కుగా ఉన్న ఓటు హక్కు ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. బీజేపీ, మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగంపై దాడి పెరిగిందన్నారు. పార్లమెంటును పనిచేయనివ్వడం లేదని, అది పనిచేయకపోతే ప్రజాస్వామ్యం విధ్వంసమవుతుందని హెచ్చరించారు. అర్హులైన ప్రజలందరికీ ఓటు హక్కు కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఉండగా, బీహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) పేరుతో పాలకులకు ఇష్టం లేని ఓటర్లను పెద్దఎత్తున తొలగించే కార్యక్రమం చేస్తున్నారని రాజా విమర్శించారు. త్వరలో ఎన్నికలు జరిగే తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో ఎన్నికల కమిషన్ ఎలా పనిచేస్తుందనేది పెద్ద సమస్యగా మారిందన్నారు. అర్హులందరికీ ఓటు హక్కు కల్పించేందుకు రాజ్యాంగ బద్ధమైన ఎన్నికల కమిషన్‌కు అధికారాలు ఉన్నాయని, కానీ ఆ సంస్థ రాజ్యాంగబద్ధ సంస్థగా పనిచేయడం లేదని విమర్శించారు. ఎన్నికల కమిషన్ అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించాలని సీపీఐ డిమాండ్ చేస్తున్నదన్నారు. బీహార్‌లో ఎస్ఐఆర్ నిలుపుదల చేయాలని సుప్రీంకోర్టులో సీపీఐ తరపున స్వయంగా తాను పిటిషన్ దాఖలు చేసినట్టు రాజా వెల్లడించారు. భారత్... హిందూత్వ దేశం, మతతత్వ రాజ్యంగా మారితే దేశానికే పెద్ద విపత్తు ఏర్పడుతుందని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఏనాడో హెచ్చరించారన్నారు. భారతదేశాన్ని కాపాడాలంటే బీజేపీకి, ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా లౌకిక, ప్రజాస్వామ్య శక్తులన్నీ ఐక్యంగా పోరాటం చేయాలని రాజా పిలుపునిచ్చారు. అందుకే ఇండియా ఐక్యసంఘటన ఏర్పడిందని, 'ఇండియా' ఏర్పాటులో సీపీఐ కీలక పాత్ర పోషించిందని రాజా తెలిపారు. 'ఇండియా' భాగస్వాముల మధ్య పరస్పర సహకారం, సర్దుబాటు అవసరమని సూచించారు.

ఉపరాష్ట్రపతి ఎన్నిక రాజకీయ యుద్ధం

ఉపరాష్ట్రపతి ఎన్నికలు దేశ చరిత్రలో ఎంతో కీలకమని, ఈ ఎన్నిక రాజకీయ యుద్ధమని రాజా అన్నారు. ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ ఎందుకు రాజీనామా చేశారని ఆయన ప్రశ్నించారు. ధన్కర్ రాజీనామాకు ఆయన అనారోగ్యం కారణం కాదని, అదేమిటో ఇప్పటికీ ఎవరికీ తెలియదన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికలో ఇండియా ఐక్యసంఘటన అభ్యర్థిగా జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డిని ప్రకటించారని, సీపీఐ కూడా మద్దతు ప్రకటించిందని, లౌకిక పార్టీలన్నీ జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఉపరాష్ట్రపతిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి గెలుపొందితే దేశ భవిష్యత్ రాజకీయాలలో తీవ్ర ప్రభావం చూపుతుందని, చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందని రాజా తెలిపారు. కాగా, కార్మికులు, రైతులు, మహిళలు, కమ్యూనిస్టు పార్టీని మరింత బలోపేతం చేయాలని రాజా పిలుపునిచ్చారు. తెలంగాణలో సీపీఐ అత్యంత బలమైన పార్టీ అని, ప్రస్తుతం ఒక ఎంఎల్‌ఏ, ఒక ఎంఎల్‌సీ ప్రాతినిధ్యం వహిస్తున్నారన్నారు. ప్రజాసమస్యలను మరింత ఎలుగెత్తి చాటేందుకు పార్లమెంటు, అసెంబ్లీలో సీపీఐ బలం పెరగాలని ఉద్ఘాటించారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన సాయుధ పోరాటంలో ముఖ్యపాత్ర పోషించిన ఘనచరిత్ర సీపీఐదని గుర్తు చేశారు.

బీజేపీని అడ్డుకునే శక్తి వామపక్షాలకే ఉంది: కందిమళ్ల

వీర తెలంగాణ గడ్డపై మతోన్మాద బీజేపీ జెండా ఎగరకుండా అడ్డుకునే శక్తి వామపక్ష పార్టీలకే ఉందని, ఇందుకు కమ్యూనిస్టు పార్టీలన్నీ ఏకం కావాలని సీపీఐ సీనియర్ నాయకులు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడు కందిమళ్ల ప్రతాపరెడ్డి పిలుపునిచ్చారు. సీపీఐ వందేళ్ల ప్రస్థానంలో సాగించిన పోరాటాలు, త్యాగాలు, సాధించిన విజయాలను మననం చేసుకుంటున్నామన్నారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సీపీఐ పోరాటాలు నిర్వహించిందని, మాతృదేశం కోసం నాయకులు ప్రాణాలు అర్పించారని గుర్తు చేశారు. 1942 వరకు భారత కమ్యూనిస్టు పార్టీపై నిషేధం ఉన్నా... రైతులు, కూలీలు, విద్యార్థులు, యువకులను సంఘటితం చేసి స్వాతంత్ర్య పోరాటంలో కదిలించిందని వివరించారు. స్వాతంత్ర్య సమరంలో ముందుండి పోరాటం చేసిన కమ్యూనిస్టు పార్టీ నాయకులు జైలు శిక్ష అనుభవించారన్నారు. నిరంకుశ నిజాంకు వ్యతిరేకంగా మట్టి మనుషులతో బందూకులు పట్టించి... సాయుధ సమరం నడిపిన చరిత్ర సీపీఐ దన్నారు. కమ్యూనిస్టు పార్టీ చీలికతో కొంత బలహీనమైందని, దీనిని అధిగమించేందుకు దేశంలోని కమ్యూనిస్టు పార్టీలు, మేధావులను ఏకం చేసేందుకు కీలకపాత్ర పోషించాలని డి.రాజాను ఆయన కోరారు. రాజకీయాలు వ్యాపారంగా మారాయని, తెలంగాణ విప్లవగడ్డపై కమ్యూనిస్టులుగా కమ్యూనిస్టుల పాత్ర ఏమిటనేది మహాసభలో ఆత్మపరిశోధన చేసుకోవాలని సూచించారు. నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన వీర తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను మరుగున పడేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమే స్ఫూర్తి అని, అయితే మాజీ సీఎం కేసీఆర్ తానే ఒక వీరుడిగా చెప్పుకుంటున్నారని, సాయుధ పోరాటాన్ని తామే నడిపించినట్టు చరిత్రను బీజేపీ వక్రీకరిస్తున్నదన్నారు. కమ్యూనిస్టులందరి ఆశయం ఒక్కటేనని, ఐక్యత తమ ఆయుధమని, ఈ ప్రజాతంత్ర ఐక్యత ద్వారా కమ్యూనిస్టు స్ఫూర్తిని, ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

అమరుల త్యాగం, రక్తంతో ఎరుపెక్కిన ఎర్రజెండా: ఏటుకూరి ప్రసాద్

అమరవీరుల త్యాగం, రక్తంతో ఎరుపెక్కిన జెండా ఎర్రజెండా అని, నిజాంకు వ్యతిరేకంగా రైతాంగ సాయుధ పోరాటంలో ఎందరో అమరులైన వారి వారసత్వం బాట ఎర్రబాట అని ఏటుకూరి ప్రసాద్ అన్నారు. కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిన నాటి దశలో ఉన్న రాజకీయ పరిస్థితులే ప్రస్తుతం దేశంలో ఉండడంతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఫాసిజం మళ్లీ విజృంభిస్తున్నదన్నారు. గతంలో కమ్యూనిస్టులు రక్తార్పణతో ఏ ఆశయాలు, ఆదర్శాలతో ముందుకు వెళ్లారో... ఆ ఆశయాల స్ఫూర్తిని ముందుకు తీసుకువెళ్లాలన్నారు. ఫాసిజం ఎన్నో రకాల ముసుగు ధరించి చిన్నల నుంచి పెద్దల వరకు అనేక రూపాల్లో బయటపడడం ప్రజాస్వామ్యానికి తీవ్ర విఘాతమన్నారు. ఈ పరిస్థితులు ఎదుర్కొనే శక్తి కేవలం వామపక్షాలకు మాత్రమే ఉందన్నారు. ఈ దశలో అమరవీరుల ఆశయాల స్ఫూర్తితో వామపక్షాలన్నీ ఐక్యంగా ముందుకు కదిలి... ఫాసిస్టుశక్తులను ఓడించేందుకు ప్రతిజ్ఞ చేయాల్సిన అవసరముందన్నారు.

సినీనటుడు మాదాల రవి మాట్లాడుతూ కమ్యూనిస్టు శక్తులన్నీ ఏకమై పోరాటం చేసినప్పుడే సామాన్యుడి గుండె ప్రతిధ్వనిస్తుందని, కుళ్లుతున్న వ్యవస్థను కూకటివేళ్లతో పీకేస్తారని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సాంస్కృతిక విప్లవం రావాల్సిన అవసరం ఉన్నదన్నారు. మతతత్వ శక్తులను ఎదుర్కోవాలంటే డబ్బులు ప్రధానంగా మారిన ఎన్నికల వ్యవస్థపై అందరూ కలిసి పోరాటం చేయాలన్నారు. కళ కాసుల కోసం కాదని, సామాన్యులలో చైతన్యం తీసుకురావడం కోసమని, ప్రజా కళాకారులందరూ ప్రజలను చైతన్య వంతులను చేసినప్పుడే ప్రజలలో చైతన్యం వస్తుందన్నారు. మానవ సంబంధాలను మట్టి కరిపించే విధంగా ప్రస్తుత సినిమాలు, సీరియళ్లు ఉన్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎర్రమల్లెలు లాంటి సినిమాలు తీసిన మాదాల రంగారావు కూడా కమ్యూనిస్టు పార్టీ తయారు చేసిన ఆయుధమన్నారు.

ఓటు హక్కును 18 ఏళ్లకు సవరించిన ఘనత సీపీఐదే

ఇటీవలనే దేశ స్వాతంత్ర్య దినోత్సవం జరిగిందని, స్వాతంత్ర్యం రాకముందు భారతదేశం బ్రిటీష్, ఫ్రెంచ్, పోర్చుగీసు వలస పాలనలో ఉండేదని, అప్పట్లో ఎన్నికలు జరిగాయని, కానీ ఓటు హక్కు అందరికీ ఉండేది కాదని, సంపన్నులు, ఉన్నతస్థాయి వ్యక్తులకు మాత్రమే ఓటు హక్కు ఉండేదని రాజా గుర్తుచేశారు. స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే భారతదేశంలో 21 ఏళ్లు దాటిన పౌరులందరికీ మతాలు, ప్రాంతాలు, స్త్రీ, పురుష భేదం లేకుండా వయోజన ఓటు హక్కును రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కల్పించారని తెలిపారు. సీపీఐ నేత సీకే చంద్రప్పన్ పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న సమయంలో వయోజన ఓటు వయస్సును 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించాలని పార్లమెంటులో ప్రస్తావించగా... నాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ అంగీకరించడంతో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ కులం, మతం, ప్రాంతం అనే తేడాలు లేకుండా ఓటు హక్కు పొందారన్నారు. భారతదేశంలో స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే వయోజనులైన పురుషులతో సమానంగా మహిళలకు ఓటు హక్కు లభించిందన్నారు. కానీ అమెరికాలో, ఐరోపా దేశాల్లో చాలాకాలం పురుషులకు మాత్రమే ఓటు హక్కు ఉండేదని, అనేక పోరాటాల తరువాతనే మహిళలకు ఓటు హక్కు దక్కిందన్నారు. భారత దేశంలో అత్యంత ధనికులైన అదానీ, అంబానీ ఓటుకు, సామాన్య ప్రజల ఓటుకు ఒకే విలువ ఉంటుందని, అది అంబేద్కర్ గొప్పతనమని చెప్పారు. అదేవిధంగా ఓటుతో పాటు ప్రతి మనిషికి ఒకే విలువ ఉండే సమాజం కావాలని ఆయన ఆకాంక్షించారని గుర్తు చేశారు.

విశాలాంధ్ర

ఆయిల్ ఫామ్ తోటను అధికారులు పరిశీలన

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ : జిల్లాలో అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఖానాపూర్ మండలం రాజుర గ్రామం గొంగ రుక్మవ్వ గొంగ భీమన్న యొక్క ఆయిల్ పామ్ తోటను పరిశీలించిన ఆయిల్ ఫామ్ శాఖ అధికారులు, విజిట్ చేస్తూ రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

శిశువులకు తల్లిపాలు అత్యుత్తమ ఆహారం

మంత్రి జూపల్లి కృష్ణారావు

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ : మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన బేబీ ఫీడింగ్ రూమ్‌ను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ, పుట్టిన వెంటనే తల్లిపాలు ఇవ్వడం వలన శిశువుల రోగనిరోధక శక్తి పెరగడమే కాకుండా సమృద్ధిగా పోషకాహారం అందుతుందని తెలిపారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లికి కూడా ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని, రక్తహీనత, రొమ్ము క్యాన్సర్ వంటి వ్యాధుల నుంచి రక్షణ పొందే అవకాశం ఉందని వైద్యులు సూచించారని మంత్రి తెలిపారు. ప్రతి శిశువుకూ తల్లిపాలు అందించాల్సిన అవసరాన్ని వైద్యశాఖ అధికారులు ఈ సందర్భంగా తల్లిదండ్రులు, గర్భిణీలు, పాలిచ్చే తల్లులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విట్టల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఆర్డీవో రత్న కళ్యాణి, డీఎమ్ అండ్‌హెచ్ఓ డా. రాజేందర్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు

ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ : బుధవారం ఖానాపూర్ మండల కేంద్రం మార్కెట్ యార్డ్ సమీపంలో గల మాజీ ప్రధాని స్వర్గీయ శ్రీ రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు రాజీవ్ గాంధీ దేశ ప్రధానిగా ఐటీ .విద్య .టెలికం. రక్షణ. వాణిజ్య .సంస్కరణలు ప్రవేశ పెట్టారు అని కొనియాడారు. మాజీ మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం తాజా మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కావాలి సంతోష్ మాజీ మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్ తదితరులు పాల్గొన్నారు

రాజీవ్ గాంధీకి నివాళి

విశాలాంధ్ర - కాప్రా : గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో మల్లాపూర్ డివిజన్‌లోని స్వామి వివేకానంద నగర్ కాలనీ కమాన్ దగ్గర రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన స్వర్గీయ రాజీవ్ గాంధీ 81వ జయంతి ఉత్సవాలకు ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి పూల మాలలు వేసి మహనీయునికి ఘన నివాళులు అర్పించారు,ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి ధనపాల్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అంజి రెడ్డి,సీతారామ్ రెడ్డి, వివిధ డివిజన్ అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎస్ సి, ఎస్ టీ,ఓ బి సి నాయకులు,ఎన్ ఎస్ యూ ఐ నాయకులు, సేవాదళ్ పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈల కోసం అమెజాన్ బిజినెస్ డిజిటల్ సేకరణ షురూ

బెంగళూరు: భారతదేశం అంతటా ఉద్యమం, ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ హోల్డర్లు ఇప్పుడు అమెజాన్ వ్యాపారంలో సైన్ అప్ చేసుకోగల యాక్సెస్‌ను అమెజాన్ బిజినెస్ ప్రారంభించింది. ఇప్పటికే ఉన్న జీఎస్టీ, బీ-పాన్ ఎంపికలతో పాటు, పండుగ సీజన్‌కు ముందు ఈ విస్తరణ దేశంలోని 50 మిలియన్లకు పైగా ఎంఎస్ఎంఈలకు (80% సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు) అమెజాన్ వ్యాపారం ద్వారా డిజిటల్ సేకరణ యాక్సెస్‌ను అందిస్తుంది. ఎంఎస్ఎంఈ కొనుగోలుదారులకు, సేకరణ తరచుగా చిక్కుముడిని నావిగేట్ చేస్తున్నట్లు అనిపించవచ్చు - బహుళ విక్రేతలు, అస్థిరమైన ధర, సుదీర్ఘ ప్రక్రియలు. అమెజాన్ బిజినెస్‌లో, మేము ఈ సమస్యను స్థిరంగా పరిష్కరిస్తున్నాము. సేకరణను సరళంగా, సమర్థవంతంగా చేస్తున్నాము. అయితే, ఇప్పటివరకు, అమెజాన్ బిజినెస్ యాక్సెస్ జీఎస్టీ, బిజినెస్ పాన్ ఉన్న వ్యాపారాలకు మాత్రమే పరిమితం చేయబడింది. కాలక్రమేణా, ఉద్యోగం, ఎఫ్ఎస్ఎస్ఏఐ వంటి ఇతర వ్యాపార లైసెన్స్‌లను కలిగి ఉన్న అనేక సూక్ష్మ వ్యాపారాల నుండి, అమెజాన్ బిజినెస్ అందించే సరళీకృత డిజిటల్ సేకరణ నుండి కూడా వారు ప్రయోజనం పొందుతారని మేము విన్నాము అని సంస్థ ప్రతినిధి తెలిపారు.

పెరుగుతున్న హీరో డాడ్స్

: పీఎన్‌బీ మెట్‌లైఫ్ సర్వే

ముంబై: భారతదేశంలోని తండ్రులలో, మూడింట దాదాపు రెండొంతుల మంది తమను తాము "హీరో డాడ్స్"గా చూసుకుంటున్నారని, కొత్త పీఎన్‌బీ మెట్‌లైఫ్ సర్వే వెల్లడించింది. ఇండియాలోని ప్రముఖ జీవిత బీమా సంస్థలలో ఒకటి అయిన పీఎన్‌బీ మెట్‌లైఫ్ ఇండియా ఇన్సూరెన్స్ లిమిటెడ్ (పీఎన్‌బీ మెట్‌లైఫ్), మన జీవితాలలో తండ్రి పోషించే కీలక పాత్రలను గుర్తిస్తూ, ఆర్థిక పరమైన నిర్ణయాలు తీసుకోవడంలో తమ పాత్రను వాళ్లు ఎలా స్వీకరిస్తారనే అంశంపై అన్వేషణ నిర్వహించింది. ఫాదర్స్ డే రోజున ప్రారంభమైన ఈ జాతీయ స్థాయి సర్వే, భారత దేశవ్యాప్తంగా జూన్, జూలై, ఆగస్ట్ నెలలలో నిర్వహించగా, ఆయా వ్యక్తుల ఆర్థిక వైఖరుల ఆధారంగా వాళ్లు ఏ తరహా "తండ్రి రకం" అనే అంశాన్ని గుర్తించేలా నిర్వహించారు. ప్రతిస్పందకులలో 62 శాతం మంది తమను తాము "హీరో డాడ్స్"గా గుర్తించుకుని, తమ కుటుంబ ఆర్థిక భద్రత కోసం తాము సంరక్షకులుగా భావించారు.

రెండవ ప్రమాదక హెచ్చరిక జారీ

కలెక్టర్ దివాకర టి.ఎస్.

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో: ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి నది ఉగ్రరూపం దాల్చి ప్రవహిస్తూ ఉండడంతో జిల్లాలోని రామన్నగూడెం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేయడం జరిగిందని, గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్న సందర్భంగా అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. బుదవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు గోదావరి వరద ఏటూరు నాగారం మండలం రామన్నగూడెంలో 15.83 మీటర్స్ చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని గోదావరి పరివాహక ప్రాంతాల గ్రామాల ప్రజలను ఇప్పటికే అప్రమత్తం చేయడం జరిగిందని, ఏలాంటి ముప్పు ఏర్పడిన తక్షణమే అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆయన తెలిపారు. వెంకటాపురం మండలంలో ఐదు కుటుంబాల వారిని, వాజేడు మండలంలో 15 కుటుంబాల వారిని, కన్నాయి గూడెం మండలంలో 33 కుటుంబాల వారిని, గోవిందరావుపేట మండలం లోని రెండు కుటుంబాల వారిని, ఏటూరునాగారం మండలంలో 50 మందిని పునరావాస కేంద్రాలకు తరలించి వారికి అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. జిల్లాలో 8 పునరావాస కేంద్రాలలో 75 కుటుంబాలకు చెందిన 216 మందిని ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఇప్పటికే ఎన్ డి ఆర్ ఎఫ్, ఎస్ డి ఆర్ ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచామని వారితోపాటు జిల్లా పోలీసు యంత్రాంగం అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

తెలంగాణ బచావో మూమెంట్ ఆవిర్భావం

విశాలాంధ్ర, బషీర్ బాగ్: తెలంగాణ రాష్ట్రంలో మార్వాడిలు కొత్త షాపు పెడితే పగలగొడతామని తెలంగాణ బచావో మూమెంట్ వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. బుధవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ తెలంగాణ బచావో మూమెంట్ లో మార్వాడి గో బ్యాక్ ఉద్యమ సంఘం ఆవిర్భావ సదస్సులలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉత్తర భారత దేశ వ్యాపారులు ఎవరైనా సరే కొత్త షాపు పెడితే పగలకొడుతామని ఇకముందు ఉద్యమం మూడు రూపాలలో ఉంటుందని మొదటి దశలో కొత్త షాపులు పెట్టనివ్వం రెండవ దశలో కల్తీ వస్తువులను పట్టుకొని శిక్షిస్తాం మూడో దశలో ఉత్తర వ్యాపారస్తులు తెలంగాణ రాష్ట్రం నుంచి వెళ్ళిపోవాలి అనే నినాదదంతో తెలంగాణ బచావో మూమెంట్ పనిచేస్తుందని అన్నారు. తెలంగాణలో ఎలాంటి సంబంధం లేని మార్వాడీలు ఇక్కడ మాదే అని చెలామణి అవుతున్నాడు. ఈ గడ్డపై పుట్టి ఈ గడ్డపై పెరిగిన మాకే ఈ ప్రాంతాన్ని కల్తీమయం నుండి కాపాడుకునే కర్తవ్యం బాధ్యత ఉందని అన్నారు. ఇప్పటినుంచి తెలంగాణలో మార్వాడీల ఆటలు సాగవని హెచ్చరించారు. ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాస సత్యనారాయణ మాట్లాడుతూ మార్వాడీలు ఐఎస్ఐ తీవ్రవాదుల కంటే ప్రమాదకరమని అన్నారు. మార్వాడీలకు మానవత్వం ఉండదని కేవలం డబ్బు పిచ్చి మాత్రమే ఉంటుందని మార్వాడీలో ఆర్యవైశ్యుల వ్యాపారాలపై దెబ్బ కొట్టి తెలంగాణ రాష్ట్రంలో థో నెంబర్ దందా చేస్తున్నారని అన్నారు. తెలంగాణ మార్వాడీలకు తెలంగాణ ఆర్యవైశ్యులకు కంచం మంచం పొత్తు లేదని అన్నారు. వారు ఈ తెలంగాణ రాష్ట్రంలోని సంప్రదాయమైన కల్చర్ను భంగం చేస్తున్నారని అన్నారు. గిరిజన జేఏసి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రాత్లావత్ రాజేష్ నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కల్తీ మాయం చేస్తున్న మార్వాడీలు వెంటనే రాష్ట్రాన్ని ఖాళీ చేయాలన్నారు. జన జాగృతి పురం రాష్ట్ర అధ్యక్షురాలు కోటగిరి ఉషారాణి మాట్లాడుతూ తెలంగాణ ఆత్మగౌరవం దెబ్బతీసే విధంగా మార్వాడీలు మాట్లాడుతున్నారన్నారు.

మహాసభలకు..సీపీఐ శ్రేణులు

సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో మహబూబాబాద్: మేడ్చల్ జిల్లా గాజులరామారంలో జరుగుతున్న తెలంగాణ రాష్ట్ర నాల్గవ మహాసభలకు మహబూబాబాద్ జిల్లా నుండి సిపిఐ ప్రతినిధులు హాజరైనట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారధి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం నుండి మూడు రోజులపాటు సిపిఐ తెలంగాణ రాష్ట్ర నాలుగవ మహాసభలకు మహబూబాబాద్ జిల్లా నుండి 25 మంది ప్రతినిధులు హాజరైనట్లు తెలిపారు. ఈ మహాసభలలో రాష్ట్రంలో ఉన్నటువంటి సమస్యలపై చర్చించి ఉద్యమాలు చేస్తామన్నారు. రానున్న గ్రామపంచాయతీ, ఎంపీటీసీ, జడ్పిటిసి, మున్సిపాలిటీ ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా కార్యకర్తలను సన్నద్ధం చేస్తామన్నారు. రానున్న కాలంలో బిజెపి రాష్ట్రానికి విభజన హామీ చట్టంలో ఉన్న బయ్యారంలో ఉక్కు పరిశ్రమ కాజీపేట కోచ్ పరిశ్రమ వాటి కోసం పోరాడుతామని తెలిపారు. ఈ మహాసభలలో ప్రతినిధులుగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు బి అజయ్ సారధి రెడ్డి, నల్లు సుధాకర్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కట్టబోయిన శ్రీనివాస్, సిపిఐ నేతలు పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, మామిళ్ల సాంబలక్ష్మి, తండ సందీప్, వీరవెల్లి రవి ,వెలుగు శ్రావణ్, కర్నం రాజన్న పాల్గొన్నారు.

వైరా రిజర్వాయర్‌ను గొప్ప పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

విశాలాంధ్ర బ్యూరో - ఖమ్మం : వైరా రిజర్వాయర్‌ను పర్యాటక రంగంలో ఉన్నత స్థాయిలో తీర్చి దిద్దాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. బుధవారం ఆయన వైరా రిజర్వాయర్ని సందర్శించారు. వైరా రిజర్వాయర్ వద్ద ఓటింగ్‌తో పాటు పర్యాటకుల కోసం గదుల ఏర్పాటు తదితర సౌకర్యాలు కల్పించడానికి అవసరమైన ప్రతిపాదనలు పంపించాలని ఆయన అధికారులకు సూచించారు. ఆయన వైరా రిజర్వాయర్ సమీపంలో ఉన్న మత్స్య శాఖకు చెందిన విత్తన ఉత్పత్తి కేంద్రాన్ని ఆయన సందర్శించి అక్కడ మత్స్య శాఖ ఆధ్వర్యంలో చేప పిల్లల పెంపకం వివిధ రకాల చేపల పెంపకం ఏ విధంగా ఉంది అనే అంశాలను పరిశీలించారు. మచ్చ సొసైటీలకు చెందిన వేలాదిమంది మత్స్యకారులకు ఉపయోగపడేలా చేప పిల్లలను అందించడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. పర్యాటక ప్రాంతం గుట్టలను, బోటింగ్ ప్రాంతాన్ని కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట మత్స్య శాఖ ఎడీ శివప్రసాద్, జిల్లా టూరిజం శాఖ అధికారి సుమన్ చక్రవర్తి, వైరా తహసిల్దార్ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ వేణు, అధికారులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన సేవలు అందించాలి

కలెక్టర్ కోయ శ్రీ హర్ష

విశాలాంధ్ర బ్యూరో -పెద్దపల్లి: పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మండలంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందాలని, ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచే దిశగా అవసరమైన చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రి ఆవరణ చుట్టు విద్యుత్ దీపాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ను కలెక్టర్ ఆదేశించారు. 12 లక్షల 50 వేల రూపాయల నిధులతో నూతనంగా కొనుగోలు చేసిన అల్ట్రా సౌండ్ స్కానింగ్, ఎన్.ఎస్.టి యంత్రాలను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం సుల్తానాబాద్ మండలంలో ప్రాథమిక ఆరోగ్య సహకార సంఘం గోడౌన్‌ను, ఎరువుల షాప్ తనిఖీ చేశారు.ఎరువుల విక్రయం వివరాల రిజిస్టర్ పక్కగా మెయింటైన్ చేయాలని కలెక్టర్ తెలిపారు. రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని ఎక్కడ కొరత లేదని, పంట విస్తీర్ణం ఆధారంగా యూరియా రైతులకు అమ్మాలని, ప్రస్తుత అవసరాలకే కొనుగోలు చేయాలని అనవసరంగా యూరియా నిల్వ చేయవద్దని కలెక్టర్ తెలిపారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, సుల్తానాబాద్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమా దేవి, మున్సిపల్ కమిషనర్ రమేష్, మండల వ్యవసాయ అధికారి నాగార్జున, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాలను సందర్శించిన ఎస్పీ

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో: గోదావరి నది పరివాహ ప్రాంతాలైన కన్నాయిగూడెం మండలంలోని సమ్మక్క సారలమ్మ బ్యారేజ్, ఏటూరు నాగారం మండలంలోని రామన్నగూడెం కరకట్ట ప్రాంతాలను ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్.పి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా ఎస్పీ మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో గోదావరి నదికి వరద పెరిగి ఉధృతంగా ప్రవహిస్తున్న తరుణంలో, ముంపు ప్రాంతాల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే ఎవరూ కూడా చేపల వేటకు వెళ్లడం కానీ, పడవలలో నదులు దాటడం కానీ చేయకూడదని హెచ్చరించారు.అనంతరం ముంపుకు గురైన వెంకట్రావుపల్లి గ్రామస్తులను కలిసి పరామర్శించి, వారి బాగోగులు అడిగి తెలుసుకొన్నారు. వరద ఉధృతి తగ్గేవరకు బయటకు వెళ్లకూడదని సూచించారు. విపత్కర పరిస్థితులు ఎదురైతే ప్రజలు పోలీస్ శాఖ సహాయం తీసుకోవాలని, డైలీ 100 ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎటువంటి విపత్కర పరిస్థితులు ఎదురైన,వాటిని ఎదుర్కొనేందుకు, జిల్లా పోలీస్ శాఖ సంసిద్ధంగా ఉందని, ముంపు ప్రాంతాల ప్రజలకు తక్షిణ సహాయం కోసం జిల్లా విపత్తు ప్రతిస్పందన దళాలు డిడిఆర్ఆఫ్ బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు. ఈ సందర్శనలో ఏటూరునాగారం ఏఎస్పి శివం ఉపాధ్యాయ, ఏటూరునాగారం సిఐ శ్రీనివాస్, ఎస్సై ఏటూరునాగారం రాజ్ కుమార్, కన్నాయి గూడెం ఎస్ఐ వెంకటేష్ సిబ్బంది పాల్గొన్నారు.

మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ జాతరకు శాశ్వత నిర్మాణ పనులకు రూ.150 కోట్లు మంజూరు

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో: ములుగు జిల్లా తాడ్వాయి ఎస్ ఎస్ మండలంలోని మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర,వచ్చే ఏడాది 2026 జనవరి 28 వ తేది నుంచి 31 వరకు జరిగే, మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ మహా జాతర నిర్వహణ, మేడారం లో శాశ్వత నిర్మాణాల పనుల కోసం 150 కోట్లు మంజూరు చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినది.

రోడ్డు లేక పల్లె వాసులు కష్టాలు

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ : భారతదేశం ప్రపంచ దేశాల సరసాన ఎదుగుతుంది అనడంలో తప్పులేదు అన్నమాట ఎంత నిజమో తెలంగాణ రాష్ట్రంలోని ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలో కంప్యూటర్ యుగంలో కూడా కాలినడకని దిక్కుగా రాత్రి సమయం అయ్యిందంటేవిద్యుత్ దీపాలు లేక ఆమోదం దీపాలే దిక్కుగా నేటి పరిస్థితుల్లో ఎన్నో గ్రామాలు ఉన్నాయి అనడానికి నిదర్శనంగా. ఖానాపూర్ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్దా కాలం పూర్తి చేసుకొని అధికారంలో ఉండి ఈ గ్రామాలకు వంతెన నిర్మించడంతో వంతెన నిర్మించిన ఎనిమిది మాసాలకే వర్షాకాలపు వారుదలకు కొట్టుకపోయింది మళ్లీ ఆ గ్రామాల ప్రజలకు కష్టాలు మొదలయ్యాయి, గిరిజన గ్రామాల్లో రోడ్డు సౌకర్యాలు లేక ఆ గిరిజనులు పడుతున్న నరకయాతన వర్ణనాతీతం. ఆ గ్రామప్రజలు నిత్యావసర సరుకుల కోసం మండల కేంద్రానికి వాగు దాటి 20కిలో మీటర్ల దూరం కాలినడకన వెళ్ళాలి. ఇది ఎక్కడో కాదు నిర్మల్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గంలోని పెంబి మండలంలోని రాంనగర్, యాపల్ గూడ, నాయకపు గూడ, సత్తుగూడెం, వసుపల్లి, చాకిరేవు, దారి, పసుపుల, హరిచందాతండా, తులిసిపేట్, కోరికంటి, గట్టిగూడెం గ్రామాలలో నివసించే గిరిజనుల గ్రామాలకు గత 50 ఏండ్లుగా రహదారులు, రోడ్డు సౌకర్యాలు, వాగుపై వంతెన లేక ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నారు ఒక్కొక్క గ్రామంలో సుమారు 60 -70 గిరిజన కుటుంబాలు జీవనం సాగిస్తున్నారు. ఆ గ్రామాలకు రోడ్డు సౌకర్యాలు లేక వారికి కాలినడకనే శరణ్యం. వర్షాకాలం వచ్చింది అంటే వారు బాహ్యప్రపంచానికి దూరమే. ఆ గ్రామ గిరిజనులు నిత్యావసర వస్తువుల కోసం మండల కేంద్రం పెంబికి వెళ్ళాలంటే దొంతి వాగు దాటి వెళ్ళాలి. పసుపుల, హరిచందాతండా, తులిసిపేట్, కోరికంటి, గట్టిగూడెం గిరిజన గ్రామాలలోని ప్రజలు రాకపోకల కోసం కడం వాగు దాటాలి. ఆ గ్రామ ప్రజలు తెలంగాణ రాష్ట్ర ఏర్పడి తెలంగాణ ప్రభుత్వంలో ఉన్నాము మన కష్టాలు తీరుతాయన్న దశలో బీఆర్ఎస్ ప్రభుత్వం కడెం వాగు పై, కోట్ల రూపాయల ప్రభుత్వ ఖజానాతో పసుపుల బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. మండల కేంద్రానికి రాకపోకల సౌకర్యాలు ఏర్పడినది అని ఆ గ్రామ ప్రజలు, సంతోషంగా ఉన్న తరుణంలో వారీ ఆశలు మూడు రోజుల ముచ్చటగానే మిగిలిపోయాయి. కడెం వాగు పై నిర్మించిన పసుపుల బ్రిడ్జి నిర్మాణం చేపట్టినా ఆరునెలలేకే, అధికారుల నాయకుల పర్సంటేజీల లోపంతో నాసిరకం పనులతో నిర్మించడంతో వచ్చినభారీ వర్షాలకు కొట్టుకుపోయిందని చెపుతున్నారు.

కేంబ్రిడ్జ్ పరీక్షా ఫలితాలపై పెరిగిన ఆసక్తి

విశాలాంధ్ర - న్యూదిల్లీ : ప్రపంచం సాంకేతిక రంగంలో వేగవంతమైన మార్పులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో భారతదేశంలో మరింత మంది విద్యార్థులు, కుటుంబాలు అంతర్జాతీయ విద్య వైపు మొగ్గుచూపుతున్నారు. కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ (కేంబ్రిడ్జ్) జూన్ 2025 పరీక్షా సిరీస్ ఫలితాలను ప్రపంచవ్యాప్తంగా 6,80,000 మందికిపైగా విద్యార్థులకు విడుదల చేసింది. ఇది గత సంవత్సరంతో పోలిస్తే 9% పెరుగుదల. ఇది ప్రపంచ సంసిద్ధత వైపు వేగంగా మారుతున్న విద్యా ధోరణిని ప్రతిబింబిస్తోంది. విద్యార్థుల సంఖ్య పెరగడం వల్ల, ఈ జూన్‌లో పరీక్షా నమోదు సంఖ్య మళ్లీ పెరిగి ప్రపంచవ్యాప్తంగా దాదాపు 17 లక్షలకు చేరుకుంది. ఇది గత సంవత్సరంతో పోలిస్తే 7% వృద్ధి. భారతదేశంలో, జూన్ 2025 పరీక్షా శ్రేణి మొత్తం నమోదు 5% పెరిగింది. నేడు, దేశవ్యాప్తంగా ఉన్న 252 పాఠశాలలలోని 4,680 మంది విద్యార్థులు తమ కేంబ్రిడ్జ్ ఐజీసీఎస్ఈ, జీరో లెవల్ ఫలితాలను అందుకున్నారు. జూన్ 2025 శ్రేణి 21,600 కి పైగా పరీక్షా ఎంట్రీలు నమోదయ్యాయి, ఇది జూన్ 2024తో పోల్చితే 7% వృద్ధిని సూచిస్తుంది.

భారత్‌లో కంటి ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి

న్యూఢిల్లీ : ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా, భారతదేశంలోని ప్రముఖ సూపర్-స్పెషాలిటీ కంటి ఆసుపత్రుల నెట్‌వర్క్ సెంటర్ ఫర్ సైట్, వయస్సుతో వచ్చే కంటి వ్యాధులపై సమయానికి చికిత్స చేయడం ఎంత ముఖ్యమో గుర్తుచేసింది. దేశంలో 60 ఏళ్లకు పైబడిన 14 కోట్లకు పైగా ప్రజలు ఉన్నారు, వారిలో దాదాపు ముగ్గురిలో ఒకరు చూపు సమస్యలతో బాధపడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా, అంధత్వం కేసులలో 80 శాతం నివారించదగినవే. అయినప్పటికీ, అపోహలు, ఆలస్యమైన చికిత్స కారణంగా అనేకమంది వృద్ధులు తమ చూపును కోల్పోతున్నారు. భారతదేశంలో అంధత్వానికి ప్రధాన కారణమైన ముత్యమందు (కేటరాక్ట్), ఇప్పుడు ఆధునిక బ్లేడ్లెస్, రోబోటిక్ లేజర్ శస్త్రచికిత్స ద్వారా అదే రోజున నయం చేయవచ్చు. గ్లాకోమాను తరచుగా "సైలెంట్ థీఫ్ ఆఫ్ సైట్" అని పిలుస్తారు. ఈ నేపథ్యంలో కంటి వ్యాధులపై జాగ్రత్తల కోసం అవగాహన కల్పించేందుకు, సెంటర్ ఫర్ సైట్ ఫిట్‌నెస్ ఐకాన్ మిలింద్ సోమన్‌తో భాగస్వామ్యం చేసుకుంది. ఆయన క్రియాశీల వృద్ధాప్యం, సమగ్ర ఆరోగ్యానికి ప్రతీక. ఈ ప్రచారం కుటుంబాలకు గుర్తుచేస్తోంది. కంటి పరీక్షలు లేకుండా సంపూర్ణ ఆరోగ్యం సాధ్యంకాదని సెంటర్ ఫర్ సైట్ గ్రూప్ ఆఫ్ ఐ హాస్పిటల్స్ చైర్మన్, మెడికల్ డైరెక్టర్ మహిపాల్ ఎస్.సచ్‌దేవ్ అన్నారు.

మొబైల్ ఫోన్లను అత్యవసర వస్తువులుగా పరిగణించాలి : ఐసిఈఏ

హైదరాబాద్: ఇండియా సెల్యులర్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసిఈఏ) దేశంలో అగ్రగామి మొబైల్ ఎలక్ట్రానిక్స్ తయారీదారుల ప్రతినిధి సంస్థ, మొబైల్ ఫోన్లు, వాటి భాగాలను అత్యవసర వస్తువులకు కేటాయించిన 5% జీఎస్టీ స్లాబ్‌లో ఉంచాలని విజ్ఞప్తి చేసింది. ప్రస్తుతం అమలులో ఉన్న18శాతం జీఎస్టీ ప్రతికూలంగా ఉందని, అంతేకాకుండా దేశంలోని 90 కోట్లకు పైగా ప్రజలకు డిజిటల్‌అనుకూలతకు ప్రధాన సాధనమైన మొబైల్ ఫోన్లు అత్యవసర అవసరాలుగా పరిగణించబడాలని ఐసిఈఏ రాబోయే జీఎస్టీ సంస్కరణల సందర్భంలో స్పష్టం చేసింది. "మొబైల్ ఫోన్ ఇకపై ఒక ఆశావహసాధనం మాత్రమే కాదు. ఇది విద్య, ఆరోగ్యం, ఆర్థిక చేర్పు, పరిపాలనకు అవసరమైన డిజిటల్ మౌలిక వసతి. కాబట్టి ప్రధానమంత్రి జీఎస్టీ సంస్కరణల అజెండా, ఆయన యుఎస్డీ 500 బిలియన్ ఎలక్ట్రానిక్స్ ఎకోసిస్టమ్ సృష్టి కోణానికి అనుగుణంగా మొబైల్ ఫోన్లపై 5శాతం జీఎస్టీ విధించబడటం సముచితమని" ఐసిఈఏ చైర్మన్ పంకజ్ మహీంద్రూ పేర్కొన్నారు.

ఏపీలో తొలి మహిళల థండర్‌ప్లస్ ఈవీ ఫ్రాంచైజీ ప్రారంభం

ముంబయి : భారతదేశంలో వేగంగా ఎదుగుతున్న ఈవీ చార్జింగ్ నెట్వర్క్ అయిన థండర్ ప్లస్, మరో మైలురాయిని చేరుకుంది. దేశంలో రెండవ మహిళల యాజమాన్యంలోని ఈవీ చార్జింగ్ ఫ్రాంచైజీని, అలాగే ఆంధ్రప్రదేశ్‌లో మొదటిసారి ఒక ఈవీ ఫ్రాంచైజీని ప్రారంభించింది. ఈ అడుగు ఈవీ వినియోగాన్ని మాత్రమే వేగవంతం చేయడం కాదు, మహిళలలో వ్యాపార స్ఫూర్తిని కూడా పెంచుతుంది. వ్యూహాత్మక స్థానం మంగళగిరిలోని ఎన్‌హెచ్-16 మీద, విజయవాడ, గుంటూరు హైవేపై ఉన్న హోటల్ విజయశ్రీ వద్ద ఏర్పాటు చేయబడిన ఈ స్టేషన్, ప్రయాణికులకు వారి వాహనాలను చార్జ్ చేసుకునే, హోటల్ సౌకర్యాలను ఉపయోగించుకునే అద్భుతమైన పిట్‌స్టాప్‌గా ఉంటుంది. 50 కిలోవాట్ సామర్థ్యంతో ప్రారంభమై, భవిష్యత్తులో 1 మెగావాట్ వరకు పెంచుకునే వీలుంది. ప్రస్తుతం, ఈ స్టేషన్లో 30 కిలోవాట్ డీసీ సీసీఎస్2 ఫాస్ట్ ఛార్జర్, రెండు 3.3 కిలోవాట్ ఏసీ ఛార్జర్లు ఉండగా, రెండు, మూడు, నాలుగు చక్రాల వాహనాలకు సౌకర్యం కల్పిస్తుంది. "ఇది వాహనాలను మాత్రమే ఛార్జ్ చేయడం కాదు, ఇది కలలను ఛార్జ్ చేయడం కూడా," అని ఫ్రాంచైజీ యజమాని లీలా లక్ష్మి అన్నారు.

ఐదు ఆయుర్వేద సూపర్‌ఫుడ్‌లతో మొటిమలకు వీడ్కోలు

ముంబయి : ఆయుర్వేదం ప్రకారం, రుతుపవనాల సమయంలో వచ్చే కాలానుగుణ మార్పులు దోషాలను, ముఖ్యంగా వాత , పిత్త దోషాలను తీవ్రతరం చేస్తాయి. మొటిమలు లేదా దద్దుర్లు వంటి చర్మ సమస్యలకు దారితీస్తాయి. హాట్ డ్రింక్స్ , వేయించిన ఆహారాల పట్ల కోరికలు సహజమే అయినప్పటికీ , సరైన చర్మ సంరక్షణతో పాటు, ఆహారం ద్వారా ఈ సీజన్‌లో చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చు. ప్రముఖ ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ మధుమిత కృష్ణన్ మాట్లాడుతూ, బాదం నుండి త్రిదోష సమతుల్య ఆమ్లా వరకు ఐదు ఆయుర్వేద సూపర్‌ఫుడ్‌లను సిఫార్సు చేస్తున్నారు. దాంట్లో బాదం మొదటిది. ఎందుకంటే బాదాములు రుచి పరంగా తీపిగా ఉంటాయి. ఇవి వాత , పిత్త దోషాలను సమతుల్యం చేస్తాయి. రెండోది పసుపు. దీన్ని యాంటీ బాక్టీరియల్ , యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాల కోసం ఎక్కువగా వినియోగిస్తుంటారు. జీర్ణక్రియను ఉత్తమంగా ఉంచడానికి , వాత దోషాన్ని చర్మానికి సరైన రీతిలో సమతుల్యం చేయడానికి ఇది ఒక అద్భుతమైన మార్గం. మూడోది ఆమ్లా (భారతీయ గూస్బెర్రీ). త్రిదోషాలను సమతుల్యం చేసే ఆమ్లా, రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. ఇక నాల్గవది వేప. వేపలోని యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ , రక్త శుద్ధి లక్షణాలు మొటిమలు లేని చర్మానికి ఆయుర్వేదంలో అత్యంత నమ్మదగిన చికిత్సలలో ఒకటిగా నిలుస్తుంది. ఐదోదవది వెల్లుల్లి. ఘాటైన రుచి ఉన్నప్పటికీ వెల్లుల్లిలోని వాత సమతుల్య లక్షణాలు, లోపలి నుండి పనిచేస్తాయి.

స్కాపియా 'ది లీప్ ఇయర్' ఆవిష్కరణ

ముంబయి : భారతదేశంలోని ప్రముఖ ట్రావెల్ ఫిన్‌టెక్ కంపెనీ అయిన స్కాపియా, ది లీప్ ఇయర్‌ను ప్రారంభించడం ద్వారా సంచార కోరికను వాస్తవంగా మారుస్తోంది. ఇది ఇద్దరు యువ, ఆసక్తిగల ప్రయాణికుల కోసం నాలుగు ఖండాలలో జీవితకాలంలో ఒకసారి మాత్రమే జరిగే, పూర్తిగా నిధులతో కూడిన 12 నెలల ప్రయాణం. కేవలం ఒక యాత్ర కంటే, ఇది అన్వేషణ, పెరుగుదల, స్వీయ-ఆవిష్కరణ సంవత్సరం - ప్రయాణికులు వారి అభిరుచులు, కలలు, ఉత్సుకతకు సరిపోయేలా స్కాపియాతో పాటు వారి స్వంత సాహసయాత్రను సహ-రూపకల్పన చేస్తారు. కొత్త తరం కోసం సాంప్రదాయ "గ్యాప్ ఇయర్"ను తిరిగి ఊహించుకుంటూ, స్కాపియా సమయం యొక్క ఆలోచనను ధైర్యంగా, ఉద్దేశపూర్వక లీపుగా మారుస్తోంది - ఇది వ్యక్తిగత వృద్ధి, ప్రపంచ దృక్పథాలు మరియు జీవితాన్ని మార్చే అనుభవాలకు ఆజ్యం పోస్తుంది. స్కాపియా ప్రతినిధి మాట్లాడుతూ, "స్కాపియాలో, ప్రయాణం ఒక విరామం కాదని మేము నమ్ముతున్నామన్నారు.

గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఇండియా జూనియర్ ఇంటర్నేషనల్ సిరీస్

హైదరాబాద్: ఇండియా జూనియర్ ఇంటర్నేషనల్ సిరీస్ 2025, ప్రీమియర్ బీడబ్ల్యుఎఫ్-మంజూరు చేసిన జూనియర్ టోర్నమెంట్, ఆగస్టు 2024, 2025 హైదరాబాద్‌లోని కోటక్ పుల్లెల్ గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీకి తిరిగి వస్తోంది, నగరాన్ని ప్రపంచ బ్యాడ్మింటన్ హబ్‌గా మళ్లీ స్థాపిస్తూ. ప్రపంచవ్యాప్తంగా 350 మందికి పైగా వర్ధమాన తారలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. కార్యక్రమం ఆగస్టు 20, ఉదయం 11:00 గంటలకు తాత్కాలికంగా తెలంగాణ రాష్ట్ర క్రీడలు మరియు యువజన సేవల మంత్రి శ్రీ వాకిటి శ్రీహరి సమక్షంలో ప్రారంభమవుతుంది. ఫైనల్స్ ఆగస్టు 24, ఉదయం 9:00 గంటలకు ప్రారంభమవుతాయి, తదుపరి మధ్యాహ్నం 1:00 గంటలకు బహుమతి ప్రధానోత్సవం జరుగుతుంది. ఈ సంవత్సరం ఎడిషన్‌లో ఇంగ్లాండ్, ఇరాన్, ఐర్లాండ్, ఇండియా, మలేషియా, థాయిలాండ్, యుఎస్ఎ, యుఎఇలకు ప్రాతినిధ్యం వహిస్తున్న యువ షట్లర్లు బహుళ సింగిల్స్, డబుల్స్ విభాగాలలో తీవ్రమైన పోటీని ప్రదర్శించనున్నారు.

సంపాదకీయం

ప్రతిపక్ష ప్రభుత్వాలకు ఉరి తాడు

ఓట్ల దొంగతనం గురించి ప్రతిపక్షాలు, ముఖ్యంగా రాహుల్ గాంధీ బయటపెట్టిన అంశాలు మోదీ సర్కారుకు ఊపిరాడకుండా చేస్తున్నాయి. ఈ తీవ్రమైన అంశం గురించి ప్రజల దృష్టిని మరల్చడానికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా బుధవారం పార్లమెంటులో ఓ బిల్లు ప్రతిపాదించారు. ఈ బిల్లు 130వ రాజ్యాంగ సవరణ బిల్లు అవుతుంది. ఈ బిల్లు కనక చట్టం అయిపోతే ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు మొదలైనవారి మీద ఆరోపణలువస్తే ఆ ఆరోపణలు రుజువు కాకపోయినా వారు పదవి వదులుకోవాల్సి వస్తుంది. ఇందులో ప్రధానమంత్రిని కూడా చేర్చినందువల్ల తాము ఎంత నిష్పాక్షికంగా ఉన్నామో చెప్పడానికి అమిత్ షా ప్రయత్నించారు. 130వ రాజ్యాంగ సవరణ బిల్లుతో సహా కేంద్ర పాలిత ప్రాంతాల (సవరణ)బిల్లు, జమ్మూ-కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) చట్టం అని మూడు బిల్లులు అమిత్ షా ప్రతిపాదించారు. ఏ ముఖ్యమంత్రి మీదైనా అవినీతి ఆరోపణలు వచ్చి, అరెస్టై 30 రోజులపాటు జైలులో ఉంటే, ఆ వ్యక్తి నేరస్థుడని రుజువు కాకపోయినా గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లు అలాంటి ముఖ్యమంత్రులను బర్తరఫ్ చేయవచ్చు. పైపైన చూసినా ఎవరి మీద ఎంతటి ఆరోపణలు వచ్చినా, నేరస్థుడని న్యాయస్థానాలు దోషులని తేల్చే దాకా అందరూ నిరపరాధులే అన్న సూత్రాన్ని ఈ బిల్లు తుంగలో తొక్కుతుంది. చట్టాన్ని ఉల్లంఘించి 30 రోజుల పాటు జైలులో ఉంటే, లేదా అయిదేళ్లపాటు శిక్ష పడే అవకాశం ఉంటే ప్రధానమంత్రి సలహా మేరకు రాష్ట్రపతి అలాంటి నాయకులను తొలగించవచ్చునన్నది ఈ బిల్లు సారాంశం. ఒక వేళ ఒక నాయకుడు 30 రోజులపాటు జైలులో ఉన్న తరవాత ప్రధానమంత్రి ఆ నాయకుడిని తొలగించాలని 31వ రోజున సిఫార్సు చేయకపోయినా ఆ నాయకుడి మంత్రి పదవి ఊడుతుంది. ఇదే సూత్రం చట్టాన్ని ఉల్లంఘించి, అరెస్టై, 30 రోజులపాటు జైలులో ఉన్నా ఈ కేసులో అయిదేళ్లవరకు శిక్షపడే అవకాశం ఉంటే ప్రధానమంత్రికి కూడా వర్తిస్తుందట. అంటే ఆరోపణల కారణంగా 30 రోజులు జైలులో గడిపిన ప్రధానమంత్రి రాజీనామా చేయాలట. ఒక వేళ ప్రధానమంత్రి రాజీనామా చేయకపోయినా ఆయన పదవి లేనట్టేనట. కేంద్రపాలిత ప్రాంతాల చట్టంలోనూ ఇదే అంశం చేర్చడానికి ఈ బిల్లు ఉపకరిస్తుంది. జమ్మూ-కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోనూ ఈ సవరణే చేర్చాలన్నది అమిత్ షా ప్రయత్నం. ఈ బిల్లుగనక చట్టం అయితే ముఖ్యమంత్రులను, లేదా మంత్రులను తొలగించడానికి కేంద్ర ప్రభుత్వానికి అధికారం ఉంటుంది. కశ్మీర్‌కు కూడా ఇదే సూత్రాన్ని వర్తింపచేయడం అంటే కాశ్మీర్‌కు మునుపున్న రాష్ట్రప్రతిపత్తి ఇప్పట్లో పునరుద్ధరించే అవకాశం లేనట్టే. ఈ ప్రతిపాదిత బిల్లు నిరవధికంగా జమ్మూ-కశ్మీర్ పై కేంద్ర పెత్తనం చెలాయించడానికి అవకాశం కల్పిస్తుంది. 19(ఎ) నిబంధన ప్రకారం ఏ మంత్రి అయినా బిల్లు ప్రతిపాదించదలిస్తే ముందు లోకసభ సెక్రెటరీ జనరల్‌కు నోటీసు ఇవ్వాలి. 19(బి) ప్రకారం బిల్లు ప్రతులను లోకసభ సభ్యులందరికీ అందించాలి. ఈ విషయాలేవీ అమిత్ షా పాటించలేదు. ఈ విషయంలో కాస్త రాయితీ ఇవ్వాలని మాత్రం సెక్రెటరీ జనరల్ ను కోరారు. పార్లమెంటు సమావేశాలు మరో రెండు రోజులు మాత్రమే జరగాల్సి ఉండగా అమిత్ షా హఠాత్తుగా మూడు బిల్లులు ప్రతిపాదించారు. నియమాలను అనుసరించనందుకు కాస్త వెసులుబాటు కలిగించాలని లోకసభ స్పీకర్ ఓం బిర్లా సెక్రెటరీ జనరల్‌ను కోరడం మరో విచిత్రం. దోషులుగా తేలకపోయినా మంత్రులు, ముఖ్యమంత్రులు, కడకు ప్రధాన మంత్రిని కూడా తొలగించే అవకాశం కల్పించడం అంటే ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల విషయంలో కేంద్రం ఇష్టానుసారంగా వ్యవహరించే వీలు కల్పించడమే. ఇది ప్రతిపక్ష నాయకులమీద ప్రయోగించిన ఎన్‌ఫోర్స్‌మెంటు డైరెక్టొరేట్, సీబీఐ తదితర వ్యవస్థలను మోదీ ప్రభుత్వం దుర్వినియోగం చేసిన దానికన్నా అనేక రెట్లు భయంకరమైంది.

అమిత్ షా తీసుకొచ్చిన ఈ బిల్లు ఘోరమైందన్న విషయం అలా ఉంచినా తమకు నచ్చని ముఖ్యమంత్రిని, ఇతర మంత్రులను గద్దె దించడానికి ఆరోపణలు మోపి, 30 రోజులపాటు జైలులో పెట్టి, బెయిలు రాకుండా సకలవిధ ప్రయత్నాలూ చేసి చివరకు గద్దె దించడానికి పన్నిన కిరాతకమైన ప్రయత్నమే ఇది. ఎన్‌ఫోర్స్‌మెంటు డైరెక్టొరేట్‌తో సహా కేంద్ర ప్రభుత్వం అధీనంలో ఉన్న వివిధ వ్యవస్థలను బలాదూరుగా దుర్వినియోగం చేయడానికే ఈ బిల్లు ప్రతిపాదించారు. కాంగ్రెస్ ముక్త్ భారత్ అన్న మోదీ నినాదం అలా ఉండగానే ప్రతిపక్షాలు లేని వ్యవస్థను నెలకొల్పడానికి ఎప్పటి నుంచో చేపట్టిన తీవ్ర ప్రయత్నాలలో ఈ బిల్లూ భాగమే. అమిత్ షా ప్రతిపాదించిన ఈ బిల్లుకు సిగ్గుపడే పరిస్థితి వచ్చింది. మోదీ పాలనలో ఆ ప్రభుత్వంపై అనేక ఆరోపణలు వచ్చాయి. ఒక్క వ్యవహారంలో కూడా కనీసం దర్యాప్తు చేయడానికైనా ముందుకు రాలేదు. నిర్లజ్జకు ఆలవాలమైన మోదీ ప్రభుత్వం ఆరోపణలు వచ్చిన వారిని తొలగించడానికి ఈ కపట ప్రయత్నం చేయడం హాస్యాస్పదం. అయితే అమిత్ షా ఒక్క జాగ్రత్త మాత్రం తీసుకున్నారు. ఈ బిల్లు చట్టం అయితే అది భవిష్యత్తులోనే అమలవుతుంది తప్ప పాత ఆరోపణలకు, కేసులకు వర్తించదు. లేకపోతే అమిత్ షా గతంలో జైలులో గడిపారు కనక ఆయనకూ వర్తించేది. కీ.శే. సత్యపాల్ మాలిక్ మోదీ ప్రభుత్వం అవినీతిని ఎండగడ్తే ఆయన మీదే కేసులు మోపారు. ఆసుపత్రిలో ఉన్న సమయంలోనూ దర్యాప్తు పేరిట వేధించారు. కానీ ప్రతిపక్ష నేతలపై అనేక ఆరోపణలు మోపారు. జైలులో వేశారు. రాజీనామా చేయాలని వెంటాడారు. మోదీ సర్కారు నైతికత గురించి మాట్లాడడం ఆశ్చర్యకరమే కాదు, హాస్యాస్పదం. అమిత్ షా ఈ బిల్లు ప్రతిపాదించినప్పుడు ప్రతిపక్షాలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. బిల్లు ప్రతులను చించేసి అమిత్ షా వేపు విసిరేశారు. ఆ తరవాత ఈ బిల్లుని సంయుక్త పార్లమెంటరీ కమిటీకి నివేదించాలని నిర్ణయించారు. ఈ బిల్లుల అంతస్సారం ఏమిటంటే న్యాయవ్యవస్థ గుణదోషాలు విచారించి తీర్పు చెప్పకముందే ప్రభుత్వం ఆరోపణలున్న మంత్రులను, ముఖ్యమంత్రులను సునాయాసంగా పదవీచ్యుతుల్ని చేయగలుగుతుంది. మరో రకంగా చెప్పాలంటే ప్రజాస్వామ్యాన్ని పోలీసు రాజ్యంగా మార్చేయడమే. రాజ్యాంగ మౌలిక చట్రాన్ని తుంగలో తొక్కడమే. చట్టబద్ధ పాలనను అడుసులో తొక్కడమే. దిల్లీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అరవింద్ కేజ్రీవాల్‌ను జైలులో పెట్టినా ఆయన రాజీనామా చేయలేదు. కానీ విడుదలైన తరవాత రాజీనామా చేశారు. బహుశ: ఇలాంటి ఉదంతాలను నివారించడానికే మోదీ ప్రభుత్వం ప్రతిపక్షాల ప్రభుత్వాలకు ఉచ్చు బిగించే చట్టం తెస్తున్నట్టుంది. కానీ మోదీ అసలు ఉద్దేశం ఈ చట్టం ప్రతిపక్ష ప్రభుత్వాలకు ఉరితాడు బిగించడమే.

కశ్మీర్‌లోయలో తీవ్ర విషాదం

డి జయరామ్

మన స్వాతంత్ర్య దినోత్సవానికి ముందురోజు జమ్మూ కాశ్మీర్‌లోని సుందరమైన లోయలలో ఒక పెనువిషాదం చోటుచేసుకుంది. ఈ సంఘటన కిష్త్వార్ జిల్లాలోని చసోటి పట్టణంలో జరిగింది. హిమాలయ రాష్ట్రమైన ఉత్తరాఖండ్‌లోని భారీ వరదలు, బురదజల్లులు ఒక గ్రామాన్ని మొత్తం ముంచెత్తిన వారం రోజుల తర్వాత ఇది సంభవించింది. ఆగస్టు 14, 2025న సంభవించిన వినాశకరమైన 'క్లౌడ్ బర్స్ట్' (మేఘ విస్ఫోటనం - కుండపోత వర్షం) ఆ ప్రాంతంలో నీటిని, బురదను ప్రవాహంగా మార్చి, విధ్వంసాన్ని మిగిల్చింది. ప్రకృతి వైపరీత్యాలకు ఆ ప్రాంతం ఎంత సున్నితంగా ఉందో ఈ ఘటన మరోసారి నొక్కి చెప్పింది. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నప్పటికీ మనం కేవలం నష్టానికి చింతించడమే కాకుండా, ఇలాంటి విపత్తుల వెనుక ఉన్న శాస్త్రీయ కారణాలు, వాటి తీవ్రతను పెంచడంలో మన పాత్ర, భవిష్యత్తులో వీటిని ఎదుర్కోవడానికి అవసరమైన పటిష్టమైన వ్యూహం గురించి



చర్చించుకోవాల్సిన అవసరం ఎంతైనాఉంది. జమ్మూ కాశ్మీర్‌లోని ప్రభావిత ప్రాంతాల నుండి అందుతున్న ప్రాథమిక నివేదికలు భయానక చిత్రాన్ని చూపుతున్నాయి. ఒక చిన్న ప్రాంతంలో అకస్మాత్తుగా, అతి తీవ్రంగా కురిసిన వర్షం వల్ల ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడ్డాయి. నదులు క్షణాల్లో ఉప్పొంగి ఇళ్లను, వంతెనలను, రోడ్లను తుడిచిపెట్టేశాయి. నీటి ప్రవాహ వేగం, పరిమాణం ప్రజలకు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్ళే సమయం కూడా ఇవ్వలేదు. దీని ఫలితంగా తీవ్రమైన ప్రాణ, ఆస్తినష్టం జరిగింది. ఇది ఏదో అరుదుగా జరిగిన సంఘటన కాదు, హిమాలయ రాష్ట్రాలను ఆందోళనకర స్థాయిలో పట్టిపీడిస్తున్న వాతావరణ సంబంధిత విపత్తుల పరంపరలో ఇది తాజా ఘటన మాత్రమే.

క్లౌడ్‌బర్స్ట్ అనేది ఒక తీవ్రమైన వర్షపాత ఘటన. భారత వాతావరణ శాఖ ప్రకారం, సుమారు 20 నుండి 30 చదరపు కిలోమీటర్ల భౌగోళిక ప్రాంతంలో, గంటకు 100 మిల్లీమీటర్ల (లేదా 10 సెంటీ మీటర్ల) కంటే ఎక్కువ వర్షపాతం అకస్మాత్తుగా కురిస్తే దానిని 'క్లౌడ్‌బర్స్ట్' అంటారు. ఆకాశంలో నీటితో నిండిన ఒక పెద్ద బెలూన్ ఒక్కసారిగా పగిలిపోతే ఎలా ఉంటుందో, క్లౌడ్‌బర్స్ట్ కూడా అలాంటిదే. సాధారణంగా, అధిక తేమను కలిగిన క్యుములోనింబస్ మేఘాల వల్ల ఇవి సంభవిస్తాయి. వెచ్చని, తేమతో కూడిన గాలి పైకి లేచినప్పుడు, నీటి బిందువులు కింద పడకుండా బలమైన గాలి ప్రవాహాల వల్ల పైకి నెట్టబడతాయి. దీనివల్ల చాలా పెద్దమొత్తంలో నీరు ఒకేచోట పేరుకుపోతుంది. ఆ గాలి ప్రవాహాలు ఇక ఆ నీటి బరువును మోయలేనప్పుడు, ఆ నీరంతా ఒక్కసారిగా కుండపోతలా కిందకు పడుతుంది. జమ్మూ కాశ్మీర్ వంటి పర్వత ప్రాంతాలు ఈ పరిస్థితిని మరింత తీవ్రతరం చేస్తాయి. అక్కడి నిటారుగా ఉండే కొండ వాలుల కారణంగా, ఆ నీరు అపారమైన వేగంతో, శక్తితో కిందికి ప్రవహించి, వినాశకరమైన ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటం, బురద ప్రవాహాలకు కారణమవుతుంది. క్లౌడ్‌బర్స్ట్‌లు సహజమైనవే అయినప్పటికీ వాటి సంఖ్య, తీవ్రత పెరగడానికి మానవప్రేరిత వాతావరణ మార్పులే ప్రధాన కారణం. భూతాపం పెరగడం వల్ల ఉష్ణోగ్రతలు పెరిగి, వాతావరణం ఎక్కువ తేమను పట్టి ఉంచే సామర్థ్యాన్ని పొందుతుంది. ఇలా అదనపు శక్తిని పుంజుకున్న వాతావరణం తీవ్రమైన వర్షపాతాలకు దారితీస్తుంది. అంతేకాకుండా, పర్యావరణపరంగా సున్నితమైన ప్రాంతాలలో విచ్చలవిడిగా, అస్తవ్యస్తంగా జరుగుతున్న పట్టణీకరణ, అటవీ నిర్మూలన, నిర్మాణ పనులు సహజ నీటి ప్రవాహ మార్గాలను అడ్డుకుంటున్నాయి. ఇది కొండ వాలులను బలహీనపరిచి, క్లౌడ్‌బర్స్ట్ విధ్వంసక శక్తిని మరింత పెంచుతుంది.

మన దేశంలో క్లౌడ్‌బర్స్ట్‌ల వల్ల జరిగిన విషాదాలకు సుదీర్ఘ చరిత్ర ఉంది. 2013లో ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్‌లో సంభవించిన క్లౌడ్‌బర్స్ట్, దాని తర్వాతి వరదలు వేలాదిమంది మరణానికి కారణమయ్యాయి. ఆ ఘటన మన బలహీనతను గుర్తుచేస్తూనే ఉంటుంది. ఇతర ముఖ్యమైన సంఘటనల గురించి తెలుసుకుంటే 2010లో లేహ్, లడఖ్‌లో వరుస క్లౌడ్‌బర్స్ట్‌ల వల్ల ఆకస్మిక వరదలు, బురద ప్రవాహాలు ఏర్పడి విస్తృతమైన విధ్వంసం జరిగింది. అలాగే, 2005లో ముంబైలో సంభవించిన అపూర్వమైన క్లౌడ్‌బర్స్ట్ దేశ ఆర్థిక రాజధానిని స్తంభింపజేసి, వెయ్యి మందికి పైగా ప్రాణాలను బలిగొంది. 2022లో పవిత్ర అమర్‌నాథ్ గుహ సమీపంలో జరిగిన క్లౌడ్‌బర్స్ట్ వల్ల యాత్రికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటనలన్నీ ఒక భయంకరమైన నిజాన్ని నొక్కి చెబుతున్నాయి. హిమాలయాల నుండి తీరప్రాంతాల వరకు, ఏ ప్రాంతమూ సురక్షితం కాదు. వీటివల్ల కలిగే ప్రధాన ప్రమాదాలు ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటం, మౌలిక సదుపాయాల నాశనం, వ్యవసాయ భూముల నష్టం, భారీ ప్రాణ నష్టం.

అసోంలో భద్రతలేని మైనారిటీలు

ఆశిస్ బిశ్వాస్

అసోంలో అధికారంలోఉన్న బీజేపీ పాలనలో ఏమాత్రం మైనారిటీలకు (ముస్లింలకు) భద్రత లేకుండాపోయింది. అదే పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ పాలనలో అధికారిక విధానాలు ఎక్కువగా మైనారిటీలకు భద్రత కల్పించేవిగా, సంక్షేమ కార్యక్రమాలను అమలు జరిపేవిధంగా ఉన్నాయి. అధికారులు చాలా సున్నితంగా పిలవడం అలాగే అధికారిక ప్రకటనలు ముస్లింలకు అన్నివిధాలుగా భద్రత కల్పిస్తున్నారు. ఒక రాష్ట్రం ఏమాత్రం భద్రతలేకుండా చేస్తుంటే మరో రాష్ట్రం భద్రతాచర్యలను చేపడుతోంది. వివిధ మీడియా నివేదికలు, అనేక నిపుణుల అధ్యయనాల ప్రకారం బీజేపీ ప్రభుత్వ విధానాలు ఇటీవల ముస్లింలను తీవ్రంగా బెదిరిస్తున్నారు. అస్సామీ మాట్లాడే ముస్లింలు లేదా అత్యంత మేలైన విధంగా ముస్లిలం ప్రవర్తన ఉండటం అసోంలో ఉంది. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై తీవ్రంగా నిరసన తెలియజేస్తున్నారు. బీజేపీ ప్రభుత్వంలో విద్య, ఉద్యోగాలు, భూమి కేటాయింపులాంటివి ఏమాత్రం ఉండటంలేదు. కాంగ్రెస్ మద్దతుగల ఆల్ ఇండియా యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఏఐయుడిఎఫ్), రాష్ట్రానికే పరిమితమైన కొన్నిచిన్నచిన్న పార్టీలు తరచుగా పోలీసుల వేధింపుచర్యలపై, అధికారుల వివక్షపైన న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు. వివిధ పలుకుబడిగలిగిన ...గ్రూపులు న్యాయంకోరుతూ ర్యాలీలు నిర్వహిస్తున్నాయి. ఇతర విధాలుగాకూడా నిరసన తెలియజేస్తున్నాయి. గువహటి హైకోర్టు, సుప్రీంకోర్టు బీజేపీ లక్ష్యంగా చేసుకున్న వర్గాలను ఎగతాళిచేయడం, ద్వేషాన్ని, అసూయను ప్రదర్శించడంపై తీవ్రంగా విమర్శిస్తున్నాయి.

అసోంలో 35శాతం ముస్లిం జనాభా ఉన్నది. అలాగే పశ్చిమబెంగాల్‌లో ముస్లింలు 27శాతం ఉన్నారు. అదేసమయంలో తూర్పు పాకిస్తాన్ (బంగ్లాదేశ్) అంతర్జాతీయ సరిహద్దుల్లో అనేక జిల్లాలుఉన్నాయి. గత కొన్ని దశాబ్దాలుగా బంగ్లాదేశ్‌నుంచి ముస్లింలు సరిహద్దులు దాటివచ్చి నివసిస్తున్నారు. బీజేపీ నాయకత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినతర్వాత కేంద్రప్రభుత్వం సరిహద్దు ప్రాంతాల్లోని స్థానిక ప్రజల రక్షణ చర్యలను చేపట్టడమేగాక అక్రమంగా సరిహద్దులుదాటి చొరబడుతున్నవారిని అనుమతించడంలేదు. కొన్నేళ్లుగా అక్రమంగా అసోంలోకి బంగ్లాదేశ్‌నుంచి చొరబడుతున్నవారిలో మార్పులువచ్చాయి. 50, 60దశకంలో పెద్దసంఖ్యలో భారతదేశంలోకి బంగ్లాదేశ్‌నుంచి వచ్చి స్థిరపడుతున్నారు. ఇటీవల దశాబ్దాలలో అనేకమంది ముస్లింలు అక్రమంగా చొరబడి ఇండియాలో స్థిరపడిపోయారు. పశ్చిమబెంగాల్ కంటే ఎక్కువగా అసోంలోకి ఏదోవిధంగా వచ్చి స్థిరపడుతున్న వారిపై అధికారంలోకి వస్తున్నవివిధ పాలకులు ఎంతో కఠినంగా చూస్తున్నారు. పశ్చిమబెంగాల్‌లోకంటే అసోంలోకి వచ్చి చేరిన వారి సంఖ్యే ఎక్కువగా ఉంది. అసోంలోనూ, ఈశాన్యప్రాంతంలోనూ ఎక్కువగా గిరిజన ప్రజలు నివసిస్తున్నారు.

> బీజేపీ ప్రభుత్వ విధానాలు ఇటీవల ముస్లింలను తీవ్రంగా బెదిరిస్తున్నారు. అస్సామీ మాట్లాడే ముస్లింలు లేదా అత్యంత మేలైన విధంగా ముస్లిలం ప్రవర్తన ఉండటం అసోంలో ఉంది. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై తీవ్రంగా నిరసన తెలియజేస్తున్నారు. బీజేపీ ప్రభుత్వంలో విద్య, ఉద్యోగాలు, భూమి కేటాయింపులాంటివి ఏమాత్రం ఉండటంలేదు.

వీరిలోనూ భిన్నజాతి గ్రూపులున్నాయి. పశ్చిమబెంగాల్‌లోకి వచ్చేవారికంటే ఈశాన్యప్రాంతాలలో ఉన్న గ్రూపులు పరిపరివిధాలుగా ఉన్నాయి. అసోం, ఈశాన్య రాష్ట్రాలలో నివసిస్తున్న వివిధగ్రూపులు ప్రస్తుతం తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. స్థానికేతరులే ఎక్కువగా నివసిస్తున్నారు. ఆయా రాష్ట్రాలలో స్థానికంగా ఉన్నవారికంటే ఎప్పుడో ఇక్కడకువచ్చి స్థిరపడినవారు వివిధ సంస్కృతులను అనుసరిస్తున్నారు. అక్రమంగా చొరబడిన ముస్లింల పట్ల అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ దూకుడుగా కఠినంగా వ్యవహరిస్తున్నారు. బంగ్లాదేశ్‌నుంచి వచ్చినవారు కొన్ని ప్రాంతాలలో చాలా తక్కువగా ఉన్నారు. అలాగే మణిపూర్, మిజోరం రాష్ట్రాలనుంచి వచ్చిన గిరిజన గ్రూపులలో తేడాలు ఎక్కువగా ఉన్నాయి. పొరుగున ఉన్న మియన్మార్‌కు చెందిన గిరిజనజాతుల పట్ల ఎంతో వ్యతిరేకత ఉంది. కొని దశాబ్దాలుగా అసోంను పాలిస్తున్న వారిలో ప్రస్తుత ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ రెచ్చగొడుతున్నారు. ప్రస్తుతం అసోంను పాలిస్తున్న ముఖ్యమంత్రి శర్మ స్వాతంత్ర్య దినోత్సవం రోజుకూడా ముస్లింలను, గిరిజనులను రెచ్చగొడుతూ మాట్లాడారు. వారికి మద్దతిస్తున్న వివిధ పార్టీలను ఖండించారు. మీడియాలోని వివిధ శిక్షణలు కావాలనే ప్రజలలో ప్రత్యేకవాదం విషాన్ని విస్తరింపచేస్తున్నారు. అయితే ఈ ఘటనలను విమర్శిస్తున్నవారు ముఖ్యమంత్రి శర్మను వ్యతిరేకిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏమిచేస్తాయని విమర్శకులు ప్రశ్నిస్తున్నారు. ఈ పరిణామాలపై కళ్లు మూసుకుని ఉంటున్నారని జనాభాలో ఎక్కువగా మార్పులు ఉన్నాయని ఏ మాత్రం పరిశీలన చేయడంలేదని ఎలాంటి చర్యలను తీసుకోవడంలేదని విమర్శకులు ఆరోపిస్తున్నారు. ముఖ్యమంత్రి చర్యలపై విశ్లేషిస్తూ శర్మ విమర్శకులను తీవ్రంగా పరిగణించడంలేదు. పైగా ముస్లింల ఆస్తులను, నివాసగృహాలను మంజూరు చేయలేదని చెబుతూ ముందుగా హెచ్చరించకుండానే బుల్‌డోజర్‌లతో కూలగొడుతున్నారు. తన వ్యతిరేక గ్రూపులను హెచ్చరిస్తూ అక్రమంగా చొరబడేవారిని అదుపుచేసే సామర్థ్యం లేకుండాపోయిందని గత దశాబ్దికాలంగా అసోంకు చెందని ముఖ్యమంత్రి పాలిస్తున్నారు.

రాజకీయాలపై ఈ పంథా తీవ్రంగా పనిచేస్తోంది. బంగ్లాదేశ్‌లో హిందువుల పట్ల మితిమీరిన చర్యలను తీసుకుంటున్నారని టెలివిజన్ దృశ్యాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలోనే శర్మ తీసుకుంటున్న చర్యలు సరైనవేనని కొందరు మాట్లాడుతున్నారు. అలా విమర్శించేవారిలో కాంగ్రెస్ లేదా ఏఐడీయూ నాయకులు ఉన్నారు. విచారకరమైన అంశం ఏమంటే శర్మ బీభత్స చర్యలు సరైనవని కొందరు భావిస్తున్నారు. కొన్నిగ్రూపులు మద్దతు తెలియజేస్తున్నాయి. ఇదే సమయంలో పశ్చిమబెంగాల్‌లో మమతా బెనర్జీ ఓటు బ్యాంకు విధానాలను అనుసరిస్తున్నారని బీజేపీ నాయకులు విమర్శిస్తున్నారు. మిశ్రమగ్రూపుల జనాభాలోమహిళా ఓటర్లు సీఆర్‌పీ సిబ్బంది దాడులను భౌతికంగానే ఎదుర్కొంటున్నారు. బీజేపీ అనుసరిస్తున్న విధానాలు జాతివ్యతిరేకమైనవని మమతాబెనర్జీ విమర్శిస్తున్నారు. మరోవైపు శర్మ ఆమె ప్రసంగాలు తన పలుకుబడిని పెంచుకునేందుకు బెంగాల్‌లో ఎన్నికలను గెలిచి అధికారం చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. అయితే మమత బెనర్జీపట్ల ముస్లింలు అనుకూలంగా ఉండటం చాలాకాలంగాఉంది. ముస్లిం మహిళలకు నెలసరి రూ.1200 లు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారు.

అదేసమయంలో హిందుత్వపంథాను బెనర్జీ లౌక్యంగా సమర్థిస్తూ తమ హిందుత్వ నేపథ్యాన్ని ప్రస్తావిస్తూ బెంగాల్‌లో అన్ని హిందు పండుగలను ప్రోత్సహిస్తున్నారు.

గాజాలో మరింత పెరిగిన దాడులు

అక్టోబరు 2023 నుంచి ఇజ్రాయిల్ చేపట్టిన మారణహోమంలో గాజాస్ట్రిప్‌లో ప్రతిరోజూ ముప్పై మంది పలస్తీనియన్లు శాశ్వతంగా లేదా తాత్కాలిక వైకల్యానికి గురువుతున్నారు. 11 సంవత్సరాల పాలస్తీనా బాలుడు ముస్తఫా నస్ర్, ఫిబ్రవరి 13, 2025 న గాజా నగరంలోని జబాలియాలోని అల్-నజ్లా ప్రాంతంలో అతని కుటుంబం నివాసముంటున్నారు. అతని ఇంటిని లక్ష్యంగా చేసుకున్న ఇజ్రాయిల్ జరిపిన వైమానిక దాడిలో అతని కాళ్లు తెగిపోయాయి. పౌరులను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయిల్ చేపట్టిన దాడుల ఫలితంగా గాజా స్ట్రిప్‌లో అంగవైకల్యంతో ఉన్నవారి సంఖ్య దాదాపు 35 శాతం పెరిగింది. ఇజ్రాయిల్ సైన్యం మరణాలను మరింత పెంచేందుకు క్రమపద్ధతిలో అత్యంత విధ్వంసక ఆయుధాలను ఉపయోగిస్తోంది. దీనివల్ల వేలాది మంది పాలస్తీనియన్లు శాశ్వత వైకల్యాలు, తీవ్రమైన శారీరక, మానసిక బాధలకు గురవుతున్నారు. 681 రోజుల మారణహోమంలో గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయిల్ చేపట్టిన దాడుల్లో గాయపడిన దాదాపు 156,000 మంది పలస్తీనియన్లలో, యూరో-మెడ్ మానిటర్ ఫీల్డ్ బృందం 21,000 కంటే ఎక్కువ శాశ్వత లేదా తాత్కాలిక వైకల్య కేసులను నమోదు చేసింది. ఇది ఇజ్రాయిల్ అత్యంత విధ్వంసక ఆయుధాలను ఉపయోగించడాన్ని ప్రతిబింబిస్తుంది, వీటిలో క్లస్టర్ మందుగుండు సామగ్రి, భారీ పేలుడు పదార్థాలను జనాభా ఉన్న ప్రాంతాలపై ప్రయోగిస్తున్నారు. 2023 అక్టోబర్‌లో గాజాలో ఇజ్రాయిల్ చేపట్టిన మారణహోమానికి ముందు, స్ట్రిప్‌లో వైకల్యానికి గురైన పౌరుల సంఖ్య సుమారు 58,000 కాగా, 23 నెలల్లోపు, 21,000 కేసులు నమోదయ్యాయి. ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న క్షిపణి దాడుల్లో వైకల్యానికి గురైన వ్యక్తుల నిష్పత్తి మొత్తం జనాభాలో దాదాపు 3.4 శాతానికి పెరిగింది.

పలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ, యూరో-మెడ్ మానిటర్ 8,700 శాశ్వత వైకల్య కేసులను నమోదు చేసింది, వీటిలో 4,800 అంగచ్ఛేదాలు, 1,200 పక్షవాతం కేసులు, 1,200 అంధత్వం కేసులు, 1,500 మాట, వినికిడి లోపం, తీవ్రమైన కాలిన గాయాల వల్ల కలిగే వైకల్యాలు ఉన్నాయి. అత్యంత విధ్వంసకర ఆయుధాలతో ప్రజలపై హింసాత్మక దాడులతో పాటు, ఆరోగ్య వ్యవస్థను లక్ష్యంగా చేసుకుని ఉద్దేశపూర్వకంగా గాయపడినవారికి వైద్య

సంరక్షణ నిరాకరించడం, మందులు, శస్త్రచికిత్స సామగ్రి ప్రవేశంపై ఆంక్షలు విధించడం, అలాగే సహాయక చర్యలకు ఆటంకం కలిగించడం లక్ష్యంగా ఇజ్రాయిల్ దాడులు కొనసాగిస్తోంది. సరైన శస్త్రచికిత్స పరికరాల లేకపోవడం వల్ల గాయపడిన వారిని గంటలు లేదా రోజుల పాటు శిథిలాల కింద వదిలివేయడం, ఇవన్నీ ప్రమాదాన్ని తీవ్రతరం చేశాయి. రోగుల కదలికను పరిమితం చేయడంతోపాటు విదేశాలలో చికిత్సను నిరోధించడం, పేలుడు బుల్లెట్ల ద్వారా గాయాలు, షెల్లింగ్‌ల ద్వారా వెలువడే వైట్ ఫాస్పరస్ వంటి రసాయన ఆయుధాల వల్ల కలిగే పర్యావరణ కాలుష్యం ఇవన్నీ ప్రజల వైకల్యానికి కారణమవుతున్నాయి. ఇజ్రాయెల్ క్రమపద్ధతిలో లక్ష్యంగా చేసుకున్న ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ పతనావస్థలో ఉంది. గాజా కిక్కిరిసిన ఆసుపత్రులతో నిండిపోయింది. చాలా మందికి సకాలంలో చికిత్స లేకుండా పోతుంది.

ఆరోగ్య సేవల పతనంతో పాటు, ప్రజలను బలవంతంగా వేరే ప్రాంతాలకు తరలించడం, వారి ఇళ్లను నాశనం చేవడం, ప్రాథమిక అవసరాలు లేకుండా లక్షలాది మందిని గుడారాలకు పరిమితం చేయడం, మురుగునీటి వ్యవస్థ, పరిశుభ్రమైన నీరు లేకపోవడం, విస్తృతమైన కాలుష్యం, ఆహారం, అవసరమైన మందులు లేకపోవడం, ముఖ్యంగా యాంటీబయాటిక్స్ కొరత, చికిత్స చేయగల గాయాలను తీవ్రమైన ఇన్ఫెక్షన్లుగా మారుస్తున్నాయి. గాజా స్ట్రిప్‌లోకి కొనసాగుతున్న భూ చొరబాట్లతో, ఇజ్రాయెల్ సైన్యం అనేక మంది వైకల్యాలున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుంది. ఇజ్రాయెల్ అధికారులు గాజా నుంచి నిర్బంధించిన వారిపై స్పష్టమైన సమాచారాన్ని దాచినప్పటికీ, యూరో-మెడ్ మానిటర్ నిర్ధారించింది.

గాజాలో దాడులను మరింత విస్తరించడానికి ఇజ్రాయిల్ సంకల్పించింది. గాజా నగరాన్ని స్వాధీనం చేసుకోవడానికి ఇజ్రాయిల్ 60,000 మంది సైన్యాన్ని సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. అదనంగా మరో 20,000 మంది రిజర్వులో ఉంచింది. బుధవారం గాజాలోని అత్యంత జనసాంద్రత కలిగిన ప్రాంతాలలో యుద్ధ కార్యకలాపాలను ప్రారంభించే ప్రణాళికలను ఇజ్రాయిల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ ఆమోదించారని, మానవ హక్కుల సంఘాలు గాజాలో మానవతా సంక్షోభం మరింత తీవ్రమవుతుందని హెచ్చరించిన తరుణంలో ఈ ప్రకటన వెలువడింది. ఇక్కడ చాలా మంది నివాసితులు ఇప్పటికే స్థానభ్రంశం చెందారు, పొరుగు ప్రాంతాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కరువు ముప్పుల మధ్య ఆకలి మరణాలు కొనసాగుతున్నాయి.

ప్రారంభ దశల్లో భాగంగా జైటౌన్, జబాలియా పొరుగు ప్రాంతాలలో సైన్యం ఇప్పటికే ఆపరేషన్ ప్రారంభించింది. సెంట్రల్ గాజా నుంచి నివేదిస్తున్న అల్ జజీరాకు చెందిన తారెక్ అబు అజ్జూమ్, ఇజ్రాయిల్ గాజాలోని అతిపెద్ద నగరాన్ని స్వాధీనం చేసుకునే ఆపరేషన్ ద్వారా దక్షిణ ప్రాంతంలోని లక్షలాది మందిని కాన్సంట్రేషన్ జోన్లకు తరలించే అవకాశం ఉంది. జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో దాడులు తీవ్రతరం కావడంతో ఇజ్రాయిల్ సైన్యం తూర్పు గాజా నగరంలోని ఇళ్ల వరుసలను నేలమట్టం చేసిందని అబు అజ్జూమ్ అన్నారు. "ఇజ్రాయెల్ డ్రోన్లు, యుద్ధ విమానాలు ఆకాశంలోకి చొచ్చుకుపోయి, ఇళ్లను, తాత్కాలిక శిబిరాలపై దాడి చేసి నాశనం చేయడంతో గత రాత్రి పూర్తిగా నిద్రలేనిది" అని అబు



అన్నారు. దక్షిణ గాజాలోని ఇజ్రాయిల్ నియమించిన సేఫ్ జోన్ అని పిలువబడే అల్-మవాసిలో ఒక తండ్రి రాత్రిపూట జరిగిన దాడిలో తన పిల్లలను ఎలా కోల్పోయాడో కూడా ఆయన వివరించాడు. "ఇజ్రాయిల్ క్షిపణి డేరాను చీల్చి వారి శరీరాలను ముక్కలు చేసినప్పుడు తన పిల్లలు ప్రశాంతంగా నిద్రపోతున్నారని ఆయన చెప్పారు." వైద్య వర్గాల సమాచారం ప్రకారం, బుధవారం ఇజ్రాయిల్ దాడుల్లో 10 మంది సహాయం కోరుతూ వచ్చిన వారు సహా కనీసం 35 మంది పాలస్తీనియన్లు మరణించారు. ఇజ్రాయెల్ తన దాడిని తీవ్రతరం చేయాలనే ప్రణాళిక ఖతార్, ఈజిప్ట్ నేతృత్వంలోని మధ్యవర్తిత్వ ప్రయత్నాలతో సమానంగా ఉంది, దీనికి అమెరికా మద్దతు ఉంది. ఇజ్రాయిల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు ఈ ప్రతిపాదనపై బహిరంగంగా వ్యాఖ్యానించలేదు. గత వారం, "బందీలందరినీ ఒకేసారి విడుదల చేయాలని, యుద్ధాన్ని ముగించడానికి మా షరతుల ప్రకారం" నిర్ధారించాలని ఆయన పట్టుబట్టారు.

(యూరోమెడ్ హ్యూమన్ రైట్స్ మానిటర్ నుంచి)

ప్రజాస్వామ్యంపై హిట్లర్ తరహా దాడి

రాజ్యాంగ సవరణ క్రూర బిల్లుపై విపక్ష ఎంపీల ధ్వజం

న్యూఢిల్లీ: మోదీ సర్కారు ప్రవేశపెట్టిన 2025 రాజ్యాంగ (130వ సవరణ) బిల్లు రాజ్యాంగ విరుద్ధమని, భారత ప్రజాస్వామ్యంపై హిట్లర్ దాటి వంటిదని విపక్ష ఎంపీలు ధ్వజమెత్తారు. 30 రోజుల నిర్బంధం తర్వాత ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులకు ఉద్వాసన తప్పదన్న బిల్లును కేంద్ర మంత్రి అమిత్ షా బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టగా ప్రతిపక్ష నాయకులు తీవ్రస్థాయిలో వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. ప్రధానమంత్రి, కేంద్ర మంత్రి, ముఖ్యమంత్రి లేదా రాష్ట్ర మంత్రిని తీవ్రమైన నేరారోపణలపై వరుసగా 30 రోజులు అరెస్టు చేసినా లేదా నిర్బంధించినా వారిని తొలగించాలని ఈ బిల్లులు కోరుతున్నాయి. కాంగ్రెస్ నాయకుడు కేసీ వేణుగోపాల్, సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ధర్మేంద్ర యాదవ్ మూడు బిల్లుల ప్రతులను చించివేయడంతో లోక్‌సభ గందరగోళం చోటుచేసుకుంది. ప్రభుత్వం ఈ చర్యలను త్వరితగతిన అమలు చేయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపిస్తూ ప్రతిపక్ష ఎంపీలు సభలోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ, టీఎంసీ ఎంపీలు ఘర్షణకు దిగారు. ఈ బిల్లు న్యాయ వ్యవస్థ స్వతంత్రను అంతం చేస్తుందని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ అన్నారు. 'ఈ క్రూరమైన చర్య భారతదేశంలో ప్రజాస్వామ్యం, సమాఖ్యవాదానికి చరమగీతం లాంటిది. ఈ బిల్లు ఇప్పుడు మన న్యాయ వ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తిని అంతం చేయాలనుకుంటోంది. ఈ బిల్లు భారత ప్రజాస్వామ్య ఆత్మపై హిట్లర్ దాడి కంటే తక్కువ కాదు' అని బెంగాల్ ముఖ్యమంత్రి అన్నారు. 'ఇది తిరోగమనం. చట్టం ఇకపై స్వతంత్ర కోర్టులపై ఆధారపడి ఉండదు. కానీ స్వార్థ ప్రయోజనాల చేతుల్లో ఉంచబడిన వ్యవస్థ వైపు న్యాయ పరిశీలన నిశ్శబ్దం చేయబడిన, రాజ్యాంగ రక్షణలను విచ్ఛిన్నం చేయబడిన, ప్రజల హక్కులను తుంగలో తొక్కబడిన పాలనను స్థాపించడానికి ఇది ఒక భయంకరమైన ప్రయత్నం. చరిత్రలో ఫాసిస్ట్ ప్రభుత్వాలు కూడా నిరంకుశ పాలనను ఏకీకృతం చేసిన విధానం ఇది' అని ఆమె అన్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా ఈ బిల్లులను 'క్రూరమైనవి', 'ప్రజాస్వామ్య విరుద్ధమైనవి'గా అభివర్ణించారు. 'ఇది పూర్తిగా క్రూరమైన విషయం. ఇది అన్నింటికీ విరుద్ధం. దీనిని అవినీతి వ్యతిరేక చర్యగా తీసుకోవడం ప్రజల కళ్లను కప్పిపుచ్చడానికి మాత్రమే. ఎందుకంటే, ఇది ప్రాథమికంగా ఒక ప్రభుత్వానికి అనుమతి ఇచ్చేది ఏమిటంటే... మీరు దోషిగా నిర్ధారించాల్సిన అవసరం లేదు. మీరు ఒక ముఖ్యమంత్రిపై ఏదైనా కేసు పెట్టవచ్చు. అతను దోషిగా నిర్ధారించబడకుండా 30 రోజులు అరెస్టు చేయవచ్చు. ఆపై అతను ముఖ్యమంత్రి పదవిని పూర్తిగా కోల్పోతాడు. ఇది పూర్తిగా తప్పు అని నేను భావిస్తున్నాను. ఇది ప్రజాస్వామ్య వ్యతిరేకం, రాజ్యాంగ విరుద్ధం. అత్యంత దురదృష్టకరం' అని తెలిపారు. కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ మాట్లాడుతూ ఈ బిల్లు చట్ట పాలనను నాశనం చేస్తుందని విమర్శించారు. 'ఈ బిల్లు చట్ట పాలన ఉండాలని చెప్పే రాజ్యాంగం ప్రాథమిక నిర్మాణాన్ని నాశనం చేస్తుంది. చట్ట పాలనకు చెందిన ఆధారం దోషిగా నిరూపించబడే వరకు నిర్దోషి. ఈ బిల్లు దర్యాప్తు కార్యాలయాన్ని ప్రధాన మంత్రిని అధిపతిగా చేస్తుంది. ఇది తగిన ప్రక్రియ నిబంధనను ఉల్లంఘిస్తుంది. ఈ బిల్లు ఆర్టికల్ 21కు చెందిన ప్రాథమికాలను వారి పైకి తిప్పుతుంది' అని అన్నారు. ఏఐఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సభలో బిల్లులను వ్యతిరేకించారు. 'ఇది అనుమానం ఆధారంగా కార్యనిర్వాహక సంస్థలకు స్వేచ్ఛగా పనిచేయడానికి వీలు కల్పిస్తుంది. కేవలం అనుమానం ఆధారంగా పదవులను కోల్పోవడం జరుగుతుంది.

ఇది పార్లమెంటు ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తుంది. మంత్రి/ముఖ్యమంత్రి కార్యనిర్వాహక సంస్థల స్వేచ్ఛను కలిగి ఉంటారు. హోం మంత్రి ఆర్టికల్ 74(1)ని చదివారా? ఈ ప్రభుత్వం పోలీసు రాజ్యాన్ని సృష్టించడానికి తీవ్రంగా కృషి చేస్తోంది' అని తెలిపారు. టీఎంసీ నాయకుడు అభిషేక్ బెనర్జీ మాట్లాడుతూ ఎస్ఐఆర్ అమలు చేయడానికి ఈసీని దుర్వినియోగం చేసే ప్రయత్నంలో విఫలమైన ప్రభుత్వం... ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకుని, ప్రజాస్వామ్యాన్ని అణిచివేసి రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చివేసి ప్రజల ఆదేశాన్ని తారుమారు చేసే చట్టాలను తీసుకురావడానికి మరొక 'ఈ... ఈడీ' ని సక్రియం చేసింది. ఈ ప్రభుత్వం తనను తాను ప్రజావ్యతిరేకి, రైతు వ్యతిరేకి, పేదల వ్యతిరేకి, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల వ్యతిరేకి. సమాఖ్య వ్యతిరేకి. అన్నింటికంటే ముఖ్యంగా భారతదేశ వ్యతిరేకి అని నిరూపించుకుంది. బీజేపీ మన దేశ రాజ్యాంగాన్ని అమ్మేస్తోంది. భారతదేశాన్ని అసమర్థ, అప్రతిష్ట పాలకుల చేతుల్లో ప్రైవేట్ ఆస్తిగా నడపడానికి అనుమతిస్తోంది!' అని తెలిపారు. సీపీఎం రాజ్యసభ ఎంపీ జాన్ బ్రిట్టాస్ ఈ ప్రతిపాదనను 'క్రూరమైనది' గా అభివర్ణించారు.

ప్రతిపక్ష సీఎంలే బీజేపీ లక్ష్యం: కాంగ్రెస్

న్యూఢిల్లీ: తీవ్ర నేరారోపణలపై అరెస్టు లేదా నిర్బంధంలో ఉన్న ప్రధానమంత్రి, కేంద్రమంత్రి, ముఖ్యమంత్రి లేదా రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాల మంత్రులను పదవి నుంచి తొలగించే బిల్లులను కేంద్రం పార్లమెంటులో ప్రవేశపెట్టనుండడంపై కాంగ్రెస్ తీవ్రంగా మండిపడింది. ప్రతిపక్ష సీఎంలను కేంద్రం చెప్పినట్లు వినే కేంద్రసంస్థలతో అరెస్టు చేయించడమే లక్ష్యంగా బిల్లులు ఉన్నాయని ఆరోపించింది. ప్రతిపక్షాలకు చెందిన ముఖ్యమంత్రులను తొలగించి ప్రతిపక్షాలను అస్థిరపరచగల చట్టాలను తీసుకురావాలని బీజేపీ యోచిస్తోందని కాంగ్రెస్ విమర్శించింది. ఎన్నికల్లో ప్రతిపక్ష ముఖ్యమంత్రులను ఓడించడంలో విఫలమైన తర్వాత వారిని తొలగించడానికి అధికార పార్టీ అటువంటి చట్టాన్ని తీసుకురావాలని కోరుకుంటోందని కాంగ్రెస్ సీనియర్ ప్రతినిధి అభిషేక్ సింఘ్వీ ఆరోపించారు. ఇది దుర్మార్గపు ప్రయత్నమని విమర్శించారు. "ఎంతటి దుర్మార్గపు వలయం! అరెస్టుకు మార్గదర్శకాలు పాటించలేదు! ప్రతిపక్ష నాయకుల అరెస్టులు విపరీతంగా, అసమానంగా ఉన్నాయి. ప్రతిపాదిత చట్టం అరెస్టు అయిన వెంటనే అధికారంలో ఉన్న ముఖ్యమంత్రిని తొలగిస్తుంది. ప్రతిపక్షాన్ని అస్థిరపరచడానికి ఉత్తమ మార్గంగా ఎంచుకుంటున్నారు. అధికార పార్టీ ముఖ్యమంత్రులను ఎవరూ ఎప్పుడూ తాకలేదు!!" అని అభిషేక్ సింఘ్వీ విమర్శలు గుప్పించారు.

రాహుల్ యాత్ర నుంచి దృష్టి మరల్చడానికే!

బీహార్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిర్వహిస్తున్న 'ఓటు అధికార్ యాత్ర' నుంచి ప్రజల దృష్టిని మళ్లించడమే ఈ బిల్లుల లక్ష్యమని ఆ పార్టీ నేత గౌరవ్ గొగోయ్ పేర్కొన్నారు. అందుకే కొత్త నాటకానికి తెరతీశారని విమర్శించారు. "హోంమంత్రి అమిత్ షా ప్రవేశపెట్టిన బిల్లులు రాహుల్ గాంధీ నిర్వహిస్తున్న ఓటు అధికార్ యాత్ర నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి చేస్తున్న తీవ్ర ప్రయత్నం తప్ప మరొకటి కాదు. మొదట సీఎస్‌డీఎస్-బీజేపీ ఐటీ సెల్ డ్రామా, ఇప్పుడు బిల్లులు. స్పష్టంగా బిహార్‌లో మార్పు గాలులు వీస్తున్నాయి" అని గొగోయ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

అయితే తీవ్రమైన నేరారోపణలతో అరెస్టై వరుసగా 30 రోజులపాటు నిర్బంధంలో ఉంటే ప్రధానమంత్రినైనా, కేంద్ర మంత్రినైనా పదవి నుంచి తొలగించేందుకు వీలు కల్పించే బిల్లును బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చే కుట్ర: తృణమూల్

న్యూఢిల్లీ: ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలను వాడి రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం సరికొత్త బిల్లు తీసుకొస్తోందని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు ఆరోపించారు. ఆ పార్టీ రాజ్యసభ ఎంపీ సాకేత్ గోఖలే మాట్లాడుతూ ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా రాష్ట్రాలను అస్థిర పర్చేందుకు సరికొత్త కుట్ర పన్నుతున్నారన్నారు. ఈమేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు పెట్టారు. 'ఓట్ల దొంగతనం బయటపడిన నాటినుంచి మోదీ-షా సరికొత్త ట్రిక్కుల కోసం చూస్తున్నారు. నేడు తీసుకొస్తున్న తాజా బిల్లు రాష్ట్ర ప్రభుత్వాలను నేరుగా కూల్చే అవకాశం సీబీఐ, ఈడీకి అప్పజెబుతుంది. కోర్టు తీర్పు వచ్చాకే ఓ వ్యక్తి నేరగాడిగా నిర్ధారణ అవుతుంది. అప్పటివరకు వారు నిందితులు మాత్రమే. కేవలం ఆరోపణల ఆధారంగానే మీరు ముఖ్యమంత్రులు, మంత్రులను తొలగించలేరు. కేంద్ర ఏజెన్సీలతో మోదీ-షా అరెస్టు చేయించినా వారు నేరస్థులు కాబోరు' అని పేర్కొన్నారు. అదే పార్టీకి చెందిన లోక్‌సభ ఎంపీ మహువా మొయిత్రా ఎక్స్‌లో స్పందిస్తూ ఈ బిల్లు సమాఖ్య, న్యాయవ్యవస్థలను బైపాస్ చేసుకొని వెళుతోందన్నారు. 'ప్రతిపక్షాల అనుమానాలు వాస్తవం అవుతున్నాయి. కేవలం 240 మంది ఎంపీలతోనే బీజేపీ రాజ్యాంగాన్ని మార్చేస్తోంది. కొత్త బిల్లు సమాఖ్య, న్యాయవ్యవస్థలను తప్పించుకొని వెళుతోంది. ఎన్నికైన ప్రతిపక్ష పార్టీల ముఖ్యమంత్రులను ఈడీ, సీబీఐతో కేంద్ర ప్రభుత్వం టార్గెట్ చేసుకోవచ్చు. వారిపై నేరం రుజువు కాకపోయినా... పదవుల నుంచి తప్పించవచ్చు' అని మంగళవారం అర్ధరాత్రి చేసిన పోస్టులో పేర్కొన్నారు. పార్టీ రాజ్యసభ నేత డెరెక్ ఒబ్రియాన్ కూడా ఈ బిల్లును వ్యతిరేకిస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు. పార్లమెంట్ వ్యవస్థను అపహాస్యం చేసేలా మోదీ సర్కారు ప్రయత్నాలు చేస్తోందన్నారు

సభకు బ్యానర్లు, ప్లకార్డులు తీసుకురావద్దు: స్పీకర్

న్యూఢిల్లీ: జులై 21న ప్రారంభమైనప్పటి నుంచి ఉభయసభల్లో బీహార్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై చర్చ జరపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. అయితే ప్రభుత్వం మాత్రం చర్చకు అంగీకరించడం లేదు. దీంతో ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంట్ హౌస్‌లో, వెలుపల ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకుని నిరసనలు కొనసాగిస్తున్నారు. వారి నిరసనలతో పార్లమెంటు దద్దరిల్లుతోంది. దీంతో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సభను వాయిదాల పర్వం కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సభలోకి బ్యానర్లు, ప్లకార్డులు తీసుకురావద్దని ప్రతిపక్ష ఎంపీలను కోరారు. చర్చలు సజావుగా సాగేందుకు ప్రతిపక్ష సభ్యులు సహకరించాలన్నారు. ఎస్ఐఆర్‌పై చర్చకు డిమాండ్ చేస్తూ... ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేయడంతో సభకు అంతరాయం కలిగిందని స్పీకర్ తెలిపారు. చెక్క కర్రలతో కట్టిన బ్యానర్లు సభలో సముచితం కాదు. మీలో చాలామంది నినాదాలు చేస్తారు. కర్రలు, ప్లకార్డులు, బ్యానర్లు తీసుకువస్తారు. కానీ వీటిని ఇలా సభకు తీసుకురావడం తగిన చర్య కాదు. మీరందరూ రాజకీయ పార్టీలకు చెందినవారు కాబట్టి... మీరు సభకు సహకరించాలని స్పీకర్ ప్రతిపక్ష సభ్యులనుద్దేశించి వ్యాఖ్యానించారు.

ప్రశ్నిస్తే దేశద్రోహమా?

సీనియర్ జర్నలిస్టులపై కేసులకు స్టాలిన్, గొగోయ్ నిరసన

న్యూఢిల్లీ : సీనియర్ జర్నలిస్టులు సిద్ధార్థ్ వరదరాజన్, కరణ్ థాపర్‌కు అసోం పోలీసులు సమన్లు జారీ చేయడంపై స్టాలిన్, గౌరవ్ గొగోయ్ బుధవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్నలు అడగటాన్ని రాజద్రోహంగా పరిగణిస్తారా అని నిలదీశారు. రాజద్రోహం ఆరోపణలపై నమోదయిన కేసులో ఇద్దరు సీనియర్ జర్నలిస్టులు సిద్ధార్థ్ వరదరాజన్, కరణ్ థాపర్‌ను అసోంను పోలీసులు సమన్లు జారీ చేయడంపై పెరుగుతున్న నిరసనలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్, అసోం కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ బుధవారం కూడా పాల్గొన్నారు. పోలీసుల చర్యను తీవ్రంగా ఖండిస్తున్నా అని స్టాలిన్ తన 'ఎక్స్' ఖాతాలో పేర్కొన్నారు. 'కేవలం రోజుల క్రితం సంబంధిత కేసులో సుప్రీం కోర్టు రక్షణ కల్పించినప్పటికీ సమన్లు జారీ అయ్యాయి. ఎఫ్ఐఆర్ కాపీ, కేసు వివరాలు ఏవీ అందించలేదు. అరెస్టు బెదిరింపు మాత్రమే మిగిలి ఉంది. స్వతంత్ర జర్నలిజాన్ని అణచివేయడానికి రద్దు చేయబడిన దేశద్రోహ చట్టానికి ప్రత్యామ్నాయంగా బీఎన్ఎస్‌లోని సెక్షన్ 152ను దుర్వినియోగం చేస్తున్నారు. ప్రశ్నలు అడగడాన్ని దేశద్రోహంగా భావిస్తే ప్రజాస్వామ్యం మనుగడ సాగించదు' అని స్టాలిన్ పేర్కొన్నారు. ఆగస్టు 22న గువహటి నగర పోలీసుల క్రైమ్ బ్రాంచ్ ముందు హాజరు కావాలని ఇద్దరు జర్నలిస్టులకు సమన్లు జారీ చేశారు. దానిని వారు పాటించకపోతే అరెస్టు చేస్తామని హెచ్చరించారు. 'జూన్ 28న ది వైర్‌లో ప్రచురితమైన ఒక కథనంపై బీజేపీ కార్యాలయ యజమాని దాఖలు చేసిన ఫిర్యాదుకు సంబంధించి జులై 11, 2025న మోరిగావ్‌లో వరదరాజన్‌పై ఎఫ్ఐఆర్ నమోదయింది. (రాజకీయ నాయకత్వం పరిమితుల కారణంగా పాకిస్తాన్‌కు ఐఏఎఫ్ ఫైటర్ జెట్‌లను కోల్పోయింది: ఇండియన్ డిఫెన్స్ అటాచ్)... అయితే క్రైమ్ బ్రాంచ్ ఎఫ్ఐఆర్ ఏ కథనం లేదా వీడియోకు సంబంధించినదో స్పష్టంగా లేదు' అని ది వైర్ నివేదించింది.. లోక్‌సభలో కాంగ్రెస్ ఉప నాయకుడు గౌరవ్ అసోం పోలీసుల చర్యను ఖండించారు. 'మరో రోజు, అసోం అన్ని తప్పుడు కారణాల వల్ల వార్తల్లోకి రావడానికి ఇది మరొక కారణం' అని గొగోయ్ 'ఎక్స్' లో పేర్కొన్నారు. దురాశ, అవినీతి, అసమర్థత, చట్టవిరుద్ధం. ఇది అసోం మార్గం కాదు. అసోం ప్రజలు తమ కలల అసోంను నిర్మించే నాయకత్వాన్ని కోరుకుంటున్నారు' అని తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కొత్త నేర చట్టాలలో దీనిని తొలగించారని పేర్కొన్న దేశద్రోహం కోసం అసోం పోలీసులు జర్నలిస్టులను పిలిపించడం దేశ వ్యాప్తంగా ఆగ్రహానికి దారితీసింది. జర్నలిస్టులపై పోలీసు చర్యను అనేక జర్నలిస్టుల సంస్థలు కూడా ఖండించాయి. ఇదిలాఉండగా, ఈ సంవత్సరం, ప్రపంచ పత్రికా స్వేచ్ఛా సూచికలో భారతదేశం 180 దేశాలలో 151వ స్థానంలో ఉంది.

రాజీవ్‌గాంధీకి మోదీ, ఖర్గే నివాళి

న్యూఢిల్లీ: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఆయనకు నివాళులర్పించారు. ఈ మేరకు మోదీ ఎక్స్‌లో పోస్టు చేశారు. కాంగ్రెస్ ఎంపీ, రాజీవ్‌గాంధీ కుమార్తె ప్రియాంక గాంధీ తన తండ్రికి నివాళులర్పించారు. 'మీ నుండి కరుణ, ప్రేమ, దేశభక్తి వంటి విలువలను వారసత్వంగా పొందాము. మేమందరం ఈ విలువలను ఎప్పటికీ కాపాడుకుంటాము. వాటిని ఎవరూ విచ్ఛిన్నం చేయలేరు. వాటిని ఎవరూ ఆపలేరు. వీటి కోసం వేసే మా అడుగులను ఆపలేరు' అని ఆమె ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ప్రియాంకగాంధీ దిల్లీలోని రాజీవ్‌గాంధీ స్మారక చిహ్నం వీర్ భూమి వద్దకు వెళ్లి నివాళులర్పించారు. ఆమె వెంట తన భర్త రాబర్ట్ వాద్రా, కుమారుడు రైహాన్ వాద్రా ఉన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ కేంద్రమంత్రి పి.చిదంబరం రాజీవ్‌గాంధీకి నివాళులర్పించారు. 'రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ 'సద్భావన దివాస్'గా జరుపుకుంటుంది. ఈరోజు మనం సద్భావన దివాస్ జరుపుకుంటున్న లక్షలాది మందిలో ఆశను ప్రేరేపించి భారతదేశాన్ని 21వ శతాబ్దంలోకి నడిపించిన గొప్ప నాయకుడు రాజీవ్ గాంధీని మనం గుర్తు చేసుకుంటాము. భారతదేశానికి సాధించిన అసంఖ్యాక విజయాలు రాజీవ్ గాంధీ వారసత్వాన్ని ప్రతిబింబించాయి. దేశంలో పరివర్తనాత్మక మార్పులు తీసుకువచ్చాయి. జయంతి సందర్భంగా ఆయనకు మా ప్రగాఢ నివాళులు అర్పిస్తున్నాము' అని ఖర్గే ఎక్స్‌లో పోస్టు చేశారు.

రాధాకృష్ణన్ నామినేషన్

న్యూఢిల్లీ: ఎన్డీయే ఉప రాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సహా పలువురు కేంద్ర మంత్రుల సమక్షంలో నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. సెప్టెంబర్ 9న ఉప రాష్ట్రపతి ఎన్నిక జరగనుండగా... దీనిని ఏకగ్రీవం చేసుకోవడానికి అధికారపక్షం ప్రయత్నాలు చేస్తోంది. కానీ, విపక్ష పార్టీలు కూడా తమ అభ్యర్థిని ఇప్పటికే ప్రకటించాయి. దీంతో ఎన్నిక అనివార్యమైంది. ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఇప్పటికే ప్రకటించారు.

బీహార్‌లో ఎన్డీయే ఉమ్మడి సమావేశాలు

న్యూఢిల్లీ : కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ నేతృత్వంలోని బీహార్‌లో ప్రతిపక్షాల ప్రచారం నడుమ అధికార ఎన్డీఏ రాష్ట్రంలో అధికారాన్ని నిలబెట్టుకునేందుకు ఆపసోపాలు పడుతోంది. అక్టోబరు 23 నుంచి తన నియోజకవర్గాల మధ్య సమన్వయాన్ని పెంపొందించడానికి, రాష్ట్రంలో అధికారాన్ని నిలుపుకోవడానికి దాని ప్రయత్నాలను ఏకీకృతం చేయడానికి ఉమ్మడి సంస్థాగత కార్యక్రమాన్ని ప్రారంభించింది. బీహార్‌లో అక్టోబరు-నవంబరులో ఎన్నికలు జరగనున్నందున ఎన్డీఏ 14 కమిటీలను ఏర్పాటు చేసింది. దాని ప్రధాన సభ్యులు జేడీ(యూ), బీజేపీ ఒక్కొక్కరు వాటిలో ఏడు కమిటీలకు నాయకత్వం వహిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రదేశాలలో కార్యకర్తల సమావేశాలను నిర్వహించే పనిలో ఉన్న ఈ సమూహాల కూటమి నాయకులు రెండు దశల్లో కార్యక్రమాలను పర్యవేక్షిస్తారు. మొదట ఆగస్టు 23 నుంచి ఆగస్టు 25 వరకు... ఆపై ఆగస్టు 28 నుంచి ఆగస్టు 30 వరకు. కాగా ఈ కమిటీ సభ్యులలో లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్), హిందుస్తానీ అవామ్ మోర్చా (లౌకిక), రాష్ట్రీయ లోక్ మోర్చా అనే మూడు ఇతర ఎన్డీఏ పార్టీల పేర్లు కూడా ఉన్నాయని వర్గాలు తెలిపాయి. ఈ కమిటీలకు బీజేపీ నాయకులు, ఉప ముఖ్యమంత్రులు సామ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హా, ఆ రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్ కుమార్ జైస్వాల్, కేంద్ర మంత్రులు గిరిరాజ్ సింగ్, నిత్యానంద్ రాయ్, రాష్ట్ర మంత్రి మంగళ్ పాండే, లోక్‌సభ ఎంపీ సంజయ్ జైస్వాల్ నాయకత్వం వహిస్తున్నారు. రాష్ట్రంలో ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కు వ్యతిరేకంగా రాహుల్ గాంధీ చేస్తున్న బహిరంగ ప్రచారం నేపథ్యంలో ఈ కూటమి కార్యకర్తల ఉమ్మడి సమావేశాలు జరుగుతున్నాయి. కాంగ్రెస్ ఎంపీ, ఆయన బీహార్ మిత్రపక్షాలు... ఎన్నికల సంఘం బీజేపీతో కుమ్మక్కై 'ఓటు చోరీ' చేస్తున్నాయని ఆరోపించారు.

ఆన్‌లైన్ గేమింగ్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

న్యూఢిల్లీ: ఆన్‌లైన్ గేమింగ్ నిర్వహణను నేరంగా పరిగణించే బిల్లును లోక్‌సభ ఆమోదించింది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి అశ్వినీ వైష్ణవ్... ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు-2025ను లోక్‌సభలో బుధవారం విపక్షాల ఆందోళనల మధ్య ప్రవేశపెట్టారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ ఆగడాలు ఇటీవల కాలంలో పెరిగిపోయాయన్న పేరుతో కేంద్రం ఈ బిల్లు ప్రవేశపెట్టింది. ఆన్‌లైన్ గేమ్స్, ఈ-స్పోర్ట్స్ మధ్య విభజన చూపించేలా బిల్లు రూపొందించారు. నిబంధనల్ని ఉల్లంఘించి ఆన్‌లైన్ గేమ్స్ అందిస్తున్న వారికి మూడేళ్ల వరకు జైలుశిక్ష లేదా రూ.కోటి వరకు జరిమానా లేదా ఆ రెండూ విధించాలని ప్రతిపాదించారు. సంబంధిత అడ్వర్టయిజ్‌మెంట్లలో భాగం పంచుకున్నవారికి గరిష్ఠంగా రెండేళ్ల జైలుశిక్ష, రూ.50 లక్షల వరకు జరిమానా విధిస్తారు. వీటి ఆర్థిక లావాదేవీల్లో ప్రమేయం ఉన్నవారికీ గరిష్ఠంగా మూడేళ్ల శిక్ష, రూ.కోటి వరకు జరిమానా వేస్తారు. ఆన్‌లైన్ మనీ గేమ్స్ ఆడేవారిని నేరస్థులుగా కాకుండా... బాధితులుగా బిల్లులో పేర్కొన్నారు. కాగా, 'ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు'పై ఆల్ ఇండియా గేమింగ్ ఫెడరేషన్ ఆందోళన వ్యక్తంచేసింది. ఈ బిల్లుపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు నిన్ననే లేఖ రాసింది. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు అరికట్టేందుకు కేంద్రం తీసుకొచ్చే బిల్లు కారణంగా తమ రంగానికి తీవ్ర నష్టం కలుగుతుందని ఏఐజీఎఫ్ ఆందోళన వ్యక్తంచేసింది. ఇది అమల్లోకి వస్తే తమ పరిశ్రమకు భారీ నష్టం జరుగుతుందని, కోట్లమంది చట్టబద్ధమైన గేమర్‌లు అక్రమంగా నెట్‌వర్క్‌లు నడిపేవారి వైపు వెళ్లేలా చేస్తుందని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ రంగంలోని అనేకమంది ఉద్యోగులపైనా దీని ప్రభావం ఉంటుందని హెచ్చరించింది. దీనిపై పూర్తిగా నిషేధం విధించేకంటే... నియంత్రణ చర్యలు తీసుకోవాలని కేంద్రానికి సూచించింది. ఆటగాళ్లను రక్షించడంతో పాటు వారు బాధ్యతాయుతంగా ఆడేలా చర్యలు తీసుకోవాలని కోరింది. కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించాలని, పరిశ్రమను పూర్తిగా చీకట్లోకి నెట్టేయొద్దని అభ్యర్థించింది.

శశిథరూర్ భిన్నస్వరం

న్యూఢిల్లీ: తీవ్రమైన నేరారోపణలతో అరెస్టయి వరసగా 30 రోజులపాటు నిర్బంధంలో ఉంటే ప్రధానమంత్రినైనా, కేంద్ర మంత్రినైనా పదవి నుంచి తొలగించేందుకు వీలు కల్పించేలా కేంద్ర ప్రభుత్వం సరికొత్త బిల్లు తీసుకొచ్చింది. ఈ బిల్లును కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకించింది. అయితే, కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి భిన్నంగా ఆ పార్టీ ఎంపీ శశి థరూర్ వ్యాఖ్యలు చేశారు. ఈ బిల్లును ప్రతిపక్ష ఎంపీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీనిపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ మాట్లాడుతూ ఈ బిల్లు క్రూరమైనదన్నారు. అన్యాయంగా ముఖ్యమంత్రులను అరెస్టు చేస్తే పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమన్నారు. అయితే, విపక్షాలు ఈ బిల్లును వ్యతిరేకించడాన్ని శశిథరూర్ తప్పుబట్టారు. 'ఇది ఇంగిత జ్ఞానానికి సంబంధించిన విషయం. ఇందులో నాకు ఎలాంటి తప్పు కనిపించడం లేదు' అని ఓ వార్తా సంస్థతో పేర్కొన్నారు. తప్పు చేసిన నాయకులపై వేటు పడటం మంచిదేనని ఆయన అన్నారు. అది మన ప్రజాస్వామ్యానికి ఎంతో మేలు చేస్తుందని భావిస్తున్నట్లు తెలిపారు.

తేరుకోని ముంబై

- జలదిగ్బంధంలోనే మహానగరం
- నాలుగు రోజుల్లో 21 మంది మృతి
- సహాయక, పునరావాస చర్యలు ముమ్మరం
- 14 లక్షల ఎకరాల్లో పంట నష్టం
- విక్రోలీ, థానేలో అత్యధిక వర్షపాతం

ముంబై: మహారాష్ట్రను వర్షాలు వదలడం లేదు. నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలతో మెరుపు వరదలు సంభవించడంతో రాష్ట్రంలో జనజీవనం స్తంభించింది. ముంబై మహానగరం జలదిగ్బంధంలో ఉంది. రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ముంబై, థానే, పాల్ఘర్‌కు అధికారులు రెడ్ అలర్ట్ ప్రకటించారు. ముంబైలో అన్ని స్కూళ్లు, కాలేజీలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. అవసరమైతే తప్ప గడప దాటవద్దని అధికారులు సూచించారు. ముంపు ప్రాంతాల్లో సైన్యం రంగంలోకి దిగి సహాయక చర్యలను ముమ్మరం చేసింది. గత 24 గంటల్లో మహారాష్ట్రలోని వేర్వేరు జిల్లాల్లో ఆరుగురు చనిపోగా, నాందేడ్ జిల్లాలో ఐదుగురు గల్లంతయ్యారు. రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో 18 ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు, ఆరు ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలను మోహరించారు. అత్యధికంగా విక్రోలీలో 223.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా శాంతాక్రూజ్‌లో 206.6 మిల్లీమీటర్లు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. గత నాలుగు రోజులుగా సంభవించిన వేర్వేరు ఘటనల్లో చనిపోయిన వారి సంఖ్య 21కు చేరింది. మరో 10 మంది గాయపడ్డారు. 14 లక్షల ఎకరాల్లో పంట నష్టం సంభవించింది. అన్ని నదుల వద్ద ప్రమాద హెచ్చరికలు జారీ అయ్యాయి. రత్నగిరి జిల్లాలోని జగ్బుడి నది, రాయ్‌గఢ్ జిల్లాలోని అంబా నదితో పాటు వశిష్ఠి, శాస్త్రి, కజ్లి, కొడావలి, బవాంది, సావిత్రి, కుండాలికా నదులు పరవళ్లు తొక్కుతున్నాయి. ప్రమాద స్థాయిని దాటేస్తున్నాయి. థానే జిల్లాలోని ఉల్హాస్ నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. చాలా చోట్ల పట్టాలు మునిగిపోయి ఉండటంతో బుధవారం కూడా వెస్టరన్ రైల్వేస్ సేవలను పునరుద్ధరించలేదు. అయితే 15 గంటల విరామం తర్వాత లోకల్ రైళ్లు నడిచాయి. ఇండిగో, ఎయిరిండియా, అకాశా వంటి విమానయాన సంస్థలు సైతం తమ ప్రయాణికులకు కొన్ని హెచ్చరికలు చేశాయి.

చాలా వరకు విమానాలు రద్దు కాగా, కొన్ని ఆలస్యంగా నడిచాయి. ఈ వర్షా కాలం ముంబైలో మొత్తంగా 2,310.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అయితే మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి బుధవారం ఉదయం 10.30 గంటల వరకు థానే జిల్లాలోని ఉల్లాస్‌నగర్‌లో 222.3 మిల్లీమీటర్లు, కల్యాణ్‌లో 172.6 మిల్లీమీటర్లు, భివండిలో 179.6 మిల్లీమీటర్లు, అంబర్‌నాథ్‌లో 141.6 మిల్లీమీటర్లు, సహరన్‌పూర్‌లో 126.7 మిల్లీమీటర్లు, ముర్బాద్‌లో 122.8 మిల్లీమీటర్లు చొప్పున వర్షపాతం నమోదైంది. వరద ప్రవాహం పెరుగుతుండటంతో లోతట్టు ప్రాంతాల ప్రజలను సహాయక సిబ్బంది పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. ఇప్పటివరకు 1500 మందికిపైగా సురక్షిత ప్రాంతాలకు చేరినట్లు తెలిసింది. గురువారానికి వర్షం తగ్గుముఖం పట్టి మహానగరం తేరుకోగలదన్న సంకేతాలను వాతావరణ శాఖ ఇచ్చింది. భారీ వర్షాలతో బుధవారం జరగాల్సిన పరీక్షను ముంబై యూనివర్సిటీ రద్దు చేసింది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ పరీక్ష రద్దు చేశామని, త్వరలోనే కొత్త తేదీని ప్రకటిస్తామని వెల్లడించింది.

విశాలాంధ్ర హైదరాబాద్

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర,షాద్ నగర్, రూరల్ : ఉమ్మడి పాలమూరు జిల్లా లో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డిని పలువురు అత్యవసర వైద్యం కొరకు ఆర్థిక సాయం కోరగా వారి అభ్యర్థన మేరకు ముఖ్యమంత్రి సహాయనిధికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సిఫారసు చేయగా కరివేన గ్రామం భూత్పూర్ మండలానికి చెందిన ఎం.చంద్రశేఖర్ రెడ్డి రూ,2 లక్షలు, ఎక్కువైపల్లి విలేజ్ కద్తాల్ మండల్‌కు చెందిన జోగు శ్రావణ్ రూ,2 లక్షలు, దేవరగద్రకి చెందిన ఏ.పుష్పలతకు రూ.2 లక్షల 20 వేల ఎల్ ఓసిలు అందజేశారు. అదేవిధంగా రంగారెడ్డి జిల్లా షాద్ నగర్‌కి చెందిన జైనాబి, శ్రీనివాస కాలనీకి చెందిన కే.అశోక్,పద్మావతి కాలనీకి చెందిన వి.ధరణి దేవి బూరుగు గడ్డ తండాకు చెందిన మూడవత మంగమ్మ, దేవునిపల్లి గ్రామానికి చెందిన జి మంజుల, బూర్గుల గ్రామానికి చెందిన లింగారెడ్డిగూడ నరసింహులు, కిషన్ నగర్ గ్రామానికి చెందిన కావేటి మంగమ్మలకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను షాద్ నగర్ ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి కార్యాలయం లో లబ్ధిదారులకు అందచేశారు.ఈ కార్యక్రమంలో ఫరూక్ నగర్ వైస్ ఎంపీపీ మౌనిక హరికృష్ణ గౌడ్, కిషన్ నగర్ మాజీ సర్పంచ్ శ్రీశైలం యాదవ్,దేవుని పల్లి మాజీ సర్పంచ్ రవీందర్ గౌడ్, బురుగు గడ్డ విలేజ్ ప్రెసిడెంట్ రవీందర్ నాయక్,దేవునిపల్లి బిఆర్ఎస్ విలేజ్ ప్రెసిడెంట్ యాదయ్య,నగరం శ్రీనివాస్ గౌడ్,జయంత్ రెడ్డి, గోవిందు,మల్లయ్య,సురేష్, మహేష్ ,కుమ్మరి ప్రశాంత్,మంగలి శివ తదితరులు పాల్గొన్నారు..

రైతులకు రాయితీపై యంత్ర పరికరాలు

– మండల వ్యవసాయ అధికారిణి అనురాధ

విశాలాంధ్ర – మొయినాబాద్: రైతులకు రాయితీపై యంత్ర పరికరాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారిని అనురాధ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఫార్మ్ మెకానైజేషన్ కార్యక్రమంలో భాగంగా మొయినాబాద్ మండలానికి వ్యవసాయ యంత్ర సామాగ్రిని కేటాయించడం జరిగిందన్నారు. ఇందులో స్ప్రేయర్లు (160), పవర్ ఆపరేటర్స్ ప్రేయర్లు (24), రోటవేటర్లు (8), సీడ్ కం ఫర్టిలైజర్ డ్రిల్లులు(2) , కల్టివేటర్ అండ్ డిస్క్ హారో (12), బండ్ ఫార్మర్ (1), పవర్ విడర్ (1), బుష్ కట్టర్ (1), పవర్ టిల్లర్ (1), మొక్కజొన్న సెల్లార్ (1), స్ట్రా బేలర్ (1) అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, మహిళా రైతులకు 50శాతం సబ్సిడీ, జనరల్ రైతులకు 40శాతం సబ్సిడీ అందుబాటులో ఉంటుందని వివరించారు. ట్రాక్టర్ తో నడిచే యంత్ర సామాగ్రి పొందుటకు, ట్రాక్టర్ రైతు లేదా రైతు భార్య పేరు మీద తప్పనిసరిగా నమోదై ఉండాలన్నారు. ఆసక్తి గల రైతులు తమ వ్యవసాయ విస్తరణ అధికారులు, మండల వ్యవసాయ అధికారులను సంప్రదించాలన్నారు.

ఘనంగా ఈదమ్మ పోచమ్మ దేవాలయం పునర్ నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర – రాజేంద్రనగర్ : రాజేంద్రనగర్ సర్కిల్ పరిధి బుద్వేల్ గ్రామంలో కొలువై ఉన్న అతి పురాతనమైన శ్రీశ్రీశ్రీ ఈదమ్మ,పోచమ్మ దేవాలయం పునర్ నిర్మాణంలో భాగంగా బుధవారం శంకుస్థాపన భూమి పూజ హెూమము కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.అమ్మవార్ల దేవాలయ నిర్మాణానికి రతి శంఖం కు ప్రత్యేక పూజ కార్యక్రమాలు మహిళలు అభిషేకలు మంగళ హరతులు పట్టారు వేద పండితులు శ్రీశ్రీశ్రీ రేవల్ల రాజుశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ మహెూత్తర కార్యక్రమానికి మైలారదేవ్ పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి వెసేల్ల గ్రూప్ ఆఫ్ కంపెనీ అధినేత శివానంద్ రెడ్డి దయానంద్, జయప్రకాష్,మాజీ కౌన్సిలర్ డేవిడ్ దయానంద్ వై.శ్రీధర్, జీ.బాబురావు, బొక్క ప్రభాకర్ రెడ్డి, లలిత్ వర్రీ,రగడంపల్లి శ్రవణ్,పెండ్యాల శ్రీధర్,రజినీకాంత్ గౌడ్,గ్రామస్థులు కొరని సదానంద్,కొరని బాలరాజ్ కొరని అర్జున్, కొరని యాదయ్య,సత్యం,వెంకటేష్, కే దాస్,బెంజిమెన్ కే ఏల్ బాబు రావు ,శ్యామ్ నరేందర్,రవీందర్,జి శోభా చైతన్య, మహిపాల్, నరేంద్ర, హరి బాబు, మిలిటరీ బాబు ఆదిత్య చాణిక్య వర కుమార్ సందీప్ విద్య సాగర్ నరేష్ కన్నా దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు గ్రామస్థులు చుట్టుపక్కల కాలనీలు బస్తిల వాసులు,అనంతరం దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

జడ్పీ మాజీ చైర్మన్ జగదీష్ జయంతి

విశాలాంధ్ర–ములుగు జిల్లా బ్యూరో: దివంగత నేత ఏటూరునాగారం మాజీ జడ్పీటీసీ తొలి ములుగు జిల్లా జడ్పీచైర్ పర్సన్, ములుగు నియోజకవర్గ ఇన్చార్జి, బిఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు స్వర్గీయ కుసుమ జగదీశ్వర్ 49వ,జయంతి వేడుకను,బి ఆర్ ఎస్ ఏటూరునాగారం మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ ఆవరణలో తల్లి విగ్రహం వద్ద, ఆయన చిత్ర పటంకు బిఆర్ఎస్ ములుగు నియోజకవర్గం ఇంచార్జి బడే నాగ జ్యోతి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బడే నాగ జ్యోతి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జగదీశ్ ఆలు పెరగని పోరాటం చేశారని, అయన త్యాగం ఎవరు మర్చి పోలేరన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్షుడు గడదాసు సునీల్ కుమార్,పట్టణ కమిటీ అధ్యక్షుడు ఖాజాపాషా, కన్నాయిగూడెం మండల కమిటీ అధ్యక్షుడు సుబ్బుల సమ్మయ్య,పి.ఎ.సి.ఎస్ చైర్మన్ కూనూరు.అశోక్ గౌడ్,సీనియర్ నాయకులు తుమ్మ మల్లారెడ్డి, మూతి. కృష్ణమూర్తి, సప్పిడి రామ నరసయ్య, అంతటి.నాగరాజు, అల్లి శ్రీనివాస్,కుమ్మరి. చంద్రబాబు, కర్ర రవీందర్ కావిరి చిన్నికృష్ణ, ఈసం రామ్మూర్తి, మాదరి రామయ్య, పళ్ళ రఘు,తూరం పద్మ,బండి. లక్ష్మి,గోగు ముత్తమ్మ,వావిలాల.రాంబాబు, అజ్మత్ ఖాన్, జాడి.భోజరావు, ఎండి.ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ మహాసభలకు తరలిన నాయకులు

విశాలాంధ్ర – మేడ్చల్–మల్కాజిగిరి : జిల్లా కుత్బుల్లాపూర్ షాపూర్ నగర్ మహారాజా ఫంక్షన్‌లో జరుగుతున్న సిపిఐ తెలంగాణ రాష్ట్ర మహాసభల్లో భాగంగా' రెడ్ ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్న మల్కాజిగిరి మండల సిపిఐ నాయకులు జిల్లా కౌన్సిల్ సభ్యులు సిహెచ్ దశరథ్ మండల కార్యదర్శి టి యాదయ్య గౌడ్ సహాయ కార్యదర్శులు కాసర్ల నాగరాజు, కె.అశోక్, సీనియర్ నాయకులు పి.సత్యనారాయణ, ఏఐటీయూసీ మండల కార్యదర్శి బి.యాదగిరి, జే.రాములు, బి.లింగం, ఎస్/కే.అజీజ్, కే.ప్రభాకర్, ఎస్.యూసఫ్ లతోపాటు 25 మంది ఎర్రజెండాలు పట్టుకొని ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్నారు.

దేశ యువతకు రాజీవ్ గాంధీ స్ఫూర్తి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

విశాలాంధ్ర – హైదరాబాద్ : దేశ యువతకు స్ఫూర్తి రాజీవ్ గాంధీ అని, దేశ సమగ్రతను కాపాడేందుకు ఆయన ప్రాణాలర్పించారని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. పారదర్శక పరిపాలన అందించడానికి సాంకేతికతను జోడించాలని ఆనాడు రాజీవ్ గాంధీ ఆలోచన చేశారని పేర్కొన్నారు. 18 ఏండ్లు నిండిన వారికి ఓటు హక్కును కల్పించి దేశ భవిష్యత్‌ను నిర్ణయించే అవకాశం కల్పించారన్నారు. బుధవారం మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా సెక్రటేరియట్ వద్ద రాజీవ్ గాంధీ విగ్రహానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహచర మంత్రులతో కలిసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్లు కల్పించిన దార్శనికుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. కంప్యూటర్ ను దేశానికి పరిచయం చేసిన మహనీయుడని, టెలికాం రంగంతో దేశంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. రాజీవ్ స్ఫూర్తితో ఆనాడు హైదరాబాద్ లో హైటెక్ సిటీకి పునాది పడిందని, రాజీవ్ స్ఫూర్తితో తెలంగాణను ఆర్థికంగా, సామాజికంగా ముందుకు తీసుకెళతామని చెప్పుకొచ్చారు. సంక్షేమం, అభివృద్ధితో పాటు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ లాంటి సామాజిక సమస్యలకు పరిష్కారం చూపామన్నారు. రాజీవ్ గాంధీని దేశ యువత స్ఫూర్తిగా తీసుకోవాలని, రాహుల్ గాంధీని ప్రధానిగా చేసుకుని 21 ఏళ్లు నిండిన వారు శాసన సభకు పోటీ చేసేలా చట్టాన్ని సవరించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఆ కలలన్నీ సాకారం కావాలంటే దేశానికి రాహుల్ గాంధీ ప్రధాని కావాలని, రాజీవ్ స్ఫూర్తితో రాహుల్ గాంధీని ప్రధానిగా చేసే వరకు విశ్రమించబోమన్నారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ గాంధీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించిన వారిలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎంపీలు వీహెచ్, అంజన్ కుమార్ యాదవ్, మండలి ఛీఫ్ విప్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

మెడిసిన్ విషయంలో తప్పుదోవ పట్టిస్తే కఠిన చర్యలు

మంత్రి దామోదర

విశాలాంధ్ర – హైదరాబాద్ : మెడిసిన్ విషయంలో తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇచ్చే సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డ్రగ్ కంట్రోల్ అథారిటీ అధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. ఈ మేరకు డ్రగ్ కంట్రోల్ అథారిటీ పనితీరుపై మంగళవారం, వెంగళరావు నగర్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. 2024 – 2025లో డీసీఏ వర్క్ ప్రోగ్రెస్‌ను మంత్రికి డీసీఏ డైరెక్టర్ జనరల్ షానవాజ్ ఖాసీం వివరించారు. 2024లో 25,939 తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన 4142 సంస్థలపై చర్యలు తీసుకున్నామని తెలిపారు. 2025లో జనవరి నుంచి జూలై వరకు 16,481 తనిఖీలు చేశామని, నిబంధనలు ఉల్లంఘించిన 2827 సంస్థలపై చర్యలు తీసుకున్నామన్నారు. 2024 జనవరి నుంచి 2025 జూలై వరకు 7200 మెడిసిన్ సాంపిల్స్‌ను టెస్ట్ చేయగా, అందులో 186 నాసిరకం మెడిసిన్‌గా తేలిందని, సంబంధిత సంస్థలపై చట్టప్రకారం చర్యలు తీసుకున్నామన్నారు. సుమారు 700 కేసులు బుక్ చేశామని, ప్రతి కేసులోనూ దోషులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. జనాలను తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇస్తూ, మెడిసిన్ అమ్మకాలు జరుపుతున్న కంపెనీలు, వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలో మరిన్ని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులను మంజూరు చేసి, రిక్రూట్ చేస్తామన్నారు.

నగర పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

కమిషనర్ ఆర్.వి. కర్ణన్

విశాలాంధ్ర, హైదరాబాద్ : నగరంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలనీ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం సేరిలింగంపల్లి జోన్ పరిధిలోని యూసుఫ్‌గూడ సర్కిల్‌లో బోరబండ కుంట, సున్నం చెరువు, ఎస్పిఆర్ హిల్స్, కార్మికనగర్ పీటీ పాయింట్, రహ్మత్‌నగర్, జానకమ్మతోట, నవీన్‌నగర్ ప్రాంతాలలో కమిషనర్ జోనల్ కమిషనర్ భోర?డే హేమంత్ సహదేవరావు, హెల్త్ %ఙ% శానిటేషన్ అదనపు కమిషనర్ సి.ఎన్. రఘు ప్రసాద్, సర్కిల్ అధికారులతో కలిసి సుమారు రెండు గంటల పాటు విస్తృతంగా పర్యటించారు. పారిశుధ్య కార్యక్రమాల పురోగతిని క్షేత్ర స్థాయిలో సమీక్షించారు. ముఖ్యంగా పారిశుధ్య డ్రైవ్ , వ్యర్థాల నిర్వాహణ, ప్రజారోగ్యం పెంపొందించే విధానాలను కమిషనర్ పరిశీలించారు. వర్షాలు తగ్గుముఖం పట్టినందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూసేందుకు సానిటేషన్ బృందాలకు నిరంతరం పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. జోనల్, సర్కిల్ అధికారులు ఉన్నతాధికారులు వర్షాల ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు ప్రభావవంతంగా జరిగేలా పర్యవేక్షణ చేయాలనీ సూచించారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ మాట్లాడుతూ పరిశుభ్రత, ప్రజా ఆరోగ్యం రెండూ విడదీయరాని అంశాలనీ అన్నారు. నగరంలోని కాలనీల్లో పరిశుభ్రత నెలకొంటేనే నగర ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. అందుకే ఆరోగ్యకరమైన నగర నిర్మాణమే లక్ష్యంగా మాన్సూన్ సానిటేషన్ స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. నగరంలోని పౌరులు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచడంలో క్రియాశీలక భాగస్వామ్యం అవుతూ... జీహెచ్ఎంసీ చేపట్టిన పారిశుద్ధ్య డ్రైవ్‌కు పూర్తి సహకారం అందించాలని కోరారు.

జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో మరోసారి ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మరోసారి ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌ను ఈ నెల 21వ తేదీ నుండి 25 వ తేదీ వరకు అయిదు రోజుల పాటు నిర్వహించనున్నట్లు కమిషనర్ ఆర్.వి. కర్ణన్ తెలిపారు. గతంలో నిర్వహించిన వర్షాకాల శానిటేషన్ డ్రైవ్‌లు మంచి ఫలితాలను ఇవ్వడంతో, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన పేర్కొన్నారు. కమిషనర్ మాట్లాడుతూ..., వర్షాకాలంలో వ్యాపించే మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులను నివారించడానికి పరిసరాల పరిశుభ్రత ఎంతో అవసరమని తెలిపారు. వాతావరణ శాఖ సూచనల ప్రకారం రాబోయే రోజుల్లో వర్షాలు పడే అవకాశం తక్కువగా ఉందన్నారు.

రూ.2.75 కోట్లతో స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర,షాద్ నగర్, రూరల్ : విద్య, క్రీడల వల్లే పేరు ప్రఖ్యాతులు వస్తాయని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్ నగర్ పట్టణ లోని ప్రభుత్వ మినీ స్టేడియం అత్యాధునిక నిర్మాణానికి రూ.2.75 కోట్ల రూపాయలతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి వివిధ పాఠశాలలకు సంబంధించిన విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.....దేశం కోసం ప్రాణ త్యాగాలు చేసిన వ్యక్తులు రాజీవ్ గాంధీ కుటుంబం అని అందుకే ఆయన జయంతి సందర్భంగా షాద్ నగర్ లో మినీ స్టేడియాన్ని 2.75 కోట్లతో అత్యాధునిక వసతులతో నిర్మించబోతున్నామని ఎమ్మెల్యే అన్నారు. విద్యార్థులకు బాల దశ బంగారు దశ లాంటిదని అన్నారు. ప్రతి విద్యార్థి పాఠశాల కళాశాల దశలోని క్రీడల్లో రాణించాలని గుర్తు చేశారు. ఒక క్రీడాకారుడికి మాత్రం ప్రపంచవ్యాప్తంగా పేరు వస్తుందని అన్నారు. గత ప్రభుత్వం విద్యా వ్యవస్థను, క్రీడా వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని మడిపడ్డారు.

షాద్ నగర్ నియోజకవర్గంలో చదువు క్రీడలకు తన ప్రభుత్వం ఎంతో పెద్దపీట వేసిందని పేర్కొన్నారు. విద్యాపరంగా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేస్తే, ఇప్పుడు క్రీడల కోసం 2.75 కోట్ల రూపాయలు మంజూరు చేసి యువత ఆటలు వాడేందుకు వనరులు సమకూర్చుతున్నామని అన్నారు. 2034లో హైదరాబాద్ లో జరిగే ప్రపంచ అథ్లెటిక్ క్రీడలకు విద్యార్థులు సిద్ధం కావాల్సిన అవసరం ఉందన్నారు. స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు కాబోతుందని దాని ద్వారా ఎంతోమంది ప్రతిభగల క్రీడాకారులను గుర్తిస్తామని అన్నారు. షాద్ నగర్ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి హై స్కూల్ నుండి 5 మంది క్రీడాకారులను గుర్తించి వారికి ప్రతినెల 5000 చొప్పున ఏడాది పాటు స్కాలర్‌షిప్ లు వ్యక్తిగతంగా ఇస్తానని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రకటించారు. తనకు పదవులు సంపాదనపై ఆశలు లేవని భగవంతుడు తనను చూసినంతలో ఈ ప్రాంతానికి ఏదో ఒకటి చేయాలి అందరికీ గుర్తింపు తేవాలని ఉద్దేశంతో సుమారు 40 హైస్కూల్ విద్యార్థులలో క్రీడా కారులను గుర్తించి ప్రతి పాఠశాలకు 5 మంది చొప్పున మొత్తం 200 మందికి ఐదువేల చొప్పున స్పోర్ట్స్ స్కాలర్‌షిప్ లు ఇస్తానని ప్రకటన చేశారు.ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిప్యూటీ ఈఈ శ్రీనివాస్, ఏఈ గోపాల్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, చెన్నయ్య, కృష్ణారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, బాలరాజ్ గౌడ్, రఘునాయక్, చెంది తిరుపతిరెడ్డి, విశ్వం, బస్వం, దంగు శ్రీనివాస్ యాదవ్, మసూద్ ఖాన్, మంగులాల్ నాయక్, పురుషోత్తం రెడ్డి, జితేందర్ రెడ్డి, సయ్యద్ ఖదీర్, అందే మోహన్, ఇబ్రహీం పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యా బోధన అందాలి

కలెక్టర్ హరి చందన దాసరి

విశాలాంధ్ర, హైదరాబాద్ : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన బోధనల అందాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం పురాణ పూల్ లోని అఫ్జల్ గంజ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధనతోపాటు వివిధ సబ్జెక్టుల నందు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల్లోని విద్యాసామర్థ్యాలను తెలుసుకున్నారు. పదో తరగతిలో ప్రతి ఒక్కరు ఉత్తీర్ణత పొంది మంచి ర్యాంకులు సంపాదించాలని విద్యార్థులకు ఈ సందర్భంగా ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వ విద్యా వ్యవస్థకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని మెరుగైన విద్య బోధన లక్ష్యంగా విద్యా ప్రమాణాలు ఉండాలని ఉపాధ్యాయులకు సూచించారు. తదుపరి విద్యార్థులు, ఉపాధ్యాయుల స్ట్రెంత్ ను తెలుసుకొని హాజరు పట్టికలను పరిశీలించారు. ముఖ్యాంగా డిజిటల్ విద్యాబోధనకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని బయోమెట్రిక్ యాప్ ను పరిశీలించి పాఠశాలకు వచ్చే విద్యార్థులకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలని సూచించారు. జిల్లాలో అధికంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వివిధ రకాల వ్యాధులు ప్రభులే అవకాశం ఉన్నందున పాఠశాల గదులతో పాటు మరుగుదొడ్లు, పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎం పద్మజా కుమారి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

దిగ్విజయంగా బోన్ మ్యారో స్టెమ్ సెల్ ట్రాన్స్ ప్లాంటేషన్

విశాలాంధ్ర – జూబ్లీహిల్స్ : తుకారాం గేట్, మౌలాలికి సికింద్రాబాద్‌కు చెందిన 58 సంవత్సరముల వ్యక్తి గత 6 నెలలుగా శోషరస గ్రంథి వాపు (నొప్పిలేకుండా), జ్వరం, రాత్రిపూట చెమటలు, బరువు తగ్గడం, అలసట, ఛాతీలో నొప్పి, చర్మంపై దద్దుర్లు, వంటి తదితర సమస్యలతో బాధపడుతున్నారు. తగిన చికిత్స కోసం కుటుంబ సభ్యులు వైద్యులను సంప్రదించగా అరుదైన హై గ్రేడ్ నాన్ హాడ్కిన్ లింఫోమా, అనే ఒక్క రకమైన క్యాన్సర్ తో బాధపడుతున్నారు అని వెంటనే చికిత్స ప్రారంభించాలని లేకుంటే ప్రాణాలకే ప్రమాదం అని తెలిపారు. దీంతో హై గ్రేడ్ నాన్ హాడ్కిన్ లింఫోమా చికిత్స కోసం ప్రముఖ హాస్పిటల్‌లో, ఆరు(6) సైకిళ్ల కీమోథెరపీ తీసుకున్నప్పటికీ, పేషెంట్ చికిత్సలో ఎలాంటి పురోగతి లేకపోవడం, వ్యాధి మళ్ళీ తిరగబెట్టింది.

దీంతో దిక్కు తోచని స్థితిలో దుర్గాబాయి దేశ్‌ముఖ్ రెనోవా క్యాన్సర్ సెంటర్, విద్యానగర్, గురించి తెలుసుకొన్న కుటుంబ సభ్యులు నేరుగా సంప్రదించారు. వారి కేసును పరిశీలించిన ప్రముఖ సర్జికల్ ఆంకాలజీ చికిత్స నిపుణులైన డా.యు.ఆజాద్ చంద్రశేఖర్, మెడికల్ డైరెక్టర్, సీనియర్ కన్సల్టెంట్ సర్జికల్ ఆంకాలజిస్ట్, వారి సహచర వైద్య బృందం డా.విశాల్ టోకా, సీనియర్ కన్సల్టెంట్ మెడికల్, హెమటో ఆంకాలజిస్ట్ ఈ కేసును ఒక ఛాలెంజ్ గా పరిగణించి చికిత్స ను ప్రారంభించారు. డా.విశాల్ టోకా వారి మెడికల్ బృందం హై గ్రేడ్ నాన్ హాడ్కిన్ లింఫోమా చికిత్సపై ప్రణాళికాబద్ధంగా ముందుకు కదిలి ముందుగా మూడు (3) సైకిళ్ల హైడోస్ కెమోథెరపీ ఇవ్వడం పేషెంట్ చికిత్సకు బాగా స్పందిస్తుండడంతో ఆటోలోగస్ విధానం ద్వారా బోన్ మ్యారో స్టెమ్ సెల్ ట్రాన్స్ ప్లాంటేషన్ ని విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా డా.యు.ఆజాద్ చంద్రశేఖర్, డా.విశాల్ టోకా కేసు వివరాలను వెల్లడిస్తూ మల్టిపుల్ మైలోమా, తిరగబెట్టిన లింఫోమా క్యాన్సర్లను నిర్మూలించ డానికి వారికి వైద్యులు సూచించే చికిత్సా విధానం బోన్ మ్యారో స్టెమ్ సెల్ ట్రాన్స్ ప్లాంటేషన్. ఈ చికిత్స ద్వారా కొత్త జీవితాన్ని అందించవచ్చుని, ఈ పేషెంట్ లో ఆటోలోగస్ విధానం ద్వారా రోగికి సొంత స్టెమ్ సెల్స్ తో చికిత్స చేశామని, దీనిలో భాగంగా పేషెంట్ దగ్గర నుంచి తగిన మోతాదులో మూలకణాలను సేకరించి వాటిని భద్రపరుస్తారు. తదనంతరం అధిక మోతాదులో కీమోథెరపీ ఇస్తారు. ఈ కీమోథెరపీల వలన క్యాన్సర్ కణాలతో పాటు శరీరంలో ఉన్న మూలకణాలు కూడా చనిపోతాయి. తిరిగి కణాల ఉత్పత్తిని పునరుద్ధరించడానికి భద్రపరచిన మూలకణాలను ఎక్కిస్తారు. అంటే ఈ విధానంలో వ్యక్తి మూలకణాలే తిరిగి అతని శరీరంలోకి చేరుతాయి. కాకపోతే, అన్ని సందర్భాల్లో ఇది సాధ్యం కాదు. వ్యక్తి ఎముక మూలుగ ఆరోగ్యకరమైనదిగా ఉండాలి అని తెలిపారు. ఈ సందర్భంగా పేషెంట్ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఎంతో నిరాశ చెందిన తమకు దుర్గాబాయి దేశ్‌ముఖ్ రెనోవా క్యాన్సర్ వైద్యులు ముఖ్యంగా డా.యు.ఆజాద్ చంద్రశేఖర్ డా.విశాల్ టోకా, ఎంతో నమ్మకం కలిగించి తిరిగి ఆశలు చిగురించేలా చేశారని చెప్పారు. ఎంతో నైపుణ్యంతో, నిబద్ధతతో విజయవంతంగా చికిత్స అందించించిన వైద్య బృందానికి, నర్సింగ్, ఇతర సిబ్బందికి ఎంతో ఋణ పడి ఉన్నామని వారిని మరువలేమని, ధన్యవాదాలు తెలిపారు.

రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

విశాలాంధ్ర,షాద్ నగర్, రూరల్: మాజీ ప్రధాన మంత్రి భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి వేడుకల సందర్భంగా రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ... స్వర్గీయ మాజీ ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన కుటుంబం మొత్తం దేశానికి, దేశ ప్రజల సేవలకే అంకితమైందన్నారు. ప్రధానిగా రాజీవ్‌గాంధీ అనేక సంస్కరణలు తెచ్చి దేశాన్ని అభివృద్ధి చేశారన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

విశాలాంధ్ర–ములుగు జిల్లా బ్యూరో: ఏటూరునాగారం మండల కేంద్రంలో,కాంగ్రెస్ పార్టీ మండల కార్యాలయంలో స్వర్గీయులు మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించినట్లు మండల కమిటీ అధ్యక్షులు రఘు తెలిపారు. ముందుగా ఆయన చిత్ర పటకు పూల మాల వేసి ఘననివాలు అర్పించారు.అనంతరం స్థానిక ప్రభుత్వా ఆసుపత్రిలో రోగులకు, పండ్ల పంపిణీ చేసిన్నట్లు ఆయన తెలిపారు. అనంతరం రాజీవ్ గాంధీ చేసిన సేవలపై రఘు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, మండల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవలో కాంగ్రెస్ యువ నేత



విశాలాంధ్ర–కొత్తూరు: నందిగామ మండలం, మేకగూడ గ్రామం నుండి జేపి దర్గా రహదారి వరకు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్డు గుంతల మయంగా మారి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం గమనించి బుధవారం మేకగూడ గ్రామ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు బందారు రాజు ముదిరాజ్ తన సొంత ఖర్చులతో జెపి దర్గా రోడ్డు నుండి గ్రామం వరకు ఉన్న గుంతలలో మట్టి పోయించి వాహనదారుల సమస్యను పరిష్కరించారు. దీంతో స్థానికులు, వహా నదారులు ఆయనను అభినందించారు.

ఓయో లాడ్జ్‌లో వ్యక్తి మృతి..

విశాలాంధ్ర –కొత్తూరు: పడుకున్న చోటే ఓయూ లాడ్జి గదిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. కేశంపేట మండలం, సంగెం గ్రామానికి చెందిన జోగన్న గూడెం రమేష్ (37) గ్రామంలోని గ్రామపంచాయతీ కార్మికుడిగా పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. మృతుడు మద్యం ఎక్కువగా సేవించేవాడు. అదేవిధంగా గత కొన్ని ఏళ్ల నుండి మూర్ఛ వ్యాధి, బీపీతో బాధపడేవాడు. ఈ క్రమంలో ఈనెల 19న పని ఉందని కుటుంబ సభ్యులకు చెప్పి కొత్తూరు కి వచ్చాడు. మున్సిపల్ పరిధిలోని రుహిక ఓయో లాడ్జిలో ఓ గదిని అద్దెకు తీసుకొని మద్యం సేవించి నిద్రపోయాడు. తెల్లారేసరికి మృతి చెంది కనిపించాడు. మృతుని భార్య జోగన్న గూడెం లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు సి ఐ నరసింహారావు వివరించారు. విచారణ అనంతరం మృతికి కారణాలను వెల్లడిస్తామని పేర్కొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కొలను హన్మంత్ రెడ్డి శంకుస్థాపన

విశాలాంధ్ర–కుత్బుల్లాపూర్: నియోజకవర్గం 125 డివిజన్ గాజులరామారం పరిధిలోని ఒక్షిత్ హిల్స్ వ్యూ కాలనీ రోడ్‌లో పాదచారులు రోడ్డు సమస్యపై ఇబ్బందులను ఎదుర్కొంటూ గత నేల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని సంప్రదించి సమస్యను విన్నవించగా ఆయన వెంటనే స్పందించి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పెషల్ ఫండ్స్ ద్వారా సీసీ రోడ్డు కొరకు రూ.55 లక్షల రూపాయలు మంజూరు చేయించారు. బుధవారం ఆయా కాలనీలో నిర్వహించిన సీసీ రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమానికి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు దమ్మని శ్రావణ్ కుమార్ ముదిరాజ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్ధనోళ్ల సంజీవరెడ్డి, బహదూర్ పల్లి మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్,అమీర్, అఫ్జల్,నరేష్,సోమిరెడ్డి, నాయుడు, విజయ్,కుమార్, అరుణ, సురేందర్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ గురజాల సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

హెచ్.ఎం.ఓ.పి నెంబర్. 187/2024

బిట్వీన్

కొంద్రు ముకుంద మౌనిక – పిటిషనర్

మరియు

కొంద్రు వెంకటేష్ – రెస్పాండెంట్

రెస్పాండెంటు : కొంద్రు వెంకటేష్, తండ్రి తిరుపతయ్య, హెచ్.నెం.22-236, P.B.No. నెం.236, డబ్ల్యుపి, వినాయక హిల్స్ రోడ్డు నెం.4, బి.ఎస్.రెడ్డి నగర్, హైదరాబాద్ – 500070.

మీపై పిటీషనరు పిటీషను పరిహారములను కోరుతూ పై నెంబరు కేసు దాఖలు చేసియున్నారు. సదరు కేసు వాయిదా ది. 28-8-2025న కలదు. సదరు వాయిదాకు మీరు స్వయంగాగాని, వకీలుద్వారా హాజరై మీ ఆక్షేపణలు తెలుపగలరు. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేదీ : 28-08-2025

డి.చెన్నయ్య, అడ్వకేట్,
పిడుగురాళ్ళ, పల్నాడుజిల్లా.
సెల్ నెం : 9440214833.

లబ్ధిదారుల కళ్లలో ఆనందం

విశాలాంధ్ర - గూడూరు : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతున్నది. గూడూరు మండలంలోని కొల్లాపురం గ్రామపంచాయతీలో లబ్ధిదారుల ఆనంద ఉత్సవాలు వెల్లివిరుస్తున్నాయి. ఆ గ్రామానికి 17 ఇందిరమ్మ ఇల్లు వస్తే అందరు పనులు మొదలుపెట్టి కాలాతీతం అయినా కూడా సకాలంలో బిల్లులు చెల్లించారు. మొదటి విడతగా పునాది బెడ్ లక్ష రూపాయలు రావడంతో ఖర్చులో ఖర్చు ఉన్నట్టు మండల కేంద్రంలో మొట్టమొదటి గ్రామంగా ఇంద్రమైన్లు సకాలంలో పూర్తి చేసిన గ్రామంగా నిలుస్తున్నది. ఆ గ్రామంలో 17 ఇందిరమ్మ ఇండ్లు రాగా అందరూ పూర్తిగా పనులు మొదలుపెట్టి స్లాబ్ లెవెల్ వరకు కట్టుకున్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శి భీమా నాయక్ లబ్ధిదారులకు వెంటనే బిల్లులు అదేవిధంగా విధంగా వారి ఇండ్లలోకి వెళ్లి ఫోటోలు తీసిబిల్లులు చెల్లిస్తున్నారు. పేదరికంలో ఉన్నబడుగు బలహీనవర్గాల అందరికీ ఇందిర ఇండ్లు అదేవిధంగా కాంగ్రెస్ కృషి చేస్తున్నది.లబ్ధిదారులు పూనెం.భద్రమ్మ 'విశాలాంధ్ర పత్రిక ప్రతినిధి'తో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు మా పేదలకు వరం లాంటిదని వచ్చిన 20 నెలల్లోనే అందరికీ అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని భద్రమ్మ తెలిపారు. కార్యదర్శి భీమా నాయక్ లబ్ధిదారులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఇళ్లు నిర్మించుకునేందుకు సీఎం జోక్యం చేసుకోవాలి

విశాలాంధ్ర, బషీర్ బాగ్: చట్ట ప్రకారం రిజిస్ట్రేషన్ అయిన ఇళ్ల స్థలాల్లో ఇండ్లు నిర్మించుకోకుండా అడుపడుతున్న వ్యక్తులపై సీఎం రేవంత్ రెడ్డి తగు చర్యలు తీసుకుని నిరుపేదలకు న్యాయం చేయాలని గంగా జెమిని వెల్ఫేర్ సొసైటి బాధితులు విజ్ఞప్తి చేశారు. బుధవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో సొసైటి ప్రధాన కార్యదర్శి మహ్మద్ హబీబ్ ఉద్దీన్, సభ్యులు మహ్మద్ నవాజుద్దీన్, మహ్మద్ ఇషార్, షేక్ మొయిన్ తదితరులు మాట్లాడుతూ శంషాబాద్ మండలంలోని నక్కొడ గ్రామంలోని సర్వే నెంబరు 347/419లో గల భూమిని స్థానికుడైన పెంటయ్య వద్ద రఫీక్ కొనుగోలు చేశారని తెలిపారు. కాగా ఆ భూమిలో రఫీక్ 150 ప్లాట్స్ ఒక వెంచర్ వేయడం జరిగిందని, ఈ వెంచర్లో 100 మందికి పైగా పేదలు ఆ 150 ప్లాట్స్ ఎంతో కష్టపడి కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఈ ప్లాట్స్ లో కొంత మంది ఇళ్ళు నిర్మించుకున్నారని, మరికొంత మంది ఇళ్ళు నిర్మించుకోలేదని, ఈ మధ్య కాలంలో అక్కడ స్థలాల ధరలు పెరగడంతో మిగిలిన వారిని ఇళ్ళు కట్టుకోనియ్యకుండా పెంటయ్య, అతని సోదరులు అడ్డుపడుతున్నారని వారు ఆరోపించారు. ఈ విషయంపై స్థానిక పోలీసులు, డీఎస్పీ ప్రజావాణిలో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. తక్షణమే సీఎం జోక్యం చేసుకుని బాధితులకు న్యాయం చేయాలని వారు కోరారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలకు తరలిన ఉప్పల్ నియోజకవర్గ నేతలు

విశాలాంధ్ర , కాప్రా : మేడ్చల్ జిల్లా, కుత్బుల్లాపూర్, షాపూర్ నగర్ మహారాజా ఫంక్షన్ లో జరుగుతున్న భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాష్ట్ర 4వ మహాసభలకు సీపీఐ ఉప్పల్ నియోజకవర్గ నేతలు ఈసీఐఎల్‌లోని సీపీఐ కార్యాలయం నీలం రాజశేఖర్ రెడ్డి భవన్ నుండి తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జీ. దామోదర్ రెడ్డి, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు టి. సత్య ప్రసాద్, సీపీఐ మాజీ ఉప్పల్ మండల కార్యదర్శి రామ్ నారాయణ, ఉప్పల్ మండల సహాయ కార్యదర్శి ఎండీ. బషీర్, కార్యవర్గ సభ్యులు లక్ష్మీ నారాయణ, నారా నర్సింహా,కృపాకర్, స్వామిదాస్, నర్సింగ్ రావు, సుధాకర్, జోషి, శోభ, ముంతాజ్ బేగం, రాజేందర్, ఏఐఎస్ఎఫ్ నేతలు మహేష్, అజీమ్ పాషా, సమీర్, కిరణ్ పాల్గొన్నారు.

పనిభారం తగ్గించాలి..ఎపిఎంకు వినతి

విశాలాంధ్ర, కౌటాల: మండల కేంద్రంలో బుధవారం ఐకెపి వెలుగులో క్షేత్ర స్థాయిలో పని చేస్తున్న గ్రామైఖ్య సంఘం అసిస్టెంట్ లు తెలంగాణ (సెర్ప్) సంస్థ మొత్తం 67 రకాల పనులు చేయించు కుంటునారు. ఎస్ హెచ్ జి ఫార్మేషన్ నుంచి మొదలుకొని సంస్థ పనులు, ప్రభుత్వ పథకాల పనులతో పాటుగా విద్యాసంస్థలు స్కూల్ యూనిఫాం, ఉల్లాస్, తో సహా అదనంగా పనులు అప్పజెప్పి ఆన్లైన్, ఆఫ్లైన్ పనులు చెప్పడంతో తీవ్ర ఒత్తిడికి గురి చేస్తునారు అని సూర్య చంద్ర మండల సమాఖ్య కౌటాల ఎపిఎం డి. వినేష్ రావ్ కి విఒఏ లు వినతి పత్రం అందజేశారు. విఒఏలు వెంకటేష్, దత్తు, రవి, మహేశ్వరీ, భీంరావ్ సురేష్‌తో పాటుగా 20 మంది విఒఏలు పాల్గొన్నారు.

కాకతీయ నగర్ కాలనీ అధ్యక్షురాలిగా భాగ్యలక్ష్మి ఎన్నిక...

విశాలాంధ్ర, మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 2వ డివిజన్ మేడిపల్లి కాకతీయ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా రెండవసారి భాగ్యలక్ష్మి - శంకర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాకతీయ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో పూర్తిస్థాయి మహిళలతో కూడిన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక కాకతీయ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ మొత్తం కమిటీ మహిళలతో ఏకగ్రీవ ఎన్నికవ్వడం అందరికీ ఆదర్శం. కాలనీ అధ్యక్షురాలుగా భాగ్య లక్ష్మి - శంకర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సంపూర్ణ కృష్ణా రెడ్డి, ప్రధాన కార్యదర్శి భూక్య దేవి - విజయ్ కుమార్, కోశాధికారి అనుష - సంతోష్ రెడ్డి, ఉపాధ్యక్షురాలు ఉమా - తిరుపతి, ఉపాధ్యక్షురాలు మూడవత్ శిరీష - మల్లేష్ , ఉపాధ్యక్షురాలు సుజాత - తార సింగ్ , జాయింట్ సెక్రటరీగా చాడ కవితా - సురేందర్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీదేవి - గుణేశ్వరావు, సంస్కృతిక కార్యదర్శి శ్రీలత - జగదీష్ , యూత్ సెక్రటరీ సరిత - కిరణ్ , ప్రచార కార్యదర్శి నందిత - వెంకట్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మహిళా పోలీస్ శక్తికి అండగా ప్రభుత్వం

మంత్రి సీతక్క

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాజేంద్రనగర్‌లోని రాజ్ బహదూర్ వెంకట్రామిరెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీ ప్రాంగణంలో తెలంగాణ మహిళా పోలీస్ రాష్ట్రస్థాయి తొలి సదస్సు ఘనంగా ప్రారంభమైంది. మూడు రోజులపాటు జరిగే ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ, సీతక్క మహిళా పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. డైరెక్టర్ జనరల్ అధికారులు అభిలాష బిష్ట్, చారు సిన్హా, శికా గోయల్, స్వాతి లక్రాతో పాటు కానిస్టేబుల్ నుండి ఎస్పీ స్థాయి వరకు సుమారు 400 మంది మహిళా పోలీస్ అధికారులు ఈ సదస్సులో పాల్గొన్నారు. సదస్సులో మహిళా పోలీసులు విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న సవాళ్లు, అనుభవాలు, మౌలిక వసతుల మెరుగుదల వంటి అంశాలపై చర్చ జరగనుంది. ఈ సందర్భంగా ప్రసంగించిన మంత్రి సీతక్క మహిళా పోలీసుల తొలి సదస్సు నిర్వహిస్తున్నందుకు పోలీస్ శాఖకు అభినందనలు తెలిపారు. మహిళా పోలీసుల సంక్షేమం పట్ల ప్రభుత్వ కమిట్‌మెంట్‌ను ఈ సదస్సు ప్రతిబింబిస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెూమ్ మినిస్టర్‌గా మహిళా శక్తిని ప్రోత్సహిస్తున్నారని, ఈ సదస్సులో మహిళా పోలీసులు ఇచ్చే సలహాలు, సూచనల ఆధారంగా సంక్షేమానికి సంబంధించిన సానుకూల నిర్ణయాలు తప్పకుండా తీసుకుంటారని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. యూనిఫార్మ్‌లో ఉన్న అక్కచెల్లెమ్మలకు సెల్యూట్ అంటూ ప్రశంసించారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 1973లో కేరళలో కోజికోడ్‌లో దేశంలోని తొలి మహిళా పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించిన విషయాన్ని స్మరించుకున్నారు. అదే దిశగా దేశవ్యాప్తంగా మహిళా పోలీస్ స్టేషన్లు ఏర్పడి, న్యాయం కోసం మహిళలు ధైర్యంగా పోలీస్ స్టేషన్లకు వచ్చే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ఒకప్పుడు పోలీసులు, తాను భిన్న ధ్రువాలుగా ఉన్నామని మారిన పరిస్థితుల్లో తాను ప్రజాసేవలోకి రావాల్సి వచ్చిందని తన ఉద్యమ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వృత్తి ధర్మానికి మానవీయతను జోడిస్తే మంచి ఫలితాలు వస్తాయని, కమిట్మెంట్‌కు, కాన్ఫిడెన్స్‌కు చిరునామాగా తెలంగాణ మహిళా పోలీసులు నిలుస్తున్నారని మంత్రి సీతక్క అభిప్రాయపడ్డారు. వృత్తి ధర్మం, మాతృత్వం మధ్య మహిళా పోలీసులు ఎదుర్కొనే సంఘర్షణల దృష్ట్యా మెటర్నిటీ సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని మంత్రి సూచించారు. మహిళా పోలీసులు ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లను అధిగమించడానికి ఈ సదస్సు దోహదపడుతుందన్న నమ్మకాన్ని మంత్రి సీతక్క వ్యక్తం చేశారు. తెలంగాణ మహిళా పోలీస్ రాష్ట్రస్థాయి తొలి సదస్సును ప్రారంభించి ప్రసంగించిన మంత్రి సీతక్కను పోలీసు ఉన్నతాధికారులు సన్మానించారు. ఇతర రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారులను, పోలీస్ శాఖలో ఉన్నత స్థానంలో ఉన్న మహిళా పోలీసు అధికారులను మంత్రి అభినందించారు.

కార్పొరేట్ స్థాయిలో రిజిస్ట్రార్ భవన సముదాయలు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని గచ్చిబౌలి డివిజన్ లోగల జిపిఆర్ క్వార్టర్స్ వద్ద బాలాజీ గ్రౌండ్స్‌లో శేరిలింగంపల్లి అభివృద్ధికి బాటలు వేస్తూ.. జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయము, ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి మినిస్టర్ శ్రీధర్ బాబు, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు వేమ్ నరేందర్ రెడ్డి, జిహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయ లక్ష్మి మంత్రివర్గ సభ్యులు, శేరిలింగంపల్లి నియోజకవర్గం కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులతో కలసి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్పొరేట్ స్థాయిలో రిజిస్ట్రార్ భవన సముదాయలు అన్ని హంగులతో చేపడుతున్నట్లు తెలిపారు. గతంలో సరైన మౌలిక సదుపాయాలు లేక పేద మధ్య తరగతి కుటుంబాల నుండి ప్రతిఒక్కరూ రిజిస్ట్రార్ ఆఫీస్ కు వస్తే చేదు అనుభవం ఎదురుకోవాల్సిన పరిస్థితులు ఉండేవని వాటిని అధికమించి ప్రజా పాలనలో భాగంగా 5 స్టార్ హెూటల్ హెూదాలో అన్ని సదుపాయాలతో రిజిస్ట్రేషన్ ఆఫీస్ నిర్మించడానికి తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు.

ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

కలెక్టర్ మిక్కిలినేని మన చౌదరి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రహరీ గోడ నిర్మించి, గేటు ఏర్పాటు చేసుకోవాలని అత్యంత అవసరమైన మౌళిక వసతులకు వెంటనే నివేదికలు పంపాలని శామీర్ పేట సామాజిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ కు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరు మిక్కిలినేని మన చౌదరి సూచించారు. బుధవారం శామీర్ పేట్ మండలంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టరు తనిఖీ చేసారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఆసుపత్రి పరిసర ప్రాంతాలను పరిశీలించి, పరిశుభ్రంగా ఉంచుకోవాలని మెడికల్ ఆఫీసర్ కు సూచించారు. ఆసుప్రత్రిలో ఏమేమి సమస్యలున్నాయని మెడికల్ ఆఫీసర్ ను అడుగగా, పై కప్పు నుండి వాటర్ లీకేజీ, బెడ్స్ కొరత, వాష్ రూమ్స్ నిర్వహణలో లేవని, డ్రైనేజీ సమస్యలు ఉన్నాయని కలెక్టరుకు తెలిపారు. కలెక్టర్ స్పందిస్తూ ఆసుపత్రి భవనం పైన నీరు లీకేజ్ కాకుండా రేకులతో షెడ్ ఏర్పాటు చేయాలని, డ్రైనేజీ, బెడ్స్, వాష్ రూమ్స్ నిర్వహణకు అవసరమైన నిధులు ఇస్తానన్నారు. ఫీవర్ సర్వే జరుగుతుందా అని, డెంగూ కేసులు ఎన్ని ఉన్నాయని కలెక్టర్ అడుగగా, ఈ నెలరెండు డెంగూ కేసులు నమోదు అయ్యాయని, వారికి చికిత్స అందిస్తున్నామని మెడికల్ ఆఫీసర్ తెలిపారు. ల్యాబ్, లేబర్ రూం, స్టోర్ అన్ని విభాగాలను కలెక్టర్ తిరిగి పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో శామీర్ పేట్ తహసీల్దారు యాదగిరి రెడ్డి, డిసిహెచ్ ఎస్ సునీత, మెడికల్ ఆఫీసర్ శివకిరణ్ పాల్గొన్నారు.

విలువైన దస్త్రాలకూ రక్షణ కరవు

విశాలాంధ్ర, కౌటాల : ప్రకృతి విపత్తుల్లో ఇళ్లు కూలితే, ఏదైనా నష్టం వాటిల్లితే ప్రభుత్వానికి నివేదిక ఇచ్చే కీలక బాధ్యత తహసీల్దార్లదే. కానీ, నిధులు లేక వారి కార్యాలయాలను మాత్రం బాగుచేసుకోలేక పోతున్నామని ఆవేదన చెందుతున్నారు. సాగు భూముల రిజిస్ట్రేషన్ల ద్వా ఏటా రూ. కోట్లకు పైగా రాబడిని సమకూర్చుతున్న కార్యాల యాలకు సొంత భవనాలు కరువయ్యాయి. కొన్ని కార్యాలయాలకు సొంత భవనాలున్నా.. శిథిలావస్థకు చేరాయి. వర్షాకాలం వస్తే పైకప్పు నుంచి నీరు కురిసి దస్త్రాలు తడిసిపోతున్నాయి. దీంతో విలువైన పత్రాలు, రికార్డులకు రక్షణ లేకుండా పోతోంది. 2016, 2021లలో పరిపాలన పునర్ వ్యవస్థీ కరణలో భాగంగా కొత్త మండలాలు ప్రకటించినప్పుడు 153 కార్యాలయాలను ఏర్పాటు చేశారు. కానీ, చాలా చోట్ల శాశ్వత భవనాలు నిర్మించకపోవడంతో అద్దె భవనాల్లోనే కొనసాగు తున్నాయి. ప్రభుత్వం ఇచ్చే నిధులు తప్ప.. గతంలో మాదిరి తహసీల్దారు కార్యాలయాలకు స్థానికంగా పన్నులేవీ రావడం లేదు. దీంతో నిర్వహణ కష్టంగా మారింది.

ఉన్నతాధికారులకు తెలిపాము..
కౌటాల తహసీల్దార్ ప్రమోద్

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం చాలా శిథిలావస్థకు చేరింది. విలువైన దస్త్రాలను భద్రంగా దాచిపెదామంటే చిన్న చినుకు పడ్డ ఊరిస్తుంది. ఈ విషయం పై జిల్లా అధికారులకు తెలియచేస్తే మరమ్మత్తులు చేస్తామని తెలిపారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో మహబూబాబాద్/ తొర్రూరు: సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తొర్రూరు మండలం హరిపిరాల గ్రామ హైస్కూల్ హెచ్ఎం బి వెంకటేశ్వరరావు, పి ఆర్ టి యు టి ఎస్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు గుణగంటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దు చేయాలని కోరుతూ సెప్టెంబర్ 1 పెన్షన్ విద్రోహ దినం రోజున రాష్ట్ర శాఖ పిలుపుమేరకు హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద పిఆర్టియు ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నాను ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బుధవారం ఈ సందర్భంగా మహా ధర్నాకు సంబంధించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీఎస్ హెచ్ఎం దర్గయ్య, ఉపాధ్యాయులు రవి, మధుకర్ రెడ్డి, సంపత్, కుమార్,శంకర్, రవీందర్, ఆంజనేయులు, మహేందర్, రాజు, లత, శ్రీనివాస్, సరిత, అనురాధ, రమేష్, అశోక్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి

విశాలాంధ్ర, తొర్రూరు: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, టిపిసిసి ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డిల ఆదేశాల మేరకు బుధవారం డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశంలో సాంకేతిక విప్లవ నిర్మాత అని,ఐటీ రంగ వృద్ధికి బాటలు వేశారని కొనియాడారు. దేశానికి సుస్థిర పాలన అందించి ఆదర్శంగా నిలిచాడని తెలిపారు. ఈ కార్య క్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు పెదగాని సోమయ్య, చాపల బాపురెడ్డి, గంజి విజయపాల్ రెడ్డి,ఏఎంసీ డైరెక్టర్లు కందాడి అచ్చిరెడ్డి,కంచర్ల వెంకట చారి పాల్గొన్నారు.

విశాలాంధ్ర, మల్కాజిగిరి : భారతదేశ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 81వ జయంతి వేడుకలు మౌలాలి చౌరస్తాలో మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు ఆధ్వర్యంలో పూల మాలా వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కటింగ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ప్రేమ్ కుమార్, జితేంద్ర నాథ్, వెంకటేష్ యాదవ్, లక్ష్మీ కాంత్ రెడ్డి, డివిజన్ ప్రెసిడెంట్ పోతుల వినోద్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.కె శ్రీనివాస్, బి బ్లాక్ మహిళా అధ్యక్షురాలు ఆశ, సీనియర్ లీడర్ చంద్రశేఖర్, వెంకటేశ్వర్ రావు, మదర్, డివిజన్ అధ్యక్షులు సంపత్ గౌడ్, వైనాల ప్రవీణ్, యూసుఫ్, యాది, అమిత్, నర్సింగ్ రావు, గద్దం సత్తి, చంకు శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోల్ మోడల్‌గా నిలిచిన ఈ భూభారతి చట్టం

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రంలో అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను దశల వారీగా ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ భవనాల పరిధిలోకి తీసుకువస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా బుధవారం నాడు గచ్చిబౌలిలోని తాలిమ్‌లో ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన జరిగిన సందర్భంగా ఏర్పాటైన సభలో మంత్రి పొంగులేటి ప్రసంగించారు. గత ప్రభుత్వం అక్రమంగా తీసుకువచ్చిన ధరణి పోర్టల్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బంగాళాఖాతంలో కలిపేశామని, దేశంలోని 18 రాష్ట్రాలలో అధ్యయనం చేసి భూభారతి -2025 చట్టాన్ని రూపొందించామన్నారు. రోల్ మోడల్‌గా నిలిచిన ఈ భూభారతి చట్టం మేరకు రైతన్నల, ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు సదస్సులు నిర్వహించగా 8.60 లక్షల దరఖాస్తులు వచ్చాయని తెలపారు. వీటిలో 2లక్షల దరఖాస్తులు పరిష్కారం కాగా సుమారు 4లక్షల సాదాబైనామా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. రాష్ట్ర హైకోర్టు నిన్ననే ఈ సాదాబైనామాలపై ఉన్నస్టేను తొలగించినందున నిజమైన, అర్హత కలిగిన దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని మంత్రి పొంగులేటి ప్రకటించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగులేకున్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముందుకు సాగుతున్నామని , గత ప్రభుత్వ తప్పులను గమనించి ప్రజలు ఇందిరమ్మ రాజ్యాన్ని తెచ్చుకున్నారని అన్నారు. ప్రజల నమ్మకాన్ని వొమ్ము చేయకుండా ప్రగతి సాధనలో సాగుతున్నామని, ఈమేరకు ఒక్కొక్కటిగా అభివృద్ధి కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయని ,దానిలో భాగంగానే ఈ ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ భవనాల శంకుస్థాపన అని వివరించారు. ప్రస్తుతం జిహెచ్ఎంసీ, ఓఆర్ ఆర్ పరిధిలోగల 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ల రూపేణా సుమారు 62-63 శాతం ఆదాయం లభిస్తోందని, వీటిని 11 ఇంటిగ్రేటెడ్ భవనాల పరిధిలోకి తీసుకువస్తామని తెలిపారు. ఈరోజు శంకుస్థాపన చేసుకున్న ఈ భవనం అత్యాధునిక కార్పొరేట్ స్థాయిలో ఉండబోతోందని, సుమారు మూడు ఎకరాలలోని దాదాపు 50 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో, 300 కార్లు పార్కింగ్ సౌకర్యం తదితరాలతో నిర్మితమవబోతోందన్నారు.

న్యూట్రిప్లస్ నుండి మోనోఫ్లోరల్ హనీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రముఖ గ్లోబల్ డైరెక్ట్ - అమ్మకపు కంపెనీలో ఒకటైన క్యూనెట్, భారతదేశంలో తన ప్రీమియం న్యూట్రిప్లస్ మోనోఫ్లోరల్ హనీ రేంజ్ లాంచ్ చేసినట్లు ప్రకటించింది. రెండు అద్భుతమైన రకాలను - రాఫ్టిల్, మరియు తుల్సి పరిచయం చేసింది. గ్రామీణ తేనెటీగల పెంపకందారుల నుండి నైతికంగా మరియు స్థిరంగా లభించిన ఈ రెండు తేనెలు 100శాతం స్వచ్ఛమైన, సహజమైనవి, ప్రాసెస్ చేయనివి, వినియోగదారులకు ప్రామాణికమైన రుచి మరియు మంచి ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తున్నాయి. న్యూట్రిప్లస్ మోనోఫ్లోరల్ హనీ దాని సహజ పోషకాలు మరియు ఎంజైమ్లను కలిగి ఉండడంతో ఇది రోగనిరోధక శక్తిని పెంచడానికి, రోజువారీ అలసటను ఎదుర్కోవటానికి మొత్తం శ్రేయస్సుకు తోడ్పడటానికి సహాయ పడుతుంది. ప్రతి బ్యాచ్ తేనె స్వచ్ఛత, ప్రామాణికత మరియు మూలాన్ని ధృవీకరించడానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన బంగారు-ప్రామాణికాన్ని పరీక్షిస్తున్న న్యూక్లియర్ మాగ్నెటిక్ రెసొనెన్స్ లోకి వస్తుంది. తేనె దాని విలక్షణమైన రుచి ఆరోగ్యం రక్షణ కోసం విలువైనది.

మన ఆరోగ్యం మన చేతుల్లో...

విశాలాంధ్ర - కాప్రా : ప్రపంచ దోమల దినోత్సవాన్ని పునస్కరించుకొని కాప్రా సర్కిల్ ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో నాచారం ఎర్రకుంటలో దోమ కాటు వ్యాధుల నివారణ పై అవగాహన ర్యాలీని సీనియర్ ఎంటమాలజిస్ట్ మాదవ రెడ్డి బుధవారం ప్రారంభించారు. ర్యాలీని ఉద్దేశించి సీనియర్ ఎంటమాలజిస్ట్ మాధవరెడ్డి మాట్లాడుతూ సర్ రోనాల్డ్ రాస్ అనే బ్రిటిష్ మిలిటరీ వైద్యుడు బేగంపేట లో 1897లో ఆగస్ట్ 20వ తేదీనమలేరియా వ్యాధి మనుషులకు వ్యాపిస్తుంది అని తన ప్రయోగాల ద్వార ప్రపంచానికి తెలియజేయడంతో నోబెల్ బహుమతి కూడా లభించింది.ఆగస్టు 20వ తేదీన ప్రపంచ దోమల దినోత్సవంగా ప్రపంచం అంతా నిర్వహించు కుంటారని సీనియర్ ఎంటమాలజిస్ట్ మాధవరెడ్డి తెలిపారు. ఏఈ రమేష్ ఆధ్వర్యంలో ఎంటమాలజీ, శానిటేషన్, దవాకాన సిబ్బంది విభాగాల ఆధ్వర్యంలో ఎర్రకుంట లో దోమలు అభివృద్ధి చెందుటకు అనుకూల పరిస్థితులు వాటి అభివృద్ధి నిరోధించుటకు కావలసిన చర్యలు సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్ ఓ డాక్టర్ మధుసూదన్ రావు, సానిటరీ సూపర్వైజర్ సుదర్శన్, ఈఎఫ్ఏ నరసింహ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

మైబైల్ ఫోరెన్సిక్ వాహనం ప్రారంభం

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి,సింగరేణి: రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో నూతనంగా మొబైల్ ఫోరెన్సిక్ వాహనాన్ని బుధవారం రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. నేరానికి సంబంధించి సంఘటన స్థలంలో నిందితులను గుర్తించడంతో పాటు సాక్ష్యాధారాలను సేకరించే ఫోరెన్సిక్ విభాగాన్ని మరింత బలోపేతం చేస్తూ తెలంగాణ రాష్ట్ర ఫోరెన్సిక్ విభాగం రామగుండం పోలీస్ కమిషనరేట్ నూతనంగా మొబైల్ ఫోరెన్సిక్ వాహనాన్ని అందజేసింది. ఈ సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని,అత్యాధునిక పరికరాల తో రూపొందించ బడిన ఈ మొబైల్ ఫోరెన్సిక్ వాహనాని రామగుండం కమిషనరేట్ పోలీసులకు మరింత మెరుగైన సేవలందించనున్నదని అన్నారు.ఇకపై ఎద్కైనా నేరం జరిగిన ప్రదేశానికి ఫోరెన్సిక్, ఫింగర్ ప్రింట్ అధికారులు, సిబ్బంది ఈ మొబైల్ ఫోరెన్సిక్ వాహనంలో చేరుకోని సంఘటన జరిగిన స్థలం నుండి రక్తమరకలు, వ్రేలిముద్రలతో ఇతర సాక్ష్యాదారాలను సేకరించి సంబంధిత దర్యాప్తు అధికారికి ప్రాథమిక సాక్ష్యాధారాలను అందజేయడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమములో స్పెషల్ బ్రాంచ్ ఏసిపి మల్లారెడ్డి,ఏ ఓ శ్రీనివాస్, ఏ ఆర్ ఏసీపీ ప్రతాప్, ఏ. రాము, అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్ ఎఫ్ ఎస్ ఎల్,ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీ సేవలు మరువలేనివి

మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్

విశాలాంధ్ర-దుండిగల్: ప్రధాన మంత్రిగా రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు.బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి షాపూర్ నగర్ లో మాజీ ఎమ్మెల్యే,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ తన నివాసం వద్ద నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మాజీ ప్రధాని,భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ యువత భవిష్యత్తే దేశ భవిష్యత్తు అని సాంకేతిక,విద్య, వైద్య రంగాలలో అనేక సంస్కరణలు తీసుకొచ్చిన మహనీయుడు రాజీవ్ గాంధీ అని తెలిపారు.అణగారిన బతుకుల్లో నింపి,ఆఖరి క్షణం వరకు దేశం కోసమే బతికిన ఆధునిక భారత నిర్మాతని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,అభిమానులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహం ధ్వంసం చేసిన వారిని అరెస్టు చేయాలి

: ఆర్యవైశ్య సంఘం

విశాలాంధ్ర, నేరేడు చర్ల : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఆర్యవైశ్య సంఘం సూర్యాపేట జిల్లా ఉపాధ్యక్షుడు రాచకొండ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.నేరేడుచర్లలో విలేకరులతో మాట్లాడుతూ ఆయన, "దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహాత్ముడి విగ్రహాలను అవమానించడం తగదు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి" అని అన్నారు.

ప్రకటన

ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా **Hon'ble Chief Judicial Magistrate (CJM)** కోర్టు విజయవాడ ఎస్.టి.ఆర్. జిల్లా వారి **CC No.1088/2015, CR No.17/2009, U/S 7(C), E.C. Act and 406, 477 IPC** పటమట **P.S.** కేసులో ముద్దాయి అయిన **A2 దేశపాండే శిద్ధిరాములు,** తండ్రి లక్ష్మయ్య, వయస్సు 23 సం॥, కులము : ముత్రాసి, ఎల్లారెడ్డి విలేజ్ (మండలం), నిజామాబాద్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం, అనువారు **Hon'ble Court** నందు వాయిదాలకు హాజరు అగుటకు విఫలం అయినందున సదరు ముద్దాయిని కోర్టువారు ప్రకటించబడిన నేరస్థుడిగా పరిగణించినారు. కావున నెలరోజుల లోపు కోర్టుకు గాని లేదా పటమట **P.S.**కు గాని లొంగిపోవలసిందిగా తెలియపర్చ టమైనది. మరియు సదరు ముద్దాయి ఆచూకీ తెలిసిన వారు పటమట **P.S.** నందు **SHO** గారికి తెలిపరచవలసిందిగా కోరడమైనది.

Station House Officer
Patamata P.S.
Cell : 9440627036, 7794897770

తెలంగాణాలోని మేడ్చల్ మల్కాజిగిరిలో జరిగిన రాష్ట్ర 4వ మహాసభల చిత్రమాలిక

అరుణ పతాక రెపరెపలు

విశాలాంధ్ర-మేడ్చల్/మల్కాజ్‌గిరి: సీపీఐ రాష్ట్ర 4 మహాసభ బుధవారం కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వరరావు నగర్ (గాజుల రామారం) లో ఘనంగా ప్రారంభమయింది. ఈ సందర్భంగా తొలుత షాపూర్‌నగర్ కూడలి నుంచి మహాసభల ప్రాంగణం కామ్రేడ్ ఎస్.బాలమల్లేష్ హాల్ వరకు భారీ రెడ్ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రజానాట్య మండలి కళాకారులు ఆట పాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సీపీఐ సమర యోధులకు జోహార్లు అంటూ పార్టీ శ్రేణులు నినదిస్తూ ఎర్ర జెండాలు చేత బూని ముందుకు సాగారు. దాదాపు మూడు కిలో మీటర్ల పొడవునా దారి అరుణారుణమైంది. అరుణ పతాకాలు రెపరెపలాడాయి. ఎర్ర జెండా పోరాటాలకు నిలయమైన కుత్బుల్లాపూర్ ప్రాంతంలోని ప్రజలు సీపీఐ ప్రదర్శనను ఆసాంతం తిలకించారు. సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్ పాషా, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ప్రదర్శన అగ్రభాగాన నడవగా పార్టీ నాయకులు, ప్రతినిధులు, శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహాసభ ప్రాంగణంలో సీనియర్ నాయకులు కందిమళ్ల ప్రతాపరెడ్డి అరుణ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా మహాసభల ప్రాంగణం పార్టీ శ్రేణుల నినాదాలతో దద్దరిల్లింది. ప్రజానాట్యమండలి కళాకారులు తమ పాటలతో ఉత్తేజం నింపారు. ప్రముఖ కవి, నవచేతన పబ్లిషింగ్ హౌస్ సంపాదకులు ఏటుకూరి ప్రసాద్ అమరవీరుల స్థూపాన్ని ఆవిష్కరించారు. అమరవీరుల స్థూపం వద్ద డి.రాజా, కె.నారాయణ, అజీజ్ పాషా, కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, పశ్య పద్మ, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి, కె.శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాస రావు, కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్, ఇ.టి.నరసింహ, కళవేన శంకర్, ఎం.బాల నర్సింహ, ప్రముఖ సినీ నటుడు మాదాల రవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కౌన్సిల్ సభ్యులు, మహాసభల ప్రతినిధులు అమరవీరుల స్థూపం వద్ద పుష్ప గుచ్ఛాలుంచి నివాళులు అర్పించారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుల ఫొటో ఎగ్జిబిషన్, సభాపతి అమరవీరుల ప్రాంగణం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహాసభకు రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి 743 మంది పార్టీ ప్రతినిధులు హాజరయ్యారు.

సీపీఐ రాష్ట్ర 4వ మహాసభ ప్రదర్శన

బలమైన ఉద్యమాలు అవసరం: జాన్‌వెస్లీ

విశాలాంధ్ర-హైదరాబాద్ (పొట్లూరి నాగేశ్వరరావు నగర్): ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు, మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా తెలంగాణలో కమ్యూనిస్టు పార్టీలు బలమైన, మిలిటెంట్ తరహా ఉద్యమాలు చేపట్టాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ పిలుపునిచ్చారు. ఇందుకు వామపక్షాలు, అభ్యుదయవాదులు ముందుకు రావాలని కోరారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వరరావు నగర్ (గాజుల రామారం)లో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర 4వ మహాసభలో బుధవారం జాన్‌వెస్లీ సౌహార్ద సందేశమిచ్చారు. జాన్‌వెస్లీ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి బలమైన ఉద్యమాలు చేపట్టడం ద్వారానే కమ్యూనిస్టు పార్టీలు మరింత బలపడతాయని సూచించారు. ప్రజలలో ఉన్న అసమానతలపై చైతన్యం కల్పించి... వాటికి వ్యతిరేకంగా పోరాటాలు చేయడం కేవలం కమ్యూనిస్టు పార్టీల వల్లనే సాధ్యమన్నారు. హిట్లర్ లాంటి నియంతనే మట్టి కరిపించిన ఎర్రజెండాకు ప్రధాని మోదీ పెద్ద లెక్కకాదని, ఇలాంటి మోదీలను ఎర్రజెండా ఎంతోమందిని చూసిందని జాన్‌వెస్లీ చెప్పారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా, రాజ్యాధికారాన్ని నిర్వీర్యం చేసేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. అమెరికా సామ్రాజ్యవాద విధానాలకు మోదీ మోకరిల్లుతున్నారని, దేశ ప్రజలను అవమానించే విధంగా బీజేపీ వ్యవహరిస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను బీజేపీ అడ్డుకుంటుందని విమర్శించారు. ప్రభుత్వాలు విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించడం లేదని, కార్మిక, రైతుల హక్కులను కాలరాస్తున్నాయని దుయ్యబట్టారు. బలమైన కమ్యూనిస్టు ఉద్యమాలకు సీపీఐ తెలంగాణ రాష్ట్ర మహాసభ స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు.

ఏపీలో విభిన్న రాజకీయం: రామకృష్ణ

విశాలాంధ్ర-హైదరాబాద్ (పొట్లూరి నాగేశ్వరరావు నగర్): తెలంగాణ, ఏపీ విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో పూర్తి భిన్నమైన రాజకీయ వాతావరణం నెలకొన్నదని సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. విభజన తరవాత ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు పార్టీలు గడ్డుకాలాన్ని అధిగమిస్తున్నాయని వాటిని అధిగమించి ముందుకు వెళతామని ధీమా వ్యక్తం చేశారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వరరావు నగర్ (గాజులరామారం)లో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర 4వ మహాసభలో బుధవారం రామకృష్ణ సౌహార్ద సందేశమిచ్చారు. దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో ఇండియా ఐక్యసంఘటనకు కొన్ని పార్టీలు అనుకూలం, మరికొన్ని పార్టీలు వ్యతిరేకంగా ఉన్నాయని, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ప్రధాన పార్టీలన్నీ ఎన్‌డీఏ గొడుగు కిందే పనిచేస్తున్నాయని రామకృష్ణ విమర్శించారు. ఉప రాష్ట్రపతి ఎన్నిక, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బిల్లులకు మద్దతు తెలిపే విషయంలో ఏపీలో అధికార, ప్రతిపక్ష పార్టీలు ఎన్‌డీఏకే మద్దతునిస్తాయన్నారు. ఎన్‌డీఏకు వ్యతిరేకంగా ఒక్క ఓటు కూడా పడని ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమేనని రామకృష్ణ అన్నారు. ఏపీలో ప్రాంతీయ పార్టీలు టీడీపీ, జనసేన...బీజేపీతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయని, ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేస్తూ...దిల్లీలో మాత్రం మోదీకి గులాంగిరీ చేస్తోందని ఆరోపించారు. బీజేపీకి పూర్తిస్థాయి మెజార్టీ వస్తే రాజ్యాంగాన్ని మారుస్తారనే విషయంలో ఎటువంటి సందేహం లేదన్నారు. బీజేపీకి ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపై ఎటువంటి నమ్మకం లేదని, అందుకే రాజ్యాంగ రక్షణ, ప్రజాస్వామ్య పరిరక్షణకు, లౌకికవాదాన్ని నిలబెట్టుకునేందుకు, ప్రజా సమస్యల పరిష్కారానికి దేశ వ్యాప్తంగా బలమైన ఉద్యమాలు నిర్మించాలని రామకృష్ణ పిలుపునిచ్చారు.

ఎన్డీఏ తీరు మధ్యయుగాన్ని తలపిస్తోంది: రాహుల్ గాంధీ

న్యూదిల్లీ: తీవ్రమైన నేరారోపణలతో అరెస్టయి వరుసగా 30 రోజులు నిర్బంధంలో ఉంటే ప్రధాని, ముఖ్యమంత్రులు, మంత్రులను పదవి నుంచి తొలగించేందుకు వీలు కల్పించే మూడు బిల్లులను పార్లమెంటుకు ముందుకు బీజేపీ తీసుకురావడంపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ బిల్లులను ప్రవేశపెట్టి ఆమోదింపజేసుకోవాలనే ఎన్డీయే తీరు చూస్తుంటే మన దేశాన్ని మళ్లీ మధ్యయుగ కాలంలోకి తీసుకెళ్తున్నట్టు అనిపిస్తోందన్నారు. ఎన్నికైన ప్రజాప్రతినిధులను ఇష్టారాజ్యంగా, ఏకపక్షంగా తొలగిస్తామనే బెదిరింపు వాతావరణాన్ని ఈ బిల్లు సృష్టిస్తుందని రాహుల్ అన్నారు. 'సదరు వ్యక్తికి మీ ముఖం నచ్చకపోతే ఈడీకి చెప్పి కేసు పెట్టిస్తారు. 30 రోజుల్లోనే ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన వ్యక్తుల అధికారులను ఊడపీకేస్తారు' అని రాహుల్ ఆరోపించారు.

ధన్కర్ రాజీనామా వెనుక మిస్టరీ

మాజీ ఉప రాష్ట్రపతి ఆకస్మిక రాజీనామా, ఆయన మౌనం వెనుక అనేక ప్రశ్నలున్నాయని రాహుల్ అన్నారు. పాత ఉపరాష్ట్రపతి రాజీనామా చేసినప్పుడు వేణుగోపాల్ తనను కలిశారని, ఆయన వెళ్లిపోయారని తనతో చెప్పారని తెలిపారు. మాజీ ఉపరాష్ట్రపతి ఎందుకు రాజీనామా చేశారు? ఎందుకు ఆయన అజ్ఞాతంలోకి ఎందుకు వెళ్లిపోయారనేది పెద్ద మిస్టరీగా ఉందని అన్నారు. ఒక్క మాట కూడా మాట్లాడని పరిస్థితిలో ఆయన ఎందుకు ఉన్నారు? దీని వెనుక ఏదో మిస్టరీ ఉందని ఆరోపించారు. ప్రస్తుత రాజకీయ వాతావరణం ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెట్టేసేలా ఉందని, వ్యవస్థలు బలహీనపరుస్తూ, ఎన్నికైన ప్రజాప్రతినిధులను భయపెడుతున్నారని చెప్పారు. ఈ పరిస్థితుల్లో మనం జీవిస్తున్నామని అన్నారు.

రాజీవ్ ప్రతాప్ రూడీతో కరచాలనం

ఇటీవల జరిగిన కాన్‌స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియా ఎన్నికల్లో గెలుపొందిన బీజేపీ ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ ప్రతాప్ రూడీని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ బుధవారం అభినందించారు. ఆయనతో కరచాలనం చేశారు. పార్లమెంటు వద్ద మీడియాతో రాహుల్ మాట్లాడుతుండగా అటువైపు ప్రతాప్ రూడీ వచ్చారు. రాహుల్ వెళ్లి ఆయనను అభినందించారు.

వ్యక్తిగత దాడికి ఆస్కారం లేదు

ఇది రాష్ట్రాల మధ్య పోటీ కాదు: ఉపరాష్ట్రపతి ఎన్నికపై జస్టిస్ సుదర్శన్ రెడ్డి

న్యూదిల్లీ: ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో వ్యక్తిగత దాడికి అవకాశం లేదని 'ఇండియా' అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి అన్నారు. ఈ ఎన్నిక పోరాటం కాదు... ఆరోగ్యకరంగా, గౌరవప్రదంగా జరిగే మంచి పోటీ అని చెప్పారు. 'నేను వ్యక్తిగత వ్యాఖ్యలు చేయను. ఎన్డీయే అభ్యర్థి రాధాకృష్ణన్ కూడా అలా చేయరని ఆశిస్తున్నా. ఆయన చాలా అనుభవజ్ఞుడు, రెండు-మూడు రాష్ట్రాలకు గవర్నర్‌గా పనిచేశారు. మేమిద్దరం భారత పౌరులం, తమిళనాడు - తెలంగాణకు ప్రత్యేక పౌరసత్వం లేదు' అని వ్యాఖ్యానించారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి తెలంగాణకు చెందిన వ్యక్తి. ఎన్డీయే అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ తమిళనాడుకి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు. వీరిద్దరి మధ్య పోటీని తెలంగాణ-తమిళనాడు మధ్య పోరుగా కథనాలు రావడంపై స్పందిస్తూ ఇది తమిళనాడు-తెలంగాణ మధ్య పోటీ కాదని, ఉపరాష్ట్రపతి ఎన్నిక అని నొక్కిచెప్పారు. ఈ పోటీ న్యాయంగా జరుగుతుందని జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఆకాంక్షించారు. ఉప రాష్ట్రపతి ఎన్నిక సైద్ధాంతిక పోరుగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చెప్పడంపై ప్రశ్నకు 'వాళ్లు సైద్ధాంతిక పోరు సాగిస్తున్నారు. ఓ సంస్థతో సంబంధం ఉన్న అభ్యర్థికి మద్దతు లభిస్తుందన్న చర్చ జరుగుతోంది. నేను ఏ సంస్థకు చెందిన వాడిని కాను. ఏ పార్టీతోనూ సంబంధాలు లేవు. కేవలం

రాజ్యాంగానికే కట్టుబడతాను. ఎన్నికల కోసం నినాదం అవసరం. నా నినాదం సామాజిక న్యాయం' అని జస్టిస్ సుదర్శన్ రెడ్డి సమాధానం ఇచ్చారు. రాజ్యాంగ పరిరక్షణ అన్న కాంగ్రెస్ నినాదానికి మీ అభ్యర్థిత్వం న్యాయం చేస్తుందా అని ప్రశ్నిస్తే ఒక న్యాయమూర్తిగా, న్యాయవాదిగా నా ప్రథమ కర్తవ్యం రాజ్యాంగాన్ని కాపాడటం' అని బదులిచ్చారు. 'నేను సుప్రీంకోర్టులో ఉన్నప్పుడు, హైకోర్టులో ఉన్నప్పుడు రాజ్యాంగాన్ని పరిరక్షించాను. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, న్యాయవాదిగా ఉన్నప్పుడే అదే చేశాను. అదే సంప్రదాయాన్ని ఉపరాష్ట్రపతిగా కొనసాగిస్తాను. ఉప రాష్ట్రపతి పదవి కూడా రాజ్యాంగ్యంతో ముడిపడి ఉంటుంది. ముందు నుంచి చేస్తున్నదే ఆ కుర్చీలో కూర్చున్నా చేస్తాను. ఉప రాష్ట్రపతి పదవిలో ఉంటే భిన్నంగా ఏమీ ఉండదు' అని ఆయన చెప్పారు. ఈ ఎన్నికల సంఖ్యా క్రీడ వ్యాఖ్యలపై జస్టిస్ సుదర్శన్ రెడ్డి స్పందిస్తూ 'రాజకీయ పార్టీలు ఓటు వేయవు. ఇక్కడ విప్ ఉండదు. పార్లమెంటు సభ్యులే ఉప రాష్ట్రపతిని ఎన్నుకుంటారు. ఎవరిని ఎన్నుకోవాలో వాళ్లు నిర్ణయించుకుంటారు. ఈ ఎన్నికల్లో అనుకూల ఫలితం వస్తుందని నమ్ముతున్నాను' అని అన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నిక సెప్టెంబరు 9న జరగనున్నది. జస్టిస్ సుదర్శన్ రెడ్డి ప్రత్యర్థి రాధాకృష్ణన్ బుధవారం తన నామినేషన్ దాఖలు చేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.